VISALAANDHRA, VIJAYAWADA-4. Phone . 376 * * * Regd No. H- 203

విశాలాంధ్ర

706337

సంపుటి 14 సంచిక 45] విజయవాడ * 28-4-1964 మంగళవారం [6 పేజీలు 7 న.పై.

కమ్యూనిస్టుపార్టీనుండిశ్రీసుందరయ్య మొదలగు 11 మంది బర్తరఫ్

ప్రతిపక్ష నాయకత్వ స్థానాల నుండి కూడా తొలగింపు

పోటీపార్టీ స్థాపనకు బాధ్యులైన నాయకులపై ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి శిక్షణ చర్యలు

జాతీయసమితి తీర్మానాలను ధిక్కరించిన గుంటూరు ఖమ్మం కర్నూలు, నిజామాబాద్, విజయవాడ జిల్లా సమితుల రద్దు

హైదరాబాద్, ఏప్రిల్ 27

ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ ప్రతిపక్ష నాయకులు, ఉపనాయకులు అయిన శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య, శ్రీ తరిమెల నాగిరెడ్డిగార్లను ఆ పదవులనుండి తొలగించుతూ గత నాలుగు రోజులుగా ఇక్కడ జరిగిన ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి నిర్ణయించింది. వీరి స్థానంలో నూతన నాయకులను ఎన్నుకొనడానికి శాసనసభ కమ్యూనిస్టు ప్రజాతంత్ర సంఘటన కార్యవర్గానికి అధికార మిచ్చింది.

శ్రీ సుందరయ్య, మరి పదిమంది పోటీపార్టీ స్థాపనకు నాయకత్వం వహించి, పవిత్రమైన భారత కమ్యూనిస్టుపార్టీ సభ్యత్వానికి అనర్హులమని నిరూపించుకొన్నారు గనుక, వారిని పార్టీనుండి బర్తరఫ్ చేస్తూ సమావేశం తీర్మానించింది.

ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి సమావేశ నిర్ణయాలను నేడు పార్టీ తరఫున శ్రీ వై. వి. కృష్ణారావు, డాక్టర్ రాజబహదూర్ గౌడ్ గార్లు పత్రికా విలేకరులకు తెలియజేశారు. ఆగస్టు నెలలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టుపార్టీ 10 వ మహాసభ గుంటూరులో జరుగుతుందని వీరు తెలియజేశారు. సమావేశనిర్ణయాల గురించిన ప్రకటన పూర్తి పాఠం ఇది:

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి సమావేశం ఏప్రిల్ 23 నుండి 26 వరకు హైదరాబాదులోని ఆంధ్ర సారస్వత పరిషత్తుహాలులో జరిగింది. శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు శ్రీ మగ్దుం మొహియుద్దీన్, పార్లమెంటు సభ్యుడు శ్రీ ఈశ్వరరెడ్డి విజయవాడ నగర కమ్యూనిస్టు నాయకుడు శ్రీ టి. వెంకటేశ్వరరావుగార్లు అధ్యక్ష వర్గంగా ఎన్నుకోబడ్డారు.

కౌన్సిల్ సభ్యులు 53 మంది. ప్రత్యేకాహ్వానితులు 35 మంది సమావేశానికి హాజరయ్యారు.

సమావేశం ప్రారంభంలో బల్గేరియా కమ్యూనిస్టుపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బల్గేరియా అధ్యక్షుడూ అయిన డిమిటూర్ గొనవ్ మృతికి, నెల్లూరుజిల్లా కమ్యూనిస్టు, కిసాన్‌సభ నాయకుడు, అఖిలపక్ష కార్యాచరణ సమితి కావలి తాలూకా కన్వీనరూ అయిన శ్రీ అల్లంపాటి రామచంద్రారెడ్డి మృతికి సంతాపం వెలిబుచ్చుతూ తీర్మానం చేశారు.

ఎజెండాలో మొదటి అంశం "జాతీయసమితి సమావేశ నిర్ణయాలు: ఆంధ్రప్రదేశ్‌లో కొంతమంది కామ్రేడ్సు విచ్ఛిన్నకార్యకలాపాలు–శ్రీ సుందరయ్య నాయకత్వాన పోటీపార్టీ స్థాపన" గురించి కార్యదర్శి శ్రీ నీలం రాజశేఖర రెడ్డి తమ నివేదిక యిచ్చారు.

శ్రీ చండ్రరాజేశ్వరరావు, శ్రీమగ్దుం మొహియుద్దీన్‌గార్లు డాంగే లేఖలని పిలువబడే లేఖల గురించి తాము స్వయంగా పరిశీలించి వచ్చిన విషయాలను తెలియజేశారు.

40 సంవత్సరాల క్రితంబ్రిటిష్ వైస్రాయికి శ్రీ డాంగే వ్రాసినట్లు చెప్పబడే ఈ లేఖలు నిజమైనవికావని వీరు స్పష్టంచేశారు

శ్రీబద్దం ఎల్లారెడ్డిమాట్లాడుతూ ఈలేఖలకూ 40 సంవత్సరాల డాంగే జీవితానికీ ఎంతమాత్రం సామ్యంలేదని అన్నారు. శ్రీ సుందరయ్య, ఆయన మిత్రుల పథకంగురించి తనకు ఎట్టిభ్రమలూలేవని, కాని నంబూద్రిపాద్, జ్యోతి బాసు వంటి కామ్రేడ్స్ యీ పథకానికి బలైపోవడమే తనకు ఆశ్చర్యకరంగా ఉందని అన్నారు. ఇప్పుడు ఎవరు, ఎవరికి నాయకత్వం వహించుతున్నారో తేటతెల్లమౌతూనే ఉంది. వీరు తమ వైఖరిని పునరాలోచించుకోవలసిందిగా కోరుతున్నామని అన్నారు.

సమావేశంలో జరిగిన చర్చలను బట్టి సభ్యులు, ఆహ్వానితులు వెలిబుచ్చిన అభిప్రాయాలలో డాంగే లేఖలని పిలువబడే లేఖలు బ్రిటిష్ గూఢచారిశాఖ సృష్టించినవని ఆ రోజులలో జాతీయ నాయకులను, పత్రికల వారిని అపఖ్యాతిపాలుచేయడానికి, వారిలో వారికి అనుమానాలు, సందేహాలు కల్గించి విభేదాలు సృష్టించడానికి, కుట్రలు పన్నడానికి ఈ లేఖలు సృష్టించేవారని తెలియజేశారు. అదేసమయంలో జాతీయ సమితి ఈ లేఖల గురించి, ఒక విచారణ కమిటీ నియమించినందుకు హర్షం వెలిబుచ్చారు. ఈ విచారణద్వారా ఈ లేఖలకు సంబంధించిన కుట్ర బట్టబయలు పడుతుందని, ఉద్దేశపూర్వకంగా లేవదీసిన గందరగోళం తొలగి పోతుందని సభ్యులు అభిప్రాయాలు వెలిబుచ్చారు.

32 మంది సభ్యులను సస్పెండు చేస్తూ జాతీయసమితి చేసిన తీర్మానాన్ని ఆమోదించాలని శ్రీ వై. వి. కృష్ణారావు చేసిన ప్రతిపాదనను సమావేశం వారు ఆమోదించారు. ఇప్పుడైనా ఈ జాతీయ సమితి సభ్యులు పోటీపార్టీ స్థాపనగురించి తమ విచ్ఛిన్న కార్యకలాపాలను విరమించుకొని తిరిగి రావడానికి వ్యవధి ఉందని సభ్యులు అభిప్రాయాలు వెలిబుచ్చారు.

ఆంధ్రలో పోటీపార్టీ

అటు పిమ్మట, ఆంధ్రలో పోటీ పార్టీ స్థాపన గురించి శ్రీ తమ్మారెడ్డి సత్యనారాయణ ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని సమావేశంవారు ఏక

(మిగతా 6 వ పేజీలో)

తూ. పాకిస్తాన్‌లో మైనారిటీలపై అత్యాచారాలు

ఉరాసకు భారత క్రైస్తవుల విజ్ఞప్తి

కలకత్తా, ఏప్రిల్ 27

తూర్పు పాకిస్తాన్‌లో క్రైస్తవమతం వారిపైనా, యితర అల్పసంఖ్యాక వర్గాల పైనా జరుగుతున్న దారుణాలకు వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితిలో ప్రజాభిప్రాయాన్ని వ్యక్తం చేయవలసిందిగా నేడిక్కడ జరిగిన ఒక పెద్ద క్రైస్తవసభలో వివిధదేశాలకు విజ్ఞప్తి చేశారు.

భారత క్రైస్తవ కాంగ్రెస్ ఆధ్వర్యాన యేర్పాటయిన ఈసభలో పాకిస్తాన్ నుండి తరలివచ్చిన వారికి జరిగిన నష్టాలకు పరిహారం డిమాండు చేయవలసిందిగా భారత ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

భారత సింహళ బైబిల్ సొసైటీకి చెందిన ప్రముఖుడు డాక్టర్ గ్రిఫిత్స్ శాంతి ప్రార్థనలు జరిపారు.

సభలో, పశ్చిమ బెంగాల్ శాసనసభ మాజీ స్పీకర్ శ్రీ బంకింకార్ అనే ఆయన గూడా ప్రసంగించారు.

విద్యుచ్ఛక్తి బోర్డు హామీపై పనివారి సమ్మె విరమణ

కార్మికుల కోర్కెలను సానుభూతితో పరిశీలిస్తామని శ్రీజె.వి.నరసింగ రావుప్రకటన

హైదరాబాద్, ఏప్రిల్ 26

విద్యుచ్ఛక్తి కార్మికుల కోర్కెలను సానుభూతితో పరిశీలించగలమని రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు అధ్యక్షుడు శ్రీ జె. వి. నరసింగరావు ఇచ్చిన హామీపై ఆంధ్ర రాయలసీమ జిల్లాలలోని ఎనిమిదివేలమంది విద్యుచ్ఛక్తి పనివారు నేడు సమ్మెను విరమించారు. సమ్మెలో పాల్గొన్నవారిపై తాము ఎట్టి చర్యలను తీసుకోబోమనికూడా శ్రీ నరసింగరావు హామీ ఇచ్చారు. ఈ విషయం నేడు ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి కార్మికుల యూనియన్ అధ్యక్షుడు శ్రీ కె. యల్. నరసింహం వెల్లడించారు. శ్రీ జె. వి. నరసింగరావు కూడా ఇదే విధమైన ప్రకటన చేశారు.

జీతాలు, కరువుభత్యం పెంపుదల మొదలగు కోర్కెలపై ప్రభుత్వం అవలంబిస్తున్న మొండివైఖరి ఫలితంగా సమ్మె ప్రారంభమయిన విషయం పాఠకులకు విదితమే.

శ్రీ కె. యల్. నరసింహం, శాసనసభ్యుడు శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు శ్రీ నరసింగరావును కలుసుకొని విద్యుచ్ఛక్తి కార్మికుల కోర్కెలను గురించి చర్చించారు.

వీరు ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డిని కూడా కలుసుకొని, కార్మికుల కోర్కెలను అంగీకరించ వలసిందిగా ఆయనకు విజ్ఞప్తి చేశారు.

ఇర్రిగేషన్, విద్యుచ్ఛక్తి శాఖ మంత్రి శ్రీ సుబ్బారెడ్డి కార్మికుల కోర్కెలనుపరిశీలించగలరని శ్రీ బ్రహ్మానందరెడ్డి కార్మికుల ప్రతినిధులకు చెప్పినట్లు తెలుస్తోంది. శ్రీ కె.యల్. నరసింహం, శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు పై ఇద్దరి మంత్రులనేకాక శ్రీ సుబ్బారెడ్డిని, కార్మికమంత్రి శ్రీ టి. వి. గురుమూర్తిని కూడ కలుసుకొని సమ్మెపరిస్థితిని, కార్మికుల కోర్కెలను గురించి చర్చించారు.

తరువాత శ్రీ కె. యల్. నరసింహం ఒక ప్రకటనచేస్తూ, కార్మికుల కోర్కెలను సానుభూతితో పరిశీలించగలమని సమ్మెలో పాల్గొన్న కార్మికులపై ఎట్టిక్రమశిక్షణా చర్య తీసుకోబోమని శ్రీ నరసింగరావు తమకు హామీ ఇచ్చారని ఈ హామీలను జాగ్రత్తగా పరిశీలించిన పిదప సమ్మెను విరమించాలని యూనియన్ నిర్ణయించినదని వెల్లడించారు.

కార్మికుల కోర్కెలు ప్రభుత్వం గట్టిగా పరిశీలిస్తున్నదని, సమ్మెలో పాల్గొన్నవారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోబోమని శ్రీ జె. వి. నరసింగరావు కూడ ఒక పత్రికా ప్రకటన చేశారు.

సమ్మెకాలంలో క్రమశిక్షణతో, ఐక్యతతో ప్రశాంతంగా కార్మికులు వ్యవహరించినందుకు కార్మికులను, పనివారి కోర్కెలపట్ల సానుభూతి ప్రదర్శించినందుకు ప్రజలను శ్రీ కె. యల్. నరసింహం తన ప్రకటనలో అభినందించారు. సమ్మె చేస్తున్న 8 వేల మంది వెంటనే పనిలో చేరవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

జె యింజనీరింగ్ సమ్మెపై రక్షణచట్ట ప్రయోగం

ఏ. ఐ. టి. యు.సి నిరసన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27

1963 డిసెంబరు 17 తేదీనుండి జరుగుతున్న కలకత్తా జెయింజనీరింగ్ కార్మికుల సమ్మెపై దేశరక్షణ నిబంధనలను ప్రయోగించి, సమ్మెను నిషేధించిన పశ్చిమబెంగాల్ ప్రభుత్వచర్యను తీవ్రంగానిరసిస్తూ అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కార్యదర్శి వర్గం ఒక ప్రకటన చేసింది.

యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ కనోధన్ రాయని మిగతా యూనియన్ ప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రితో సంప్రతింపులు జరుపుతుండగానే అరెస్టు చేశారు.

కార్మికుల న్యాయమైన పోరాటాన్ని అణచివేసేటందుకు రక్షణ చట్టాన్ని దుర్వినియోగపర్చడాన్ని, సమ్మె దారుల నాయకుణ్ణి యీ చట్టంక్రింద నిర్బంధించడం దారుణమని యీ ప్రకటన ఖండించింది.

అరెస్టయిన కార్మికనాయకుని విడుదలచేసి సమ్మెను అక్రమమని చేసిన ప్రకటనను ఉపసంహరించి త్రైపాక్షిక సమావేశం దాఖలా వివాదాన్ని పరిష్కరించ బూనుకోవలసిందిగా యీ ప్రకటన ప్రభుత్వాన్ని కోరింది.

రాష్ట్ర పరిపాలనా సంస్కరణల కమిటీ

శ్రీ నూకల రామచంద్రారెడ్డి నాయకత్వాన నియామకం

హైదరాబాద్, ఏప్రిల్ 27

రాష్ట్ర రెవిన్యూమంత్రి శ్రీ నూకల రామచంద్రారెడ్డి అధ్యక్షతన పరిపాలన సంస్కరణ కమిటీని ప్రభుత్వం నియమించినట్లు ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి నేడు ప్రకటించారు.

కమిటీలో సభ్యులు: మాజీమంత్రులు శ్రీ యస్. బి. పి. పట్టాభి రామారావు, శ్రీవి. బి. రాజు, శ్రీ తెన్నేటి విశ్వనాథం, శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ శ్రీ గులాం హైదర్, అడ్మినిస్ట్రేటివ్ కాలేజి ప్రిన్సిపాల్ శ్రీ ఆర్. యల్. గుప్త, పరిశ్రమలశాఖ కార్యదర్శి శ్రీ ఎ.కె. రావు, రిటైర్డు ఐ.ఏ.యస్. ఆఫీసరు శ్రీ ఎ. వెంకట్రాయుడు కమిటీకి కార్యదర్శిగా వ్యవహరిస్తారు.

కమిటీ ప్రభుత్వానికి తన నివేదికను ఆరు నెలల్లో అందజేయాలి. శాసనసభ బడ్జెట్ సమావేశ సందర్భంలో ముఖ్యమంత్రి చేసిన ప్రకటన ప్రకారం కమిటీ నియమింపబడింది.

పి. డబ్ల్యు. డి. వర్కర్ల సమ్మె నోటీసు విరమణ

ధవళేశ్వరం, ఏప్రిల్ 27

ఏప్రిల్ 6 వ తేదీనగాని, ఆ తదుపరిగాని సమ్మెచేస్తామని యిచ్చిన సమ్మెనోటీసును విరమిస్తూ, ఆంధ్ర పి. డబ్ల్యు. డి. వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ. వి. రమణయ్య ఈ నెల 25 వ తేదీన ఒక ప్రకటన చేశారు.

ఈ శాఖకు సంబంధించిన ఉన్నతాధికారులతో ఏప్రిల్ 2 వ తేదీన హైదరాబాద్‌లో సంప్రతింపులు జరిగాయి. వేతనాల పునర్నిర్ణయం, 5 రూపాయల డి. ఎ. మొదలైన సమస్యలపై అధికారులతో జరిగిన సంప్రతింపులు సంతృప్తికరంగా లేకపోయాయి.

తిరిగి 17 వ తేదీన లేబర్ కమిషనర్ సంప్రతింపులు జరిపారు. ఈ సంప్రతింపుల ఫలితం కొంత ఆశాజనకంగా వుందని యూనియన్ భావించింది.

ఈ దృష్ట్యా సమ్మె నోటీసును విరమించడానికి, నిడదవోలు, ధవళేశ్వరాలలో జరిగిన కార్మికుల సర్వసభ్య సమావేశాలు నిర్ణయించాయి.

తిరిగి అవసరమైతే సమ్మెనోటీసు యివ్వడానికి యూనియన్ కార్యవర్గానికి అధికారమిస్తూ యీ సమావేశాలు నిర్ణయించాయి.

రాష్ట్ర లేబర్ కమిషనర్ తాము జరుపుతున్న సంప్రతింపులద్వారా కార్మికుల న్యాయమైన కోర్కెలను అంగీకరింపజేయ గలరని ఆశిస్తున్నామని శ్రీ రమణయ్యగారు యీ ప్రకటనలో చెప్పారు.

ప్రజాస్వామ్యం, సోషలిజం గురించిన తీర్మానం

శీఘ్రమే అమలు జరపాలని శ్రీ నందా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26

సాధ్యమైనంత స్వల్పకాలంలో ప్రజాస్వామ్యం, సోషలిజం గురించిన తీర్మానాన్ని అమలు జరపడం అవసరమని కేంద్ర హోమ్ శాఖామంత్రి శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి నేడిక్కడ అన్నారు. సోషలిస్టు కార్యాచరణకై కాంగ్రెస్ గోష్ఠిలో శ్రీ నందా మాట్లాడుతూ "సోషలిజం సాధించడంలో మనకు అడ్డంకిగా ఉన్నవి ఏమిటో మనం తెలుసుకోవాలి. మనకు ఉత్సాహం కొరతగా ఉందా? సంసిద్ధంగా లేమా? మనం చేయవలసినదంతా చేస్తున్నామా ఈ ప్రశ్నలకు సామాన్య మానవునికి మనతో సహా ప్రతి కాంగ్రెసువాది సమాధానం చెప్పుకోవాలి" అన్నారు.

"కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కామరాజ్ ఒక సందేశం పంపించుతూ ప్రజాస్వామిక సోషలిజం గురించి ప్రజలకు బాగా వివరించిచెప్పాలి" అని అన్నారు.

"ఈగోష్ఠికి భువనేశ్వర్ మహాసభ తీర్మానాలనుబట్టే కాంగ్రెస్ ప్రభుత్వాలు నడుస్తున్నాయి. ఈకార్యక్రమాన్ని జయప్రదంగా అమలు జరపాలంటే ప్రజా సహకారాన్నిగూడా సంపాదించాలి" అన్నారు.

కామన్వెల్తు ప్రధానుల సమావేశం:

'దక్షిణ రొడీషియాను ఆహ్వానించరాదు

భారతదేశ వైఖరిని వివరిస్తూ లోక్‌సభలో నెహ్రూ ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7

లండన్‌లో జరుగనున్న కామన్‌వెల్తు ప్రధానులసమావేశానికి దక్షిణ రొడీషియాను ఆహ్వానించకూడదనేదే భారతదేశంవైఖరి అని ప్రధాని నెహ్రూ నేడు లోక్‌సభలో చెప్పారు.

దక్షిణ రొడీషియాను ఆహ్వానించే విషయమై బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశాన్ని సంప్రతించిందాఅని శ్రీహేందారుబా అడిగిన ప్రశ్నకు శ్రీ నెహ్రూ యిలా సమాధానమిచ్చారు:

"వారు మనల్ని సంప్రదించారనుకోను మనల్ని సంప్రతిస్తే, దక్షిణ రొడీషియాను ఆహ్వానించడానికి మనం సుముఖంగాలేమని సమాధానం ఇస్తామనడం స్పష్టమే.

మరొక ప్రశ్నకు సమాధానమిస్తూ, ఈ సమావేశంలో భారతదేశానికి సంబంధించిన సమస్యలేవీ చర్చకువచ్చే అవకాశంలేదన్నారు.

సమావేశం ఎజెండా తమ కింకా అందలేదని మామూలుగా కాశ్మీర్ వంటి సమస్యలు యీ సమావేశంలో చర్చకు రావనన్నారు.

ఉరవకొండ తాలూకా గ్రామాల్లో తిండిగింజల జప్తు

రక్షణచట్టంక్రింద పదిమంది రైతుసంఘ, కమ్యూనిస్టు కార్యకర్తల అరెస్టు

ఉరవకొండ, ఏప్రిల్ 26

అనంతపురం జిల్లా ఉరవకొండ తాలూకాలో రెవిన్యూ అధికారులు రైతుల యిండ్లలోని తిండి గింజలను జప్తుచేయ నారంభించారు. పత్తిపున్నా దాన్ని జప్తుచేయక కసికొద్దీ తిండి గింజలనే జప్తు చేశారు. పదిమంది రైతుసంఘ, కమ్యూనిస్టు ప్రముఖకార్యకర్తలను కూడా రక్షణ చట్టంక్రింద అరెస్టు చేశారు.

(అరెస్టులకు సంబంధించిన వార్తలు యిదివరలో క్లుప్తంగా ప్రకటించాం. —సం)

ఉరవకొండ తాలూకాలో ఈ నెల 18 వ తేదీన డిప్యూటీ తహశీల్దార్ కొట్టాలపల్లె గ్రామంలో నిర్బంధంగా వసూళ్లకు పూనుకొన్నారు. ఆ సందర్భంలో అక్కడ ఉన్న రైతు కార్యకర్తలు శ్రీ యస్. వి. రమణ (అన్నేటు), శ్రీ యస్. రామచంద్రారెడ్డి (వాలికి) శ్రీ ఎ. గెలవరెడ్డి, శ్రీ ఎ. శివరుద్రప్ప గారలు శాంతియుతంగా కొంతకాలం వ్యవధినివ్వమని కోరినారు. అందుపై రక్షణచట్టం క్రింద పోలీసులు వారిని అరెస్టు చేయించారు. అదేరోజు శ్రీ జే. సి. బాలయ్య గారిని కూడ ఇదేకారణంతో అరెస్టుచేశారు. 19 వ తేదీన రివెన్యూడివిజనల్ ఆఫీసరు కొట్టాలపల్లి గ్రామంలో రైతులయిండ్లకు పోయి సోదాచేయించి ధాన్యం కొలతగాని, తూకం గాని చేయకుండ స్వాధీనం చేసుకుంటుండగా, జిల్లా రైతుసంఘ కార్యదర్శి శ్రీ వి.హనుమంతరెడ్డి కొంతమంది రైతులతో ఈ విషయంలో ఆర్. డి. ఒ. దగ్గరకు రాయబారం వెళ్ళారు. ఆయనను కూడ అరెస్టుచేయించారు.

అదే విధంగా అరోజు సాయంకాలం హంపనహాళు గ్రామంలో డిప్యూటీ తహశీల్దారు తూకం వేయకుండ ధాన్యం జప్తు చేస్తుండగా తాలూకా కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ టి. రంగన్న, శ్రీ జి.సి. నరసింహప్ప శ్రీ యం. నారాయణస్వామిగార్లను రక్షణ చట్టంక్రింద అరెస్టు చేశారు. మరల 20వ తేదీ అమిదాల గ్రామంలో జిల్లా యువజన సంఘాధ్యక్షుడు శ్రీ వి. నారాయణరెడ్డిగారిని ఇదే కారణంతోనే అరెస్టు చేశారు.

ఈ విధంగా రివెన్యూ అధికారులు పోలీసు బలగంతో రైతులను భ్రాంతులను చేసి నానా బీభత్సం చేస్తున్నారు. రెవిన్యూ డివిజనల్ ఆఫీసరు సత్యాగ్రహ కార్యకర్తలను దేశద్రోహులుగా చిత్రిస్తూ ప్రచారం చేస్తున్నారు. రైతుల భూముల పట్టాలు రద్దు చేస్తామని, అప్పుడు బతికితే అప్పుడు తమకు తోచిన విధంగా రైతుల ఆస్తిని స్వాధీనం చేసుకొంటామనీ, ఆ ఆస్తిని తూకం గాని, కొలత గాని వేయనని బెదిరిస్తున్నారు. రైతుల పట్ల చాల దురుసుగా మాట్లాడుతున్నారు.

ఈ సంవత్సరం జొన్నపంట తప్ప మిగిలిన పంటలన్ని పూర్తిగా పాడయిన సంగతి అందరికీ తెలిసిన సత్యమే మైనా డిప్యూటీ తహశీల్దారు, రివెన్యూ డివిజనల్ ఆఫీసరు, కలెక్టర్లు ఎక్కువపంటలు పండినట్లు వ్రాయడం వల్ల ప్రజలెంత ఆందోళన చేసినా పెడచెవిని బెట్టి విపరీతమైన నిర్బంధంలో జప్తులు సాగించడంపట్ల వారు చాల ఆందోళన చెందుచున్నారు.

ఇంతవరకు ఈ తాలూకాలో ఈ క్రింది విధంగా జప్తులు జరిగాయి.

1. బొట్టిపాడు యం. గోవిందులు రెండు బండి చక్రాలు, 2. నాగన్న 123 సేర్ల జొన్నలు, కొట్టాలపల్లి శ్రీ అల్లు పెద్దయ్యెర్రప్ప 8 బస్తాల కొర్రలు, అమిదాల: 1. గుర్రం శ్రీరాములు 10 బస్తాలు సజ్జలు, 2. కొరకూటి సుబ్బయ్య 10 బస్తాలు కొర్రలు, 3. కేటూరు ఎర్రప్ప 1 కరెంటు మోటారు, 4. వేలూరు చిన్న రామన్న 10 బస్తాలు జొన్నలు, 5. చాకాల ఓబిరెడ్డి, 6. చిన్న వెంకటరెడ్డి, 7. తిమ్మప్ప, 8. శీనప్ప, 9. సుబ్బయ్య, 10. చిన్నరంగప్పగార్ల యిండ్లు కూడ జప్తు చేశారు.

వందనహాళు: (1) ఎ. సి. తిప్పారెడ్డి 10 బస్తాలు జొన్నలు. (2) కురుబ గోవిందప్ప 5 బస్తాల జొన్నలు (3) వి. పక్కీరప్ప (4) గిడ్డయ్యగార్ల యిండ్లలో యింతవరకు జప్తు చేశారు. ఇంకా తీవ్రంగా పోలీసుబలంతో గ్రామాలమీదపడి రైతుల యిండ్లమీద దాడి చేస్తున్నారు. ఈ జప్తు చేసిన సరుకును కొలత గాని తూకంగాని వేయుటలేదు. రైతులు అధికారులను తిండిగింజలు విడిచి ప్రత్తి జప్తు చేసుకొమ్మని విజ్ఞప్తి చేసినా వినిపించుకోకుండా తిండిగింజలనే కసితో జప్తు చేస్తున్నారు. (వి. పి.)

---

51 అడుగుల పొడుగున్న ఒక పెద్ద సొరచేప యిటీవల కేరళ సముద్ర తీరానికి కొట్టుకొని వచ్చింది.

ఇలపర్రులో జప్తులు

ఇలపర్రు, ఏప్రిల్ 24

తణుకు తాలూకా యిలపర్రు గ్రామంలో స్పెషలు తహశీల్దారు రైతులకు డిమాండు నోటీసులు జారీచేసి, వ్యవధి యిమ్మని అడిగినా అంగీకరించక, నల్లపరాజు వెంకటభాస్కరరాజు, నల్లపరాజు భరద్వాజరాజు, నల్లపరాజు సూర్యనారాయణరాజుగార్ల పాడి పశువులను జప్తు చేశారు.

కరీంనగరం జిల్లా లోకల్ లైబ్రరీ అథారిటీ ఉద్యోగుల సంఘానికి శ్రీ ఎస్. మనోహర్‌రావు అధ్యక్షునిగా, శ్రీమతి బి. ప్రేమలత ఉపాధ్యక్షురాలుగా, శ్రీ ఎం. భగవంతరావు కార్యదర్శిగా, శ్రీ ఎం. జగన్నాథం సహాయ కార్యదర్శిగా, శ్రీ ఎస్. రాజయ్య కోశాధికారిగా కార్యవర్గం ఎన్నికయింది.

"బాంబులుకాదు పాఠశాలలు కావాలి"

అణుబాంబు వ్యతిరేక సభలో లక్షాఇరవైవేలమంది పారిస్ పౌరుల డిమాండ్

పారిస్, ఏప్రిల్ 26

ఫ్రెంచి అణుబాంబు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ, సమగ్ర నిరాయుధీకరణ కోరుతూ నేడు పారిస్ దక్షిణ భాగంలో జరిగిన సమావేశానికి లక్ష ఇరవై వేలమంది హాజరయ్యారు. ఈ సభ 3 గంటలపాటు జరిగింది.

ఫ్రెంచి అణుసైన్య నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఏర్పడిన ఫ్రెంచి కమిటీ ఆధ్వర్యాన ఈ సభ ఏర్పాటు చేయబడింది. దీనికి దేశం నలుమూలలనుంచీ ఎక్కువ సంఖ్యలో ప్రతినిధులు వచ్చారు.

సియాసావుల్లో ఈ సభ పెద్ద తిరునాళ్ళలాగే జరిగింది. బస్సులమీద, కార్లలో, రైళ్లలో, మోటారు సైకిళ్ళమీదా జనం విరగబడివచ్చారు. "కావలసింది బాంబులు కాదు బడులు." మొదలైన నినాదాలు వ్రాసిన అట్టలతో వారు వచ్చారు.

అతివాద పార్టీలకుచెందిన వారూ, శాంతి సంఘానికి చెందినవారూ నాయకులు చాలమంది వుపన్యసించారు.

పార్కుచుట్టూ పోలీసులూ, సైన్యం చుట్టుముట్టి వున్నారు. సభాస్థలానికి పైన పోలీసు హెలికాప్టరు ఎగురుతూ వుండింది.

'మామూలు లేఖే'

జాన్సన్‌కు నెహ్రూ వ్రాసినలేఖపై ఇందిరాగాంధీ

న్యూయార్క్, ఏప్రిల్ 26

ప్రధాని నెహ్రూ అధ్యక్షుడు జాన్సన్‌కు తన ద్వారా పంపిన లేఖ మామూలు లేఖేనని, అందులో విశేషమేమీ లేదని శ్రీమతి ఇందిరా గాంధీ నేడిక్కడ టెలివిజన్ ఇంటర్వ్యూలో అన్నారు.

శ్రీమతి ఇందిరాగాంధీ జాన్సన్‌ను సోమవారం కలుసుకొని లేఖను అందిస్తారు.

శ్రీ గోపాలన్‌కు శ్రీ డాంగే లేఖ

పార్లమెంటరీపార్టీ నాయకత్వంనుండి తొలగింపు

తిరువనంతపురం, ఏప్రిల్ 28

శ్రీ గోపాలన్‌ను సభ్యత్వంనుండి జాతీయ సమితి సస్పెండ్‌చేసిన దృష్ట్యా పార్లమెంటరీ పార్టీ నాయకత్వంనుండి ఆయన తొలగించబడినట్లుగా కమ్యూనిస్టుపార్టీ ఛైర్మన్ శ్రీడాంగే శ్రీ గోపాలన్‌కు ఒక లేఖ వ్రాశారు.

ఈ విషయాన్ని ఇక్కడ కమ్యూనిస్టు వర్గాలు తెలియజేశాయి.

శ్రీ డాంగే లేఖలో ఇంకా ఇలా వుందని తెలుస్తున్నది:

"పార్లమెంటులో కమ్యూనిస్టుపార్టీ ప్రధమ ప్రతిపక్షంగా కొనసాగాలనే మేము వాంఛిస్తున్నాము. అయితే పార్టీ క్రమశిక్షణను విధానాలను ఉల్లంఘించి పార్టీపై అపవాదాలు వేస్తున్న వ్యక్తి పార్టీ నాయకుడుగా వుండటానికి అనుమతించలేము.

పార్లమెంటులో కమ్యూనిస్టు పక్షాన్ని కూడ చీల్చి అభివృద్ధినిరోధ పార్టీ ప్రధమ ప్రతిపక్ష పార్టీ కావడానికి అవకాశం మీరు కలగనివ్వరనే ఆశిస్తున్నాము.

జాతీయసమితి తీర్మానాన్ని అమలు జరుపుతూనే, పైన పేర్కొన్న పరిస్థితి ఏర్పడకుండా వుండేందుకై మనం చర్చలు సాగించవచ్చు

నాయకత్వం విషయమై స్వీకరించు మేము తెలియజేయవలసిన పరిస్థితిని మీరు కల్పించకున్నా, పార్టీ నాయకత్వానికి మీరే రాజీనామా ఇవ్వటం సబబు. అయితే మీరు ముందటి మాదిరిగానే అవకాశవాదాలని [illegible] కొనసాగితే, దానివల్ల ఏర్పడే పరిణామాలకు మీరే బాధ్యత వహించవలసి వుంటుంది."

కాశ్మీర్ సమస్యా పరిష్కారానికి శ్రీ మసానీ సూచన

రాజకోట, ఏప్రిల్ 26

షేక్ అబ్దుల్లా విడుదల అయిన తరువాత ఏర్పడిన పరిస్థితులు కొంత పడిన తరువాత, ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు ప్రాతినిధ్యం వహించటం లేదని కొత్తగాఎన్నికలు జరపడం కాశ్మీరు సమస్య పరిష్కారానికి సరియైన మార్గమని స్వతంత్రపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. ఆర్. మసాని నేడిక్కడ పత్రికా విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు.

కాశ్మీర్ ప్రజలు భారత ప్రజలతో ఉంటారనీ తాను నమ్ముతున్నా నన్నారు.

ప్రధాని నెహ్రూ, షేక్ అబ్దుల్లా మధ్య సంభాషణలు జయప్రదమౌతాయని, తద్వారా భారత – పాకిస్తాన్ దేశాలమధ్యనుంచి సంబంధాలు ఏర్పడటానికి త్రోవచేస్తుందని ఆశిస్తున్నానని శ్రీమసానీ తెలియజేశారు.

కాశ్మీర్ సమస్య పరిష్కారానికి మంచి మార్గం దొరికినట్లయితే, పాకిస్తాన్‌తో భారత దేశానికి మంచి సంబంధాలు ఏర్పడతాయని, ఉభయుల మధ్య స్నేహవాతావరణం ఏర్పడుతుందనికూడా చెప్పారు.

కాశ్మీర్‌ను పాకిస్తాన్‌కు అప్పగించాలని తానెప్పుడూ చెప్పలేదని, ప్లెబిసైట్ జరపాలని కూడా కోరలేదని చెప్పారు.

కాశ్మీర్ సమస్య విషయంలో స్వతంత్రపార్టీ తన విధానాన్ని నిర్ణయించలేదని కూడా చెప్పారు.

కార్మికుల జీవితావసర వస్తువుల ధర సూచికలో పెరుగుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26

కార్మికుల జీవితావసర వస్తువుల ధర సూచిక ఈ సంవత్సరం ఫిబ్రవరి మాసంలో 5 కేంద్రాలలో పెరిగినట్టు అధికార ప్రకటన వెలువడింది.

1949 సంవత్సరంలో 100 పాయింట్లువుంటే [illegible] 7 పాయింట్లు పెరగటంతో 139 పాయింట్లకు చేరుకుంది.

అదేవిధంగా జంషెడ్‌పూర్‌లో 6 పాయింట్లు, లూథియానాలో 3 పాయింట్లు, [illegible] రెండు పాయింట్లు, అజ్మీరులో ఒకపాయింటు పెరిగాయి.

రాజ్‌కోట పరిసరాల్లో కలహాలు, కత్తిపోట్లు

రాజ్‌కోట, ఏప్రిల్ 27

25 వ తేదీ రాత్రి రాజకోట పరిసర ప్రాంతాలలో కొన్నిచోట్ల కత్తిపోట్లు మొదలైన హింసాచర్యలు ఉత్పన్నమైన దృష్ట్యా నిన్న ఉదయంనుండీ యీ ప్రాంతమంతా పోలీసులు 144వ సెక్షను ప్రయోగించారు. ఈ ఉత్తర్వులు పదిరోజులపాటుఅమల్లోఉంటాయి.

ప్రమాద స్థితిలో ఉన్న ఒక వ్యక్తితోసహా కత్తిపోట్లు తగిలిన ముగ్గురు వ్యక్తుల్ని నిన్న ఇక్కడ ఆసుపత్రిలో చేర్చారు.

27 గురు వ్యక్తుల్ని పోలీసులు అరెస్టు చేశారు. నిన్న పరిస్థితి ప్రశాంతంగా వుందని రాత్రి ప్రొద్దుపోయేదాక అధికార్లు ప్రకటించారు.

రాజ్‌కోట నగరంలోనూ, పరిసరప్రాంతాలలో శాంతి కమిటీ ఏర్పాటుచేస్తున్నారు.

విశాలాంధ్ర

శాస్త్రీజీ హితబోధలు

అఖిల భారత పారిశ్రామికుల సంస్థ ఇటీవల నాల్గో వార్షికోత్సవ సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర మంత్రి శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి "ఉత్పత్తిని పెంచేందుకు యజమానులు, కార్మికులు తమ దృష్టిని కేంద్రీకరించాలని" కోరారు. ఇతర దేశాలలోవలెనే మన దేశంలోనూ యజమానులు, కార్మికులమధ్య ఆరోగ్యకరమైన సత్సంబంధాలు పెంపొందాలన్న అభిలాషను కూడ వ్యక్తపరచారు.

పారిశ్రామికంగా వెనుకబడివున్న మన దేశంలో ఉత్పత్తిని పెంచటం దేశాభివృద్ధికి అత్యంత కీలకమైన సమస్య అనటంలో సందేహం లేదు. ఈ విషయంలో భారత కార్మికులు తమవంతు కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నారనే సత్యాన్ని లాల్ బహదూర్‌శాస్త్రి ఉపన్యాసంలోనే అంగీకరించక తప్పలేదు.

"1956 సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకొంటే పారిశ్రామికోత్పత్తి సూచిక 1963 నాటికి 161.4 శాతం పెరిగింది. 1962 నాటికంటే పారిశ్రామికోత్పత్తి సూచిక 1963 అక్టోబరుకు 8.9 శాతం పెరిగింద"ని శ్రీ శాస్త్రి వివరించారు. అంటే ఉత్పత్తిని, దేశసంపదను పెంచటంలో కార్మికవర్గం తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించుతున్నదని స్పష్టమవుతోంది.

కాని కార్మికవర్గం, తదితర కష్టజీవులు ఉత్పత్తి చేస్తున్నసంపదను, వస్తుసముదాయాన్ని పంచటంలో మాత్రం జనసామాన్యానికి న్యాయం జరగడంలేదు. పెట్టుబడిదారీ ఆర్థిక విధానంలో పెద్ద చేప చిన్నచేపను మింగడమనే "మత్స్య న్యాయం" సర్వసాధారణంగా అమలు జరుగుతోంది. కోట్లాది ప్రజలు చెమటోడ్చి పెంపొందించుతున్న దేశసంపదను కొద్దిమంది గుత్తవ్యాపారులు బడా పెట్టుబడిదారులు గుటకాయస్వాహా చేస్తున్నారు.

శ్రీ శాస్త్రి తమ ఉపన్యాసంలో ఇలా ఉదహరించారు.

"దేశసంపద కొలదిమంది చేతుల్లో కేంద్రీకరించ బడుతోంది. 1962-63 సంవత్సరంలో 183 పెద్ద కంపెనీలు 128 కోట్ల రూపాయల లాభం గడించాయని "ఎకనమిక్ టైమ్స్"లో చదివాను. వాటిలాభం 13.2 శాతం పెరిగింది."

మరో విషయాన్ని కూడా ఆయన చెప్పారు. 50 లక్షలకు మించిన పెట్టుబడిగల కంపెనీలు, మొత్తం పారిశ్రామిక సంస్థలలో కేవలం 1.6శాతం మాత్రమే వుండగా, మొత్తం లాభాలలో 53 శాతాన్ని ఆ కొలది కంపెనీలే పొందుతున్నాయి. దీనిని బట్టే కొలదిమంది చేతుల్లో సంపద కేంద్రీకరించ బడుతూందన్న విషయం స్పష్టమని ఆయన అంగీకరించారు.

1962 సంవత్సరంలో పారిశ్రామిక తగాదాలవల్ల 610 లక్షల పని రోజులు నష్టమయ్యాయి. 1963 లో కేవలం 290 లక్షల పనిరోజులు మాత్రమే నష్టమయ్యాయి. ఇందుకు హర్షాన్ని తెలుపుతూ, నష్టాలను ఇంకా తగ్గించేందుకు ప్రయత్నించాలని కేంద్ర మంత్రి హితబోధ చేశారు. చైనా దాడిఫలితంగా ఏర్పడిన ప్రమాద పరిస్థితులలో యజమానులు, కార్మికులు కనబరచిన సహకారం, తరువాత క్రమంగా తగ్గిందనీ, ఈ మధ్య సమ్మెలు, లాకౌటులు (మూసివేతలు) పెరుగుతున్నాయనీ ఆందోళన వ్యక్తపరచారు. యజమానులు, పనివారు కూడ సహనభావాన్ని పెంపొందించుకోవాలన్నారు.

దేశమంతటికీ పాలకవర్గపార్టీగా వున్న కాంగ్రెసు సంస్థలోనూ, కేంద్ర ప్రభుత్వంలోనూ లాల్ బహదూర్ శాస్త్రి బాధ్యతగల స్థానం వహించుతున్నారు. కాబట్టి కేవలం దారేపోయే పెద్దమనిషిలాగ హితబోధచేయడంతో వారి కర్తవ్యం నెరవేరదు. కోట్లాది కష్టజీవులైన ప్రజానీకం శ్రమపడి పెంపొందించుతున్న దేశసంపద కొలదిమంది చేతుల్లో కేంద్రీకరించ బడటానికి కారణమేమిటి? చైనా దురాక్రమణ సమయంలో ఉత్పత్తిని పెంచడానికి వ్యక్తమైన ఉత్సాహం, సహకారం క్రమంగాతొలగిపడటానికి, ఈ మధ్య సమ్మెలు, లాకౌటులు పెరగడానికి కారణమేమిటి?

భారత ప్రభుత్వంలో మంత్రిగానూ, కాంగ్రెసు అధిష్ఠానవర్గంలో ఒకరుగానూ వుంటున్న శ్రీ శాస్త్రి దేశం దాచడానికి వీల్లేని నగ్న సత్యాలను గుర్తించినంత మాత్రాన చాలదు. సంపద కేంద్రీకరణకు కారణాలే, కార్మికులలో అసంతృప్తికి సమ్మెలకూ దోహదం చేస్తున్నాయనే పరమ సత్యాన్ని అంగీకరించక తప్పదు.

1962 అక్టోబరు - నవంబరులలో మనదేశ సరిహద్దుపై చైనాదాడిచేసినపుడు దేశరక్షణను దీక్షవహించాలనే ఉత్సాహం వెల్లువిరిసింది. ఉత్పత్తిని పెంచడానికి,సర్వవిధాలా సహకరించడం తమ వంతు కర్తవ్యంగా కార్మికవర్గం భావించింది. అందువల్లనే 1962 కంటే 63 లో పనిరోజుల నష్టం చాలా తగ్గిపోయింది. అలాగే దేశరక్షణ నిధికి విరాళాలివ్వడంలోనూ కార్మికులు పటుతర దీక్షను కనబరచారు. అందు చేతనే ప్రధాని నెహ్రూ సైతం రక్షణ నిధికివిరాళం ఇవ్వడంలో కష్టజీవులు చూపిన త్యాగనిరతిని మెచ్చుకొని, అలాంటి త్యాగం చూపనందుకు ధనికులను విమర్శించారు.

కాని అదే సమయంలో పెరుగుతున్న ఉత్పత్తిని తమ లాభాలను పెంచుకునేందుకు, జీవితావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచేందుకు బడా పెట్టుబడిదారులు, గుత్తవ్యాపారులు తీవ్రంగా ప్రయత్నించారు. 1963లో 183పెద్ద కంపెనీలకు 128 కోట్ల రూపాయల లాభం రావడానికి కారణమదే. జీవితావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగినందున కార్మికులు, పనివారి జీతాలు వారి కుటుంబ పోషణకే చాలకుండా పోయాయి. ధరలతో పాటు తమ వేతనాలను పెంచి తీరాలనే డిమాండును కార్మికవర్గం ఎలుగెత్తి చాటవలసివచ్చింది. యజమానులు ఈ న్యాయమైన కోర్కెను తృణీకరించినందువల్లనే కార్మికులు సమ్మె చేయక తప్పడంలేదు. కార్మికులను బెదిరించి లొంగదీయడానికి యజమానులు లాకౌట్లు ప్రకటించుతున్నారు.

ఈ విషయాన్ని గుర్తించి కారణాలను అరికట్టేందుకు ప్రభుత్వం సత్వరచర్యలు తీసుకోనందువల్లనే కార్మికుల సమ్మెలు వస్తున్నాయి. అధికధరలకు వ్యతిరేకంగా ప్రజలఘోష నానాటికీ పెరుగుతోంది.

లాల్‌బహదూర్‌శాస్త్రి తమ ఉపన్యాసంలో సంపద కేంద్రీకరణను పరిశీలించి, నివేదికను సమర్పించేందుకు దాసుగుప్త కమిషన్ నియమించ బడిందని చెప్పుతున్నారు. మూడేళ్ళనాడు ప్రభుత్వం నియమించిన మహలనోబిస్ కమిటీ నివేదిక ఏమయింది? దానిని ఎందుకు ప్రకటించలేదు? తిరిగి మరో కమిషన్ ఎందుకు నియమించారు? అనే సందేహాలు ప్రజలను పీడించుతున్నాయి. ఏదోవిధంగా కాలయాపన చేసేందుకు చేస్తున్న తతంగమని ప్రజలు అనుమానించడంలో ఆశ్చర్యంలేదు.

ఇప్పుడు జీవితావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగాయిగదా! శాస్త్రిజీ యిచ్చే లెక్కలను బట్టే సంపద కేంద్రీకరణ జరుగుతున్న విషయం నిజమేగదా! ధరలను అదుపులోవుంచేందుకు, సంపద కేంద్రీకరణను అరికట్టేందుకు సత్వర చర్యలు తీసుకోనంతవరకు ప్రభుత్వాధినేతలు చెప్పే హితబోధలకు ఎలాంటి విలువ కన్పించదు. క్రియలేకుండా ప్రజాస్వామ్య సోషలిజాన్ని గురించి చెప్పేకబుర్లన్నీ కేవలం ప్రకటనలు గానే వుండి పోతాయి.

మే 1న శ్రీ చాగ్లా న్యూయార్క్ పయనం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27

కేంద్ర విద్యా మంత్రి శ్రీ యం. సి. చాగ్లా కాశ్మీర్ సమస్యపై భద్రతాసమితిలో జరిగే చర్చలో పాల్గొనడానికి మే మొదటి తేదీన న్యూయార్క్ బయలుదేరి వెళ్తారు. భద్రతా సంఘ సమావేశం మే 5 వ తేదీన మొదలవుతుంది.

భారత దేశంపై చైనా ఎందుకు దాడిచేసింది?

ప్రశ్న: గతితార్కిక భౌతికవాద, చారిత్రక భౌతికవాద, సూత్రాల ననుసరించి మావో-సే-టుంగ్ [illegible] దాడి చేయడంద్వారా ప్రపంచ వైరుధ్యాల సంపూర్ణ వికాసానికి ఆటంకంగా వున్న ఒక అంశాన్ని తొలగించినారు. భారతదేశంమీద చైనా దాడి చేసిన కారణం యిదే కదా?

(కె. వి. రెడ్డి, చామరాజపేట, బెంగుళూరు.)

జవాబు: గతితర్కం పట్ల ఈ ప్రశ్నలో వ్యక్తమైన ధోరణి, వైరుధ్యాలను గురించి ఈ ప్రశ్నలో వ్యక్తమైన అవగాహనా, చాలా భావనామయంగానూ, గతితార్కిక భౌతికవాద సూత్రాలకే - సత్యం ఎప్పుడూ భావనామయం కాదు. దేశ కాలావధికమే, అన్న మూలసూత్రానికి- వ్యతిరేకంగానూ ఉన్నాయి. సమకాలిక ప్రపంచ వైరుధ్యాలలోని యాథార్థ్యాన్ని మన ఊహలో ఉన్న సరళమయిన చిన్ని "చట్రం"లో బిగించే ప్రయత్నం గతితార్కిక భౌతికవాదం కాదు; అది గతితార్కిక భావవాదం అవుతుంది.

మనం అర్థంచేసుకోవలసిన వాస్తవ జగత్తులోకి వైరుధ్యాలను గురించి తయారుగా ఉన్న (రెడీమేడ్) చట్రాలను దిగుమతి చేయరాదని మార్క్సు, ఎంగెల్సు, లెనిన్ సర్వదా నొక్కి చెప్పినారు. అంతేగాక, మనం పరిశీలిస్తూ మార్చడానికి ప్రయత్నిస్తూవున్న వాస్తవ జగత్తులోనివివిధ వైరుధ్యాలనూ విభిన్నవ్యతిరేకశక్తులనూ తెలుసుకోడానికి మన సర్వ శక్తులనూ ఉపయోగించాలి.

నేటి ప్రపంచంలోని వైరుధ్యాలేమిటి? వ్యతిరేక శక్తులేమిటి? పెట్టుబడి దార్లకూ కార్మికులకూ మధ్య, గుత్త వ్యాపారస్థులకూ ప్రజలకూ మధ్య, రెండు ప్రపంచ సామాజిక వ్యవస్థల మధ్య, జాతీయ విమోచనోద్యమానికీ వలసవాదులకూ మధ్య, రైతులకూ భూస్వాములకు మధ్య, సామ్రాజ్య వాదులలో వాళ్ళలో వాళ్ళ మధ్య, ఈ విధంగా వైరుధ్యాలు వున్నాయి.

మరికొన్ని వైరుధ్యాలను కూడా కనుక్కోవచ్చు. కానీ వైరుధ్యాలను గురించి మాటలు మాత్రం మాట్లాడితేచాలదని తెలియజేయటానికి పైన పేర్కొన్నవిచాలు. నిర్దిష్టమయిన రాజకీయ పంథా కొరకు ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం వైరుధ్యాలన్నిటినీ గమనిస్తూనే ప్రధాన వైరుధ్యాన్ని-నిర్దిష్ట సమయంలో యేశక్తుల పరస్పర పోరాటం సామాజిక వికాసాన్ని నిర్ణయిస్తుందో ఆముఖ్య వ్యతిరేక శక్తుల జంటను-సరి పట్టుకోవలసి వుంది.

శ్రీ మోహిత్ సేన్

"పరిశుద్ధ" సామాజిక విప్లవం కొరకు కాచుకోవడం గురించి లెనిన్ యేనాడో మనలను హెచ్చరించినాడు.పరిస్థితిని దేశ కాలావధికంగా పరిశీలించాలని ఆయన చెప్పాడు.

ప్రధాన వైరుధ్యం

1957 మాస్కో ప్రకటనలో ప్రధాన వైరుధ్య సమస్య యీ విధంగా వివరించబడింది: "మన యుగంలో", పూర్తి పరస్పర వ్యతిరేకమైన రెండు సామాజిక వ్యవస్థలమధ్య సాగుతున్న పోటీయొక్క గతి క్రమం వల్లనూ, దాని ఫలితాలవల్లనూ ప్రపంచ పురోగతి నిర్ణయించబడుతుంది."

1960 మాస్కో స్టేటుమెంటు యీ పరిశీలనను పునరుద్ఘాటించింది. "ఈనాటి అంతర్జాతీయ సంబంధాల పురోగతి రెండు సామాజిక వ్యవస్థల పోరాటం చేత - సామ్రాజ్యవాద, ప్రతీప, దురాక్రమణ శక్తులకు వ్యతిరేకంగా సోషలిజం, శాంతి, ప్రజాతంత్ర శక్తుల ఆధిక్యం క్రమక్రమంగా స్పష్టమౌతున్న పోరాటంచేత-నిర్ణయించబడుతుంది."

ప్రధాన వైరుధ్యం గమనించిన తర్వాత యింకా ముందుకు పోయి ప్రధాన వ్యతిరేక శక్తులజంట మధ్య జరగగల పోరాట రూపాలను పరిశీలించడం చాలా ముఖ్యం. రెండు ప్రపంచ సామాజిక వ్యవస్థలమధ్య పోరాటం విధ్వంసనాత్మక అణుయుద్ధరూపంలోనూ వుండవచ్చు, శాంతియుత సహజీవన పరిస్థితులలో శాంతియుత పోటీరూపంలోనూ వుండవచ్చు ననేది స్పష్టంగా తెలుస్తూనేవుంది. స్పష్టంగా, సోషలిస్టు శిబిరానికి శాంతియుత సహజీవనమే వాంఛనీయమైన రూపం.

రెండు ప్రపంచ సామాజిక వ్యవస్థలమధ్య యుద్ధమూ, శాంతియుత సహజీవనమూ, అని రెండు పోరాటరూపాలూ సంభవమేనని గుర్తించడం చాలా అవసరం. శాంతియుత సహజీవనమంటే సామ్రాజ్యవాదానికి ఒక విధంగా లొంగిపోవడమే నని గానీ, యథాస్థితిని అంగీకరించడమే నని గానీ, ప్రపంచాన్ని పలుకుబడి ప్రాంతాలకింద విభజించడమే నని గానీ ఊహించడం తప్పు. "భిన్న సామాజిక వ్యవస్థలు గల దేశాలమధ్య సహజీవనం సోషలిజానికి పెట్టుబడిదారీ విధానానికీ మధ్య జరిగే ఒక వర్గ పోరాట రూపం." అని 1960 మాస్కో స్టేటుమెంటు సరిగా చెప్పింది.

పరిశీలనా క్రమం

సామ్రాజ్యవాదుల మీద శాంతియుత సహజీవనాన్ని విధించే పోరాటంలో ప్రపంచ సోషలిస్టు వ్యవస్థకు మిత్రులెవరో తెలుసుకోడానికి యీపరిశీలనాక్రమం యింకాముందుకు [illegible]. శాంతి, శాంతియుత సహజీవనం, అనే ఆశయం కొరకు సమీకరించబడగలిగే శక్తులేవి అనే ప్రశ్నకు 1960 మాస్కో స్టేటుమెంటు చాలా స్పష్టమైన జవాబు యిచ్చింది.

"చరిత్రలో ప్రప్రథమంగా గొప్ప సంఘటిత శక్తులు యుద్ధాన్ని ప్రతిఘటిస్తున్నాయి: [illegible] కాలంలో ప్రపంచానికి [illegible]; శాంతిసాధనను తన గొప్ప చారిత్రక రాజకీయ కర్తవ్యంగా [illegible] అంటా: ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో, దిన దినమూ సంఖ్యలో పెరుగుతున్న శాంతి కాముక దేశాలు - శాంతిరంగంలో [illegible] ప్రధానమైన ప్రజాసంస్థలుంది - అంతర్జాతీయ కార్మికవర్గం, దాని సంస్థలు, ముఖ్యంగా కమ్యూనిస్టుపార్టీ; వలసదేశాలు, అస్వతంత్ర దేశాల ప్రజల జాతీయ విమోచనోద్యమం; ప్రపంచశాంతి ఉద్యమం; సామ్రాజ్యవాద యుద్ధవిధానంలో భాగం వాంఛించకుండా శాంతియుత సహజీవనాన్ని ప్రచారంచేసే అలీన దేశాలు.

"అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల బూర్జువావర్గంలో ఒక నిర్దిష్టవర్గంకూడా - ఈ వర్గం ప్రపంచశక్తుల సంబంధాన్ని గురించీ ఆధునిక యుద్ధ పర్యవసానాల గురించీ స్వస్థ చిత్తంతో ఆలోచిస్తుంది - శాంతియుత సహజీవన విధానాన్ని అభిమానిస్తున్నది.

కాబట్టి, రెండు ప్రపంచ సామాజిక వ్యవస్థలమధ్య పోరాటం వికసించడం కొరకే- ఇదే ప్రధాన వైరుధ్యం - అలీన దేశాలనూ తటస్థ దేశాలనూ మిత్రులుగా చేసుకోవలసి వుంది. ఎందుకంటే, ఆటువంటి మైత్రికి అవసరమైన భౌతిక పరిస్థితులు శాంతి, శాంతియుత సహజీవనం, అనే సమష్టిఐక్యంద్వారా యేర్పడి ఉన్నాయి. ప్రధాన వైరుధ్యం సాధ్యమైనంత ఉత్కృష్ట పరిస్థితులలో శాంతియుత సహజీవనం శాంతియుతపోటీ అనే పరిస్థితుల్లో ప్రపంచ సోషలిస్టు వ్యవస్థకు అనుకూలంగా పరిష్కరింపబడాలంటే, అలీన తటస్థ దేశాలను ఆటంకంగా చూడకపోవడమే గాదు, మిత్రులుగా చూడవలసివుంది.

అలీనత మీదా, తటస్థత మీదా దాడిచేసే చైనా విధానం దాని పరమ ఒంటెత్తు దుందుడుకు విధానంలో భాగమే. ఈ విధానం సోషలిస్టు శిబిరాన్ని, కార్మిక వర్గాన్ని ఏకాకినిచేసి సామ్రాజ్యవాదులకు మిత్రులను సంపాయించి పెడుతుంది. ప్రధాన వైరుధ్య వికాసానికీ, ప్రధాన వైరుధ్యాన్ని అనుకూలంగా పరిష్కరించుకోడానికీ అది అటంకమౌతుంది.

అలీనతను శత్రువుగాయెంచి దాడిచేసే ఈ ఒంటెత్తు విధానం ఆ విధానపు మార్గంలో చివరిదాకా ప్రయాణించి, సోవియట్ యూనియన్ సోషలిజానికి ప్రధాన శత్రువనీ, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడం ప్రధాన విప్లవ కర్తవ్యమనీ, యెంచే అర్థరహిత గమ్యానికి చేరుకుంది.

అలీన తటస్థ దేశాలను సోషలిజానికి సామ్రాజ్యవాదానికి జరిగే పోరాటంలో, శాంతియుత సహజీవనంకొరకు జరిగే యుద్ధంలో, మధ్యేమార్గ శక్తులుగా యెంచవచ్చు. ఒకప్పుడు [illegible]

1960 లో [illegible] "కార్మికవర్గ నియంతృత్వ చారిత్రకఅనుభవంగురించి"అన్న వ్యాసంలో చైనా కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం యీవిధంగా రాసింది: "[illegible] మన ప్రధాన [illegible] ఒక సూత్రం ప్రతిపాదించినాము. మన అనుభవంద్వారా మనం నేర్చుకున్నదేమంటే, [illegible] ప్రధాన శత్రువుపై [illegible] మధ్యస్థ శక్తులతో [illegible] కనీసం [illegible] వాళ్ళు తటస్థంగా వుండేటట్లు [illegible] మనతో మైత్రి చేసుకొనే స్థితికి తీసుకురావడానికి ప్రయత్నించాలి."

భిన్న ధోరణి

ఈనాటి ధోరణి ఎంత భిన్నంగావుంది!

భారత దేశం మీద చైనా దాడి చేయడానికి కొంత కారణం తప్పకుండా మధ్యేమార్గశక్తుల పట్ల వాళ్ళకున్న ఒంటెత్తు ధోరణి. మరొక అంశం నేటి ప్రపంచ యుద్ధ పర్యవసానాలను సక్రమంగా అంచనా వేయడానికి చైనా కమ్యూనిస్టుపార్టీ నాయకులు క్రమబద్ధంగా నిరాకరించడమూ, తన్మూలంగా అత్యంత విధాయకమైన శాంతియుత సహజీవన అవసరాన్ని తప్పుడు అంచనా వేయడమూ.

కానీ, ఘనీభవించిన జాతీయ దురహంకారమూ, దురాక్రమణతత్వ పూరిత జాతీయ [illegible], చైనా కమ్యూనిస్టుపార్టీ నాయకుల యీనాటి విధానంలో ప్రముఖ చోదక శక్తిగా వున్నాయని క్రమక్రమంగా స్పష్టతరమౌతున్నది. కాకపోతే, సోవియట్ యూనియన్ నుండీ, మంగోలియానుండీ భూభాగాలను "పునస్వాధీనము" చేసుకోవాలని చైనా యెందుకంతగా పట్టుబట్టుతున్నదీ అర్థం చేసుకోవడం కష్టం. అంతేగాక, అణుబాంబులను "కాగితపు పులు" లని చులకనచేసి, మళ్ళీ అణుబాంబులను తాను వాంఛించడం యెందుకో అర్థం చేసుకోవడం కష్టం.

చివరలో, ఆఫ్రో ఆసియా సంఘీభావ ఉద్యమం నుండి రష్యాను "వెలివేసి" ఆ ఉద్యమాన్ని తన "సొంత వ్యవహారం"గా చేసుకోవాలని చైనా యెందుకంత తహతహ పడుతున్నదో అర్థం చేసుకోవడం కష్టం.

జాతీయ దురహంకారమూ ఒంటెత్తు దుందుడుకు విధానమూ పరస్పర పూరకాలు. ఇవి కొనసాగితే, చైనా కమ్యూనిస్టుపార్టీ మార్క్సిస్టు లెనినిస్టు పార్టీ కాకుండా పోయే ప్రమాదం వుంది. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ సాధారణ పంథానుండి పైదొలగి యీ జాతీయ దురహంకార ఒంటెత్తువాద పంథా అవలంబించడం వల్లనే, అలీనత మీదా తటస్థత మీదా తన దాడికి ప్రధాన రూపంగా, భారతదేశంమీద చైనా దాడి చేసింది.

మైనారిటీల పట్ల ఇక్కడే ఆదరం

ప్రజలకు నిజంచెప్పాలని జయప్రకాశ్ విజ్ఞప్తి

కలకత్తా, ఏప్రిల్ 25

"మన సరిహద్దుకు ఆవలనున్న [illegible] (పాకిస్థాన్), [illegible]" అంటూ సర్వోదయ నాయకుడు శ్రీ జయప్రకాశ్‌నారాయణ, [illegible], అన్నదా శంకర్‌రాయ్, చారుచంద్ర భండారీ మరికొందరు కలిసి నిన్న యిక్కడ ఒక సంయుక్త ప్రకటన చేశారు. వారి ప్రకటనలో యిలా వుంది:

"తూర్పు పాకిస్థాన్‌లో ప్రభుత్వం [illegible] ప్రజలపై ఏదో ఒకరకమైన అన్యాయం జరుగుతున్నట్లే పత్రికల్లో చూస్తున్నాం. అక్కడ జరిగే దురంతాలను గురించిన సమాచారం చాలా తక్కువగా వస్తున్నదనే మనమంతా సహజంగా అనుమానిస్తుంటాం. కాగా మన పత్రికలు స్వతంత్రంగా సేకరించిన సమాచారం ఆధారంగా యీ విషయాల్ని, యిందుకు సంబంధించిన సంఖ్యలనూ వివరాల్ని హెచ్చుచేసి రాస్తుంటాయి.

"మనదేశంలోనూ అనేకచోట్ల మత కలహాలు జరిగాయి, ప్రజలు చాలా నష్టం [illegible] అనుభవించారు. ఈవిషయాలు మన పత్రికలు సరిగా చిత్రించవు. అందుకని మనలో మన గురించి ఒక రకమైన స్వోత్కర్ష యేర్పడుతూవుంది. పాకిస్థాన్ వారిని గురించి, వారు బందిపోటు దొంగలనీ, ఖూనీ కోరులనీ, ఒక దురభిప్రాయాన్ని పెంపుచేసుకుంటున్నాము, ఇది చాలా ప్రమాదకరమైన ధోరణి.

"ఇటు భారత ప్రజలుగానీ అటు పాకిస్థాన్ ప్రజలుగానీ స్వతహాగా మానవత్వపు విలువలు లేనివారని మేము భావించలేక పోతున్నాం.

"అందుకని మనదేశంలో అల్పసంఖ్యాకులపై జరిగిన అత్యాచారాలకు సంబంధించిన సమాచారం మన ప్రజలకు పూర్తిగా తెలియ చెప్పాలి. తద్వారా వారి హృదయాల్ని స్పందింప జేయాలి, వారిని ప్రాయశ్చిత్తం కోసం పురికొల్పాలి" అని వారీ పత్రికా ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

అయ్యూబ్ పోటీకి ప్రతిపక్షాల ఐక్యత

చౌదరీ మహమ్మదాలీ ప్రకటన

రావల్పిండి, ఏప్రిల్ 26

నిజాము ఇస్లామిపార్టీ నాయకుడూ, పాకిస్థాన్ మాజీ ప్రధానీ అయిన చౌదరీ మహమ్మదాలీ నేడు లయల్పూర్ జిల్లా బార్ అసోసియేషనులో ప్రసంగిస్తూ, వచ్చే ఏడాది అధ్యక్ష ఎన్నికలలో ప్రతిపక్షాలన్నీ కలిసి ఒకఅభ్యర్థిని పెట్టడానికై సంప్రదింపులు జరుగుతూన్నాయన్నారు.

'పోటీపార్టీ నిర్మాణం శ్రామిక వర్గానికివెన్నుపోటుపొడవడమే'

ప్రఖ్యాత విప్లవ వీరుడు బాబా గురుముఖ్ సింగ్ ఖండన:

పార్టీ ఐక్యతను కాపాడవలసిందిగా సభ్యులకు విజ్ఞప్తి

జలంధర్, ఏప్రిల్ 25

పార్టీ విధానంతో నాకు తీవ్ర విభేదాలున్న సంగతి పాల్ఘాట్ మహాసభ కాలంనుండీ పార్టీ ముఖ్యులందరికీ తెలుసును. అయినప్పటికీ ఈ విభేధాలవలన పార్టీ చీల్చాలని నేను ఎన్నడూ అనుకోలేదు. కాని, శ్రామికప్రజల త్యాగఫలితంగా నాల్గు దశాబ్దాల కాలంపాటు నిర్మించుకొన్నపార్టీని ఈనాడు విప్లవ పదజాలం వల్లిస్తూ విచ్ఛిన్న వాదులు చీల్చడంఅంటే అది శ్రామికప్రజలకు వెన్నుపోటు పొడవడం తప్ప వేరు కాదని గదర్ విప్లవవీరుడు, పంజాబ్ ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు అయిన బాబా గురుముఖ్‌సింగ్ ఖండించారు.

బాబా గురుముఖ్‌సింగ్ తమ ప్రకటనలో ఇలా అన్నారు:

"నేను చాలా ఆవేదనతో బహిరంగంగా ఈ విజ్ఞప్తిని పాత కామ్రేడ్సుకు, కొత్త కామ్రేడ్సుకు కూడా చేస్తున్నాను. ముఖ్యంగా కేరళ, ఆంధ్ర, తమిళనాడు, బెంగాల్ కామ్రేడ్సుకు నా విజ్ఞప్తి: ఈ కామ్రేడ్సు మన దేశ కార్మిక వర్గంకోసం, శ్రామిక ప్రజల కోసం అనేక కష్టాలు పడ్డారు. శారీరకంగా బాధలు పడ్డారు, ఆర్థికంగా త్యాగాలు చేశారు. వారిపట్ల నాకు ఎంతో గౌరవం వుంది.

"స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఎటువంటి పాత్రా నిర్వహించని అభివృద్ధి నిరోధకులు ఈనాడు విజృంభించి సామ్రాజ్యవాదుల మద్దతుతో శ్రామిక ప్రజలు కష్టించి సాధించుకున్న విజయాలను, వమ్ము చేయాలని చూస్తున్నారు. ఇటువంటి సమయంలో, మన దేశంలో అనేక దశాబ్దాలుగా శ్రామిక వర్గాన్ని, విప్లవోద్యమాన్ని నడిపిన పార్టీని,ఒకవైపున విప్లవ పదజాలాన్ని వల్లించుచున్నవారే రెండు ముక్కలుగా చీల్చడానికి యత్నించుచున్నారు. వీరు ముఖ్యంగా పంజాబులో విప్లవ పదజాలాన్ని వల్లించడం వినా వేరే చేసే పని ఏమీ లేదు.

"[illegible] నుండి సంప్రదాయ సిద్ధంగా [illegible] పార్టీ నిర్మాణ సూత్రాలను, మనం ఎంతో అమూల్యమైన వాటిగా పరిగణించుచున్నాము. - ఈ విచ్ఛిన్నవాదులు [illegible] ఉన్నారు. [illegible] నిజమైన [illegible] అయినప్పటికీ [illegible] శ్రామికవర్గానికి [illegible] పార్టీని చీల్చడం వారికి [illegible] తప్ప మరేమీకాదు. ఈ చీలిక విప్లవశక్తులను చీల్చడానికి, మనదేశాన్ని సామ్రాజ్యవాదులకు వారి తాబేదారులకు అప్పజెప్పడానికి దారితీస్తుంది.

పంజాబులో ఈ విధంగా కమ్యూనిస్టు పార్టీని చీల్చడానికి నాయకత్వం వహించుచున్న శ్రీ సూర్జిత్ ఆయన మిత్రులు గత 13 యేళ్ళుగా పంజాబు కమ్యూనిస్టుపార్టీకి నాయకులుగా ఉంటూ అక్కడి రైతాంగ సమస్యల పరిష్కారానికిగాని, కౌలుదార్ల వెతలను అరికట్టడానికి గాని, భాషారాష్ట్ర సమస్యను శాస్త్రీయపద్ధతిపై పరిష్కరించడానికి గాని, అభివృద్ధి పన్ను సమస్యను రైతాంగానికి అనుగుణ్యమైన విధంగా పరిష్కరించడానికి గాని ఏమీ చేయలేకపోయారు. కాని అదే సమయంలో శ్రామికప్రజలు మాత్రం అమోఘమైన త్యాగాలుచేశారు.

"విప్లవ పదజాలం వల్లించడంలో ఏ మాత్రం తీసిపోని ఈ నాయకత్వం గత మూడు జనరల్ ఎన్నికల సమయంలోను మతవాద, మితవాదశక్తులతో చేతులు కలపడం జరిగింది. అకాలీదళం పేరు మాటున ఒక స్వతంత్ర పార్టీ అభ్యర్థిని లోక్‌సభకు ఎన్నుకొనడానికికూడా ఈ నాయకులే కారకులు.

ఇంతేకాదు. ఈ నాయకులు, పంజాబ్ రాష్ట్ర కమ్యూనిస్టు సమితికి చెందిన 40 వేల రూపాయల నిధిని యివ్వకుండా దాచిపెట్టుకొని కూర్చున్నారు. ధననిధి, ఇతర పార్టీ ఆస్తులు కూడా [illegible] ఉన్నాయి. [illegible]

గనుక యిప్పుడు డాంగే లేఖల సమస్యను పైకి లేవనెత్తారు, నేను ఎవరినీ సమర్థించుటకూ వాదించదలచలేదు, కాని నా అభిప్రాయాలను మాత్రం స్పష్టం చేయదలచుకున్నాను. ఈ లేఖల విషయం 1964 జనవరిలో జరిగిన కేంద్ర కార్యవర్గ సమావేశం ముందుపెట్టక, లేదా జాతీయ కార్యదర్శివర్గం ముందుంచక వీరు అమెరికా అనుకూల, బూర్జువా పత్రికలకు ఎందుకు ఎక్కారు? పార్టీ నిబంధనలను ఇంత బాహాటంగా, ఇంత దారుణంగా ధిక్కరించడం సామాన్య సభ్యుల గురించి అయినప్పటికీ ఎంతమాత్రం అనుమతించ వీలులేని విషయం, ఆటువంటి సమయములో పార్టీ ఛైర్మన్‌నే పట్టుకొని ఆయనను అప్రతిష్ఠ పాలుచేయడం, ఆయన వ్యక్తిత్వాన్ని భంగపరచటం జరిగింది. ఈ సమస్య నంతను విచారించడానికి పార్టీ కమిషన్‌ను నియమించినందుకు నేను హర్షించుచున్నాను. గత నాలుగు దశాబ్దాల కాలంలోను కామ్రేడ్ డాంగే బలహీనతలను చూపిన ఉదంతాలు ఏవీ పార్టీ చరిత్రలో నా కెన్నడూ కనబడలేదు.

పార్టీ అనుసరించే పంథాలోనాకు తీవ్రమైన విభేదా లున్న సంగతి పాల్ఘాట్ మహాసభనుండి భారత దేశంలోని పార్టీ ప్రముఖులందరికీ తెలుసును. కాని ఈ విబేధాలున్నంతమాత్రం చేత పార్టీని చీల్చాలని నేను ఎన్నడూ అనుకోలేదు. ఈ విచ్ఛిన్న వాదులకు తమ రాజకీయ విధానం మీద విశ్వాసం లేదు. పార్టీ కార్యకర్తలమీద అంతకంటే విశ్వాసం లేదు. కాని పక్షంలో వారు యిటువంటి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు దిగి వుండేవారు కాదు. పార్టీ మహాసభ ముందు చీలిపోయి ఉండేవారుకాదు.

యావత్ భారతదేశంలోని పార్టీసభ్యులకు ఇదే నా విజ్ఞప్తి.

"ఈ విచ్ఛిన్నవాదుల నిర్వాకాల విషయంలో అప్రమత్తులై ఉండండి. అనేకమంది అమరవీరుల రక్తతర్పణంతో నిర్మించబడిన పార్టీ ఐక్యతను సంరక్షించండి."

గోవిందనగర్, ఏప్రిల్ 27

తూర్పు పాకిస్థాన్ నుండి వచ్చిన శరణార్థుల పునరావాసం కల్పనకు సంబంధించిన సమస్యల గురించి నిన్న యిక్కడ సమావేశమైన అస్సాం, త్రిపుర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు సంప్రదింపులు జరుపుకొన్నారు.

పశ్చిమబెంగాల్ లేఖ

పాకిస్థాన్‌పై ఆర్థిక దిగ్బంధంఎవరికినష్టం?

ఇందువల్ల పశ్చిమబెంగాల్ ఆర్థిక సంక్షోభానికి గురి అయ్యే ప్రమాదం

కలకత్తా, ఏప్రిల్ 25

ఇటీవల పాకిస్థాన్‌కు వెళ్లే గూడ్సుబళ్ళను ఆటకాయించి, పాకిస్థాన్‌పై ఆర్థిక దిగ్బంధం అమలు జరపాలనే వుద్యమం బెంగాల్‌లో ప్రారంభమయింది.

పాకిస్థాన్‌ను ఆర్థికంగా దిగ్బంధం చేయాలనే వారికి కావలసిందేమిటి? ప్రభుత్వం మీద వొత్తిడి తెచ్చి తూర్పు పాకిస్థాన్‌లోని అల్పసంఖ్యాకులకు సాయపడాలనికదా వారి ఉద్దేశం! కాని, నిజానికి దీనివలన వారి స్థితి మరింత కష్టతరం అవుతుంది.

రెండు దేశాల మధ్య సత్సంబంధాలు ఏర్పడితేనే అల్పసంఖ్యాకుల స్థితి బాగుపడుతుంది. భారత దేశం ఆ పనికే ప్రయత్నిస్తూ వస్తూంది. జరగకుండా చేయడమే పాకిస్థాన్ పాలకులు పొరుగునా చేస్తున్నపని.

ఆర్థిక దిగ్బంధంవలన రెండు దేశాలమధ్యా ద్వేషభావం తీవ్రం అవుతుంది. పాకిస్థాన్ ప్రభుత్వం భారతదేశంయెడ విద్వేషం రెచ్చగొడుతూ కల్పిస్తున్న ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణాన్ని అది బలపరుస్తుంది. అంతేకాదు, దాని వలన పాకిస్థాన్‌కన్న భారతదేశం ఎక్కువగా నష్టపడుతుంది.

ఈ ఆర్థిక దిగ్బంధ నోద్యమాన్ని రాష్ట్రంలోని కాంగ్రెసు, కమ్యూనిస్టు పార్టీలు రెండూ వ్యతిరేకించినా కొంతమంది ప్రజలు తప్పుదారి తొక్కనే తొక్కారు. పాకిస్థాన్‌లోని అల్పసంఖ్యాకులయెడ భారత ప్రజలకు గల అదుర్దాను అర్థం చేసుకోగలం. కాని, ఆర్థిక దిగ్బంధంతో ఆ సమస్య పరిష్కరించబడుతుందను కోవడం అమాయకత్వం.

ఈ పిలుపును మొదట ఇచ్చినది భారత రివల్యూషనరీకమ్యూనిస్టుపార్టీ అనే చిన్నసంస్థ. దానిని ఫార్వర్డుబ్లాకు, జనసంఘం,హిందూమహాసభవంటి నానా గోత్రాల వారూ బలపరిచారు. "తూర్పుపాకిస్థాన్ అల్పసంఖ్యాక ప్రజారక్షణ సంఘం" అంటూ ఒకటి ఏర్పడింది, దానికి ఫార్వర్డు బ్లాకువే నాయకత్వం. రెండు దేశాల మధ్య జరిగిన వ్యాపార ఒడంబడికల ప్రకారం పాకిస్థాన్‌కు సరుకులు తీసుకొని పోతున్న "గూడ్సు"బళ్ళముందు బైఠాయించండని కమిటీ పిలుపు నిచ్చింది.

పాకిస్థాన్‌నుంచి వలస వస్తున్న జనానికి ఈ చర్యవలన కలిగే ఇబ్బందుల మాట వదలండి, దానివలన పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థకు కలిగేనష్టం పెద్ద అంతగా ఉండదని చెప్పడానికే ఈ వ్యాసం. వలస వస్తున్న ఒక వ్యక్తిని హింసించినందుకు కొద్దిరోజుల క్రితం పాకిస్థాన్ నుంచి వస్తున్న ఒక గూడ్సు ట్రెయిను డ్రైవరును అరెస్టు చేసినందుకు, అసమ్మతి తెలుపుతూ తూర్పు పాకిస్థాన్‌నుంచి కలకత్తా వచ్చే ప్యాసింజరు బండ్లలో పనిచేసే పాకిస్థానీయులు సమ్మె చేశారు. దానితో పాకిస్థాన్ హద్దులోపలవున్న స్టేషనువద్ద కాందిశీకుల బళ్ళు నిలిచిపోయాయి. గుడ్సుబళ్లను ఆపడం వలనమరల అటువంటి పరిస్థితులే ఏర్పడవచ్చు దానివలన ఇబ్బంది లెక్కువవుతాయి.

పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ చాలవరకు భారత దేశంమీదనే ఆధారపడివున్నదనీ, అందుచేత ఈ విధంగా బిగిస్తే అల్ప సంఖ్యాకులయెడ కొంత సమరసభావం చూపక తప్పదనీ కొందరు వాదిస్తున్నారు. కాని, రెండు దేశాల మధ్య జరిగిన వ్యాపార ఒడంబడికలను వారు గమనించడంలేదు. పరస్పరం అమ్ముకొనే సరుకుల పట్టికలు చూస్తే రెండు దేశాలూ ఒకదానిమీద నొకటి ఆధారపడి వున్నాయని తెలుస్తుంది. బొగ్గు, సున్నపురాయి, ఖనిజాలను భారతదేశం ఎగుమతి చేస్తూంది. గోగునార, పత్తి, చర్మాలు, చేపలు మొదలయినవి తెచ్చుకొంటూంది.

పాకిస్థాన్‌నుంచి దిగుమతి చేసుకొంటున్న వాటిలో గోగునార, పత్తి చాలముఖ్యం. మనం తెచ్చుకొంటున్నది మంచిరకం నారఅని దానితో తయారుచేసిన మేలురకం వస్తువులను విదేశాలకు మనం ఎగుమతి చేస్తున్నామనీ అందరికీ తెలిసిన విషయం. దానివలన మనకు విదేశీ ద్రవ్యం లభిస్తూంది. దానిలో పాకిస్థానుతో మనకో మూల పోటీ వుండనేవుంది. ఇప్పుడు నార తెప్పించడం మానితే మనం మరింత నష్టపడతాం. అంతేకాదు. జూట్ పరిశ్రమ చిక్కుల్లో పడి ఎన్నో వేల మంది కార్మికులు నిరుద్యోగులవుతారు. ఇంక నార పండించాలి, దానికోసం పెడితే ఆహార పంటలు తగ్గుతాయి. పత్తి విషయంలోకూడా అదే స్థితి.

ఇంక ఎగుమతుల విషయం. మనం రసాయనిక, ఇంజనీరింగ్, సైంటిఫిక్ వస్తువులు పంపుతున్నాం. మన దేశంలో పరిశ్రమలు వృద్ధిపొందిన కొలదీ అటువంటి తయారీ సరుకుల ఎగుమతి అవసరాలు పెరుగుతాయి.

పాకిస్థాన్ అభివృద్ధి కుంటుబడి వుండడంచేత కొంతకాలం వరకూ మన సరుకుల కక్కడ మార్కెట్టుంటుంది. మన అక్కడినుంచి ముడి వస్తువులు తెప్పించుకోకుంటే పాకిస్థాన్ ఇతర ఆగ్నేయాసియా దేశాలకు తరలిస్తుంది.

భారతదేశంనుంచి పాకిస్థాన్‌కు బొగ్గు ఎగుమతి చేయడం గురించి పెద్దరభస చేస్తున్నారు. మనం పంపకపోతే పాకిస్థాన్‌కు మొదట కొద్ది కాలం చిక్కు ఏర్పడ్తా. సరుకు ఎక్కడినుంచో తెప్పించుకో లేకపోదు. కానైతే ధర కొంచెం ఎక్కువ కావచ్చు. కాని, దాని వలన భారత దేశానికేమన్నా లాభం వుందా? ఇప్పుడు పాకిస్థాన్ మన దేశం నుంచి బొగ్గు ఎక్కువగా కొంటూంది. ఇతర దేశాలలో మన బొగ్గు అమ్మకాలు తగ్గుతున్నాయి. ఈ దశలో పాకిస్థానుమార్కెట్టును వదులుకొంటే [illegible].లేదా, ఇప్పటికే బొగ్గునిలువలుగనుల వద్ద పేరుకొంటున్నాయి. మూడో ప్రణాళికా కాలంలో పాకిస్థాన్‌కు పెద్ద మొత్తం బొగ్గు ఎగుమతికి కేటాయించారు. ఈ స్థితిలో ఎవరో కొందరు బాధ్యతారహితంగా డిమాండు చేస్తున్నారు గనుక పాకిస్థాన్ మార్కెట్లు వదులుకోవడం ఆత్మహత్యా సదృశం.

ఆర్థిక దిగ్బంధ వాదులు మరోవిషయం మరుస్తున్నారు. సరుకుల అమ్మకం విషయంలో మనదేశం స్థితి మరీ అనుకూలంగా వున్నదని వారి అభిప్రాయం. రెండుదేశాలూ సమానమైన విలువకు సరుకులు దిగుమతి చేసుకోవడం ఒప్పందం. కాని, భారతదేశం ఎగుమతి చేసుకొంటున్న వానికన్న దిగుమతి చేసుకొంటున్నవి అధికంగా వున్నవని కనబడుతుంది. 1957 లో సగటున భారత దేశంనుంచి నెలకు 61 లక్షల రూపాయల సరుకు ఎగుమతి చేశాం. 93 లక్షల రూపాయల సరుకు దిగుమతి చేసుకొన్నాం. ఒక్క 1961 లో నెలకు 12 లక్షల రూపాయల సరుకు (దిగుమతి చేసుకొన్న దానికన్న) ఎక్కువ ఎగుమతి చేసిందే తప్ప మిగిలిన సంవత్సరాలన్నింటా 57 నాటి పరిస్థితులే సాగాయి. ఈ అయిదేళ్ళలో భారతదేశం 94,87,65,000 రూ. ల సరుకు దిగుమతి చేసుకొంది. 58,60,81,000 రూ.ల సరుకు ఎగుమతి చేసింది.

అంటే 36,26,84,000 రూపాయలు మనమే ఇవ్వ [illegible]. ఈ దశలో మన ఎగుమతుల నిలిస్తే ఈ లోటు ఇంకా పెరుగుతుంది. ఆ దేశపు మార్కెట్ మనకు తగ్గుతుంది. వాళ్ళు తమ సరుకు ఇతరత్రా తెచ్చుకుంటారు. మనకు ముఖ్యమైన ముడి సరుకులు పోతాయి. తయారీ సరుకుల మార్కెట్టూ పోతుంది.

పైగా ఈ బహిష్కరణవలన పశ్చిమ బెంగాల్ ప్రజలకు కొన్ని అవసరవస్తువులు పాకిస్థాన్‌నుంచి రావడం ఆగుతుంది. ప్రతి బెంగాలీ కుటుంబమూ వుపయోగించే చేపలు ఆమాదిరివనుకే. తూర్పు పాకిస్థాన్‌నుంచి చేపలు రాకపోతే దొంగవ్యాపారుల్నీ, చట్టా వ్యాపారుల్నీ అసలు పట్టశక్యమా? ఒక్కరోజు చేపలు పాకిస్థాన్‌నుంచి రాకపోతే కలకత్తాలోనూ, చుట్టుపక్కలా వాటి ధర పెరుగుతుంది. గుడ్లు, పక్కులు, కోళ్ళు మొదలయిన వాని విషయంలోకూడా అదేస్థితి. ఆర్థికదిగ్బంధం జరగాలనే తొందరపాటు డిమాండు అమలుజరిగితే, ప్రతి బెంగాలీ కుటుంబమూ నష్టపడుతుంది.

సైబీరియాలో అపార నూనెనిల్వలు

మాస్కో, ఏప్రిల్ 26

ప్రస్తుత సంవత్సరంలో సైబీరియాలో నమ్మ రానంతటి నూనె నిల్వలు కనుక్కోబడినందున, కొద్ది సంవత్సరాలలోనే ప్రపంచంలోకెల్లా పెద్ద నూనె ఉత్పాదక దేశంగా కావడానికి సోవియట్ యూనియన్ సన్నద్ధమౌతున్నది.

అధికార లెక్కల ప్రకారం సోవియట్ నూనె ఉత్పత్తి సగటున సాలీనా 2 కోట్ల టన్నులు పెరుగుతున్నది. 1964 లో 22 కోట్ల టన్నుల ఉత్పత్తివుంటుంది. 1970నాటికి నూనె ఉత్పత్తిని దాదాపు 67 శాతం పెంచడానికి, 1980 నాటికి మూడు రెట్లు చేయడానికీ, ప్రణాళిక వేయబడింది. వచ్చే సంవత్సరాలలో సగటున సాలీనా 3 కోట్ల టన్నులు పెరుగుతుందని అనుకుంటున్నారు.

సోవియట్ నూనె మంత్రి నికోలాయ్ బాయిబకోవ్ యిటీవల ఒక ఇంటర్వ్యూలో యిలా అన్నాడు: "సోవియట్ నూనెభవిష్యత్తు కొత్త ప్రాంతాలతో-పశ్చిమ సైబీరియాతోనూ, కాస్పియన్ సముద్రంలోని మాంగిష్లక్ ద్వీపకల్పంతోనూ-ఎక్కువగా ముడిపడివుంది. ఈ ప్రాంతాలనుంచి ఇంతవరకూ ఒక్కగ్యాలన్‌కూడా రవాణా కాలేదు. కాని నేటినుండి పదేండ్లలోనే ఆ ప్రాంతాలలో జరిగే నూనె ఉత్పత్తి లక్షలాది టన్నులలో వుంటూ, సుప్రసిద్ధ పురాతన నూనె ఉత్పాదక కేంద్రమైన బాకూ (అజర్ బైజాన్) స్థాయిని మించిపోతుంది."

పశ్చిమ సైబీరియా నిల్వల అంచనాలను గురించి బాయిబకోవ్ యిలా అన్నాడు: "పశ్చిమ సైబీరియాలోని నూనె నిల్వలు వేలకోట్ల టన్నులలోనూ, సహజ వాయువు లక్షల కోట్ల ఘనపు మీటర్లలోనూ వున్నట్లు అంచనాలు వేయబడినాయి. మాంగిష్లక్ ద్వీపకల్పంలోని నిల్వలు కొంత తక్కువగా వున్నాయి. కానీ అక్కడకూడా నూర్లకోట్ల టన్నులలోనూ లక్షలకోట్ల ఘనపుమీటర్లలోనూ వుంటాయి."

ఈ ప్రాంతాలలో వ్యాపారసరళిలో నూనె ఉత్పత్తి యీ యేడు ప్రారంభమౌతుందని ఆయన అన్నాడు. "ఫలితాలు అద్భుతంగా వుంటాయి."

ఆర్కిటిక్ ప్రాంతంనుండి ఉత్తరయూరల్ పర్వతాలకు సహజవాయువు సరఫరాకు ఒక పైపులైను వేయబడుతున్నదని బాయిబకోవ్ అన్నాడు. యూరల్ పర్వతాలను ఓబ్‌నది మధ్య ప్రాంతాలతో కలుపుతూ ఒక రైలు మార్గం త్వరలోనే పూర్తవుతుంది. సైబీరియాలోని ఓమ్స్క్‌లో ఒక పెద్ద తైల రసాయనిక మిశ్రమ పరిశ్రమ కేంద్రం నెలకొల్పబడు తున్నది.

ఓబ్ ప్రాంతంలో కనుక్కోబడిన సహజ వాయువు గురించి బాయిబకోవ్ యిలా అన్నాడు:



అభ్యుదయ పథంలో సింహళ మహిళలు

యూనివర్సిటీ స్థాయివరకు ఉచితవిద్యా సౌకర్యాలతో సత్వర విద్యాభివృద్ధి

ప్రపంచంలో తొలిసారిగా ఒక మహిళ ఒక దేశానికి ప్రధాన మంత్రి పదవి నలంకరించింది సింహళ దేశంలో. ఆ దేశంలో స్త్రీలు ఏవిధంగా తమ హక్కులకొరకు పోరాడారు? ఏవిధంగా అభివృద్ధిని సాధించుకున్నారు? ఈ వ్యాసంలో వివరించబడింది.

గత కొద్ది తరాల్లో సింహళ దేశ స్త్రీలు చాలా అభివృద్ధిసాధించారు. ప్రపంచంలో తొలి మహిళా ప్రధాని సింహళ మహిళే నన్న విషయం అందరికీ తెలిసిందే. ఒకనాడు గృహ ప్రాంగణందాటి ఎరుగని సింహళ స్త్రీలు ఈనాడు పార్లమెంటులో, ఐరాస లో కూడా అడుగుపెట్టారు.

అనేక దేశాలలో స్త్రీలు పార్లమెంటులో సభ్యులుగా, విదేశాలలో ప్రతినిధులుగా ఉన్నప్పటికీ ఆసియా దేశాలలో స్త్రీలు ఈ విధంగా ఉండటం చాలా అద్భుతమైన విషయమే.

ఈనాడు సింహళంలో స్త్రీలు యించుమించు అన్ని వృత్తులలోను, ఉద్యోగాలలోను పనిచేస్తున్నారు. ఉదయంపూట వీధిలో నిలబడితే రకరకాల పనులపై, రకరకాల దుస్తులు ధరించి వెడుతున్న స్త్రీలు - టీచర్లు, నర్సులు, స్టెనోగ్రాఫర్లు, రిసెప్షనిస్టులు(అతిధులను ఆయా సంస్థల్లో గౌరవించి కూచోబెట్టేవారు) చీరలు ధరించినవారు, గౌనులుధరించినవారు కన్పిస్తారు, లాయర్లుగా, డాక్టర్లుగా, వ్యవసాయ కార్మికులుగా, పోలీసు ఉద్యోగినులుగా దౌత్య ప్రతినిధులుగా - ఒకరేమిటి యించుమించు స్త్రీలు లేని రంగమంటూలేదు.

కొన్నాళ్ల క్రితం అయితే, అండ తోడు లేకుండా పడుచు పిల్లలను యిల్లు దాటి బైటకు తిరగనిచ్చే వారుకాదు. కాని ఈనాడు యువతులు ఒంటరిగా రైళ్లలో, బస్సులలో ప్రయాణం చేయగలరు. అంతేకాదు కార్లు, స్కూటర్లు నడుపుకుంటూ ప్రయాణించ గలరుకూడా.

స్త్రీలకు విద్యావకాశాలు విరివిగా కల్పించడంలో గతకొలది సంవత్సరాలలోనే అతి త్వరితగతిని సింహళ స్త్రీలు అభివృద్ధి సాధించారు. ఈనాడు ఎంత పేద కుటుంబంలో పుట్టిన బాలిక అయినా స్కూలుకుపోయి చదువుకోవచ్చును. 20 సంవత్సరాల క్రితం కేవలం ధనికుల యింటిబిడ్డల మాత్రమే ఈ అవకాశం ఉండేది.

సింహళంలో యూనివర్సిటీ విద్యతోసహా స్త్రీలకు 1943 లో ఉచిత విద్యావకాశాలను కల్పించారు. ఎప్పుడైతే ఈ అవకాశం కల్పించారో సింహళంలో ఒక విచిత్రమైన విషయం సంభవించింది. కాండీలోని ప్రభుత్వ యూనివర్సిటీ ప్రవేశ పరీక్షలలో పెద్ద పోటాపోటీ ఉన్నప్పటికీ యీ యూనివర్సిటీలో యువకులకంటే యువతులే ఎక్కువ సీట్లు సంపాదించగల్గారు.

ఆధునిక కాలంలో సింహళ స్త్రీల పురోభివృద్ధికి వారి పాత సంప్రదాయాలు కూడా చాలా అనుకూలంగాను, వీలుగాను ఉన్నాయేమోనని పించుతుంది. ప్రాచీన సింహళ చరిత్రల కాలంలో సింహళ స్త్రీలు సహజ జీవితంలో తమ పాత్రను నిర్వహించడానికి ఎట్టి అవరోధమూ ఉండేది కాదు. వారికి ఏ గోషా ఉండేదికాదు. ఇండ్లగడప దాటరాదనే ఆచారమూ ఉండేదికాదు. అయితే గడిచిన కొద్ది శతాబ్దాలలో స్త్రీలు కేవలం గృహ బాధ్యతలను నిర్వహించి, పిల్లలను కనడం, భర్తలకు సేవ చేయడం మామూలుగా ఉండేది.

పశ్చిమ దేశాలతో సన్నిహిత సంబంధాలు పెంపొందడం వలన, విద్యాభివృద్ధివలన సాంఘిక, రాజకీయ రంగాలలో ముందుకురావాలనే కోర్కె స్త్రీలలో సహజంగా బయలుదేరింది. గత శతాబ్దం ఆఖరుదశలో స్త్రీలలో విద్యావ్యాప్తికొరకు వారు స్వచ్ఛంద సేవాసంఘాలను ఏర్పరచి ఎంతో కృషి చేశారు. ఈనాడు అటువంటి స్త్రీల స్వచ్ఛందసంఘాలు అనేకం ఉన్నాయి.

ప్రస్తుతం ప్రధానిగానున్న శ్రీమతి సిరిమావో బండారునాయకే అంతకుముందు 10 సంవత్సరాల పాటు ఇటువంటి స్వచ్ఛంద సేవా సంఘాలలో పనిచేసిన మహిళ. సిలోన్ మహిళా సంఘంలో ప్రముఖ పాత్ర వహించారు. ఈ సంఘానికి 2,000శాఖలున్నాయి.

ఐక్యరాజ్య సమితికి మొట్టమొదటి మహిళా ప్రతినిధిగా పంపబడిన శ్రీమతి ఎవిలిన్ డెరానియాగాలా ఇదే విధంగా అనేక సంవత్సరాల పాటు మహిళా సంఘంలోపనిచేసిన స్త్రీ. ఈమె సింహళంలోని మొట్టమొదటి న్యాయవాదికూడా. ఈమె ఆక్స్‌ఫర్డ్‌లో న్యాయవాదపట్టా తీసుకొన్నది. 1931 లో సింహళ స్త్రీలు ఓటింగ్ హక్కు సాధించుకున్నారు. ఇది వారి పురోభివృద్ధిలో ఒక మైలురాయి వంటిది. అంతకు ముందు మూడుసంవత్సరాలుగా స్త్రీలకు ఓటింగ్ హక్కులుండాలని మహిళాసంఘాలు ఆందోళన ప్రారంభించాయి. మొదట దీనిని ఎవరు పెద్దగా పట్టించుకోలేదు, కాని ఆ తరువాత వీరి ఆందోళనను గుర్తించక తప్పలేదు.

1948 లో బ్రిటన్‌నుండి సింహళం స్వాతంత్ర్యం సాధించుకుంది. స్వాతంత్ర్య సంపాదనతో స్త్రీలు తమ రాజకీయ హక్కుల కోసం మరింత ముందంజ వేశారు. దేశంలో పార్లమెంటరీ పరిపాలన ఏర్పడినప్పుడు స్త్రీలు పార్లమెంటు సభ్యులుగా ఎన్నుకోబడ్డారు.

కొద్ది సంవత్సరాల కాలంలోనే సింహళం సెనేటుకు ఒక మహిళ ఉపాధ్యక్షురాలుగా ఎన్నుకోబడింది. 1958 లో ఒక మహిళ ఆరోగ్య శాఖ మంత్రిగా నియమింపబడింది. ప్రపంచానికంతకూ మహిళా ప్రధానిగా ఈనాడు శ్రీమతి బండారు నాయకే తన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తిస్తోంది.

(ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సౌజన్యంతో)

చర్మకారులలో పేరుపొందిన స్త్రీ

జోళ్ళ మరమ్మత్తుల అంతర్జాతీయ పోటీ ఒకటి ఈమధ్య ఇంగ్లండులోని బ్లాక్‌పూల్‌లో జరిగింది, దానిలో మ్యూనిచ్ నగరానికి చెందిన బిర్జిత్ స్టిగిల్‌మెయిర్‌కి మొదటి బహుమానం లభించింది. ఈ పోటీలు ఏడాదికి ఒక దేశంలో జరుగుతాయి. వీటిలో మహిళలకి ప్రధమ బహుమానం లభించడం యిదే మొదటిసారి.

ఈ పోటీలో పాల్గొనడం కోసం బిర్జిత్ తన పెళ్ళినాటి పాతజోళ్ళు పైకి తీసింది. డాన్సుల ఫలితంగా అరిగిపోయిన మడమలనీ, యితర భాగాలనీ చక్కగా మరమ్మత్తు చేసింది. అది సరికొత్త జోడులా తయారయింది. ఈ పోటీ నిర్వాహకులు నియమించిన అంతర్జాతీయ నిర్ణయసంఘం వందలాదిజోళ్ళు పరిశీలించిన తర్వాత వారు స్టిగెల్ మెయిర్ పనిమెచ్చుకొని ప్రథమ బహుమాన మిచ్చారు. నిజానికి ఆమె చర్మకారుల జాతికి చెందినది కాదు. ఒక వర్తక ప్రముఖుని భార్య.

— "గ్లోబల్"

అలంకారం అనాదిగా ఉన్నదే

గోళ్ళకిరంగు, మొహానికి పౌడరు, వేళ్ళకి రంగు మేమే వేసుకుంటున్నామని ఆధునికస్త్రీలు అనుకుంటే అనుకోవచ్చుగాని అవి ఆనాదిగా ఆడవాళ్ళందరికీ తెల్సినవే. సంస్కృత గ్రంథాలు పఠించినవారికి లాక్షారాగం అలక్తకము, పుష్పపరాగం మొదలయినవి పూర్వకాలపు స్త్రీలువాడే వారన్నసంగతి తెలుస్తుంది.

అంతేకాదు. ఇటువంటివి రాతి కాలపు స్త్రీలుకూడా వాడేవారని జర్మనీలో టోవర్ స్పాగ్ఞనీలో లోగడ దొరికిన పురావస్తువులవల్ల తెలుస్తోంది. వారి కక్కడ లాక్ష రాగంవంటి ఎఱ్ఱని పదార్థం దొరికింది. దీనిని మొహానికి వేసుకునే వారని తెలుస్తోంది. కాగా దీనిని పురుషుల వలపు చూరగొనడానికి స్త్రీలు ధరించేవారా? శతృవుల బెదరగొట్టడానికి పురుషులు ధరించేవారా? అని చరిత్రకారులు శుష్కవాదాలు సాగిస్తున్నారు.

మహిళలు కష్టజీవులు

మగవారే ఎక్కువ పనిచేస్తారనీ, ఆడవారు తక్కువ కష్టపడతారనీ అనడం పరిపాటి. అంతేకాదు, మన దేశంలో శ్రమ తగ్గించే ఆధునిక పరికరాలు లేకపోవడంచేత మన మహిళలు విదేశాలలో దొరసానులకన్న ఎక్కువ కష్టపడుతున్నారనడం తరుచు వింటాం. కాని పారిశ్రామికంగా అభివృద్ధిచెందిన దేశాలలో, అంటే విద్యుచ్ఛక్తి సహాయంతో పనిచేసే ఆధునిక పరికరాలున్న దేశాలలో మహిళలు ఎంత కష్టజీవులో తెలిస్తే మనం ఆశ్చర్యపోతాం. పశ్చిమ జర్మనీలో మేక్స్‌ప్లాంక్ పరిషత్తువారీ విషయంపై జరిపిన పరిశోధనల ఫలితాలుచూస్తే, ఆ దేశంలో స్త్రీలు గృహనిర్వహణకోసం బొగ్గుగనులలో పనిచేసే కార్మికుడు ఎంత కష్టపడతాడో, అంత కష్టపడతారని తెలుస్తోంది. వారు వంటకోసం, ఉత్తరాలు వ్రాసుకోవడం కోసం, తేలికయిన దైనందిన కుట్టుపనులకోసం వారానికి 25 గంటలు కష్టపడవల్సి వుంటుంది. వారి నివేదిక ననుసరించి యితరపనులకోసం వారానికి 70 గంటల దాకా పనిచేస్తారు. అంటే స్త్రీలు ఆఫీసులలో పనిచేసే చాలామంది ఉద్యోగుల కన్న ఫ్యాక్టరీ ఉద్యోగాలలో కొన్నిటికన్న శారీరకంగా ఎక్కువ శ్రమపడతారన్నమాట.

స్త్రీలు వారి దైనందిన కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించుకోడానికి రోజుకి వారికి కనీసం 3,200 కేలరీల పుష్టిగల ఆహారం కావాలి. ఇల్లు శుభ్రంచేసుకునే రోజులలోనూ, ఉతుకు రోజులలోనూ, ఇంట్లో జబ్బుచేసిన రోజులలోనూ, వారికి 4 వేల కేలరీలఆహారం కావాలి, బొగ్గుగనులలో పనిచేసే కార్మికునికీ, లేదా కొలిమి పనులు చేసే కార్మికునికీ కూడా అంతే ఆహారం కావాలి.

పశ్చిమ జర్మనీలో ఎవరో మరీ భాగ్యవంతుల యిళ్ళలో తప్పితే చాలామందికి పని మనిషి సహాయం లభించదు. వారు ప్రతిరోజూ చేసే పని చూస్తే వారికే ఆశ్చర్యంవేస్తుంది. ఏడాదికి ఆమె ఆరువేల కప్పులు గ్లాసులు, 13 వేల కంచాలు, 17 వేల కత్తులు, ఫోర్కులు, చంచాలు కడిగి శుభ్రంచేయాలి. వంట యింట్లో నుంచి భోజనాల గదికి, తిరిగి వంటయింట్లోకి ఆమె సాలీనా మోసే కంచాలు, గిన్నెలు, వంట పదార్థాలు,కంచాలు యితర పరికరాల బరువు అయిదు టన్నుల కన్న ఎక్కువ వుంటుంది.

ఆమె రోజుకి 10 వేల అడుగులు నడుస్తుంది. భోజన సామగ్రి, దూపలు, బట్టలు కొనడం కోసం బజారుకివెళ్లే దూరం లెఖ్కవేస్తే సాలీనా జర్మన్ గృహిణి 1250 మైళ్లు నడుస్తుంది. నలుగురు పిల్లలుండి రవంత పెద్ద యిల్లయితే దానికి రెట్టింపు పని ఉంటుంది. నలుగురున్న కుటుంబంలో యిల్లాలు సాలీనా 6,600 పౌనుల తిండి సామాన్లు మోసుకు వస్తుంది. 550 పౌనుల బంగాళా దుంపల తొక్కలు వలిచి వండుతుంది.

250 పెద్ద రొట్టెలు 12 వేల ముక్కలుగా కోసి కాల్చి వెన్న రాస్తుంది. వెయ్యి పింట్ల కాఫీ తయారుచేస్తుంది, 1460 సార్లు పక్కలు వేస్తుంది, దుప్పటీలు మారుస్తుంది. 35 వేల చదరపు గజాల స్థలం అంటే సుమారు ఒక ఫుట్‌బాల్ ఆట స్థలం అంతటిని పాలిష్ చేస్తుంది. కొన్నివేల బొత్తాములు కుడుతుంది. సగటున రెండున్నర మైళ్ళ పొడుగుదారంతో కుట్టుపనిచేస్తుంది. ఇంకా యితర పనులనేకం చేస్తుంది.

ఆమె కష్టపడలేదనడం, పురుషుడు కష్టపడుతున్నాడనడం పునరాలోచింపవల్సిన మాట ఏమో!

— ఇన్‌ఫో

ఆంధ్ర విశ్వసాహితి వార్షికోత్సవం

సికింద్రాబాద్, ఏప్రిల్ 4

ఆంధ్ర విశ్వసాహితి వార్షికోత్సవం 18 వ తేదీ సాయంత్రం వై. ఎం. సి. ఏ. హాలులో జరిగింది. శ్రీ పోతుకూచి సాంబశివరావు అధ్యక్షత వహించి ఆంధ్ర విశ్వసాహితి కార్యక్రమాలు వివరించారు.

కర్ణాటక రచయితలసంఘ అధ్యక్షులు శ్రీ సి. కె. నాగరాజరావు కన్నడ సాహిత్యంలోని కథానిక పోకడలను వివరించారు. ఒకే యితివృత్తం ఆధారం చేసుకొని, సాహిత్యంలోనివివిధ ప్రక్రియలు సృష్టించి ఒక గ్రంథంగా రూపొందించడం, కన్నడ సాహిత్యంలో ఆధునిక పోకడని అన్నారు. ప్రొఫెసర్ గోకక్ కొన్ని కన్నడ కథల యితి వృత్తాలను రస వృత్తాలను రసవంతంగా వివరించారు. శ్రీ గురజాడ అప్పారావు గురించి వారి కుమారులు శ్రీ గురజాడ రామదాసు కొన్ని సంఘటనలు తెలియజేశారు.

కుమారి జయలక్ష్మి తెలుగు పాటలుపాడారు. కార్యదర్శి శ్రీ చంద్రమౌళి వార్షిక నివేదిక చదివి, వందన సమర్పణ చేశారు.

సమావేశములో ఈ క్రింది వారు కార్యవర్గానికి ఎన్నుకోబడ్డారు.

అధ్యక్షుడు : శ్రీ ముళ్ళపూడి తిమ్మరాజు (తణుకు) ఉపాధ్యక్షులు: శ్రీ కె. దాశరథి (మద్రాసు) శ్రీ బి. వి. సుబ్రహ్మణ్యం (హైదరాబాద్) ప్రధాన కార్యదర్శి: శ్రీ పోతుకూచి సాంబశివరావు (హైదరాబాద్) కార్యదర్శి: శ్రీ టి. వి. భద్రిరాజు (హైదరాబాద్) కోశాధికారి: శ్రీ ఎ. వి. జనార్దనరావు, సాహిత్యోపసంఘం అధ్యక్షుడు: శ్రీ భాస్కరభట్ల కృష్ణారావు, [illegible] సంఘం అధ్యక్షుడు: డాక్టర్ సదాశివం. గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు శ్రీ భాగి నారాయణమూర్తి.

జంటనగరాలలో ఉచిత హిందీ తరగతులు

హైదరాబాద్, ఏప్రిల్ 26

హైదరాబాద్ హిందీ ప్రేమీ మండలి- అధ్వర్యమున హైదరాబాద్, సికింద్రాబాదులలో దక్షిణ భారత హిందీ ప్రచారసభవారి ప్రాథమిక, మధ్యమ పరీక్షలకు క్రింద 27 కేంద్రములలో ఉచిత హిందీ తరగతులు నడుపబడుచున్నాయి. రాబోవు ఆగస్టు నెలలో జరుగనున్న పరీక్షలకు విద్యార్థులు చేరవచ్చును.

హైదరాబాదులో విజయనగర కాలనీ, [illegible] కాలనీ, సనత్‌నగర్ కాలనీ, మలకపేట, మలకపేట కాలనీ, అఫ్జల్‌గంజ్ [illegible], [illegible], [illegible], [illegible], [illegible], మలకపేట, అసిఫ్‌నగర్, అంబర్‌పేట, బేగమ్ పేట, డబీర్‌పూరా, గౌలిగూడా చమన్, నాంపల్లి, [illegible] మహిళామందిర్; సికిందరాబాదులో ఆర్యసమాజమందిర్. సీతాఫల మండీ, రాష్ట్రపతిరోడ్, [illegible].

ఇంకనూ అనేకచోట్ల ఉచిత హిందీ తరగతులు నడుపడానికి ఏర్పాట్లు జరుగుచున్నాయి. తరగతులలో చేరగోరువారు ఈ నెలాఖరు లోగా చేరవలెను.

ఏలూరులో శ్రీ ఆవంత్స సోమసుందర్ సన్మాన సభ

ఏలూరు, ఏప్రియల్ 24

అభ్యుదయ రచయిత శ్రీ ఆవంత్స సోమ సుందర్‌ను సన్మానించుటకు ఏలూరులో సన్మాన సంఘం ఏర్పాటైంది. సన్మాన సభ ఏప్రిల్ 29 వ తేదీ బుధవారం సాయంత్రం 5 గంటలకు స్థానిక కళాక్షేత్రంలో జరుగుతుంది. (వి. వి)

ఆసిఫాబాద్ తాలూకా రైతు కార్యకర్తల సభ

ఆసిఫాబాద్, ఏప్రిల్ 23

ఆదిలాబాద్‌జిల్లా ఆసిఫాబాద్ తాలూకా వాంకిడి సర్కిల్‌లో పులార-సౌదరీగ్రామాలలో రైతు కార్యకర్తలసభ ఏప్రిల్ 20 న జరిగింది. ఈ సమావేశానికి శ్రీ కోట్నాల్ [illegible] అధ్యక్షత వహించారు. ఇక్కడ జరుగుతున్న ముక్తెదార్ అన్యాయాలపైనా, సత్యాగ్రహ పోరాటంపైనా వీరు చర్చించారు.

ప్రభుత్వం అదనపు శిస్తు తగ్గించనందున పోరాటం విస్తృతంగా సాగించాలని ఆదిలాబాద్ జిల్లా రైతు సంఘ కార్యదర్శి శ్రీ పి. నర్సయ్యగారు కోరారు. ఆ తర్వాత సాయంత్రం 8గంటల నుండి 10 గంటల వరకు సౌదరిలో 60 మంది కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి శ్రీ మడావి బోజ్జు అధ్యక్షతవహించారు.

సమావేశంలో శ్రీ పి. నర్సయ్యగారు మాట్లాడుతూ యిక్కడ గోండురైతులకు చాల మందికి భూములు లేక కూలి.పనిచేసి జీవించ వలసినపరిస్థితి ఏర్పడిందని పటేల్‌దార్లు, మక్తేదార్లు దారుణంగా 10 రూపాయలు రావలసి వుండే 50 రూపాయల వరకు వసూలు చేస్తున్నారనీ తెలిపారు.

ఆసిఫాబాద్ తాలూకాలో బియ్యం సరిగా దొరకటంలేదు గనుక తగిన ఏర్పాటు చేయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఒంగోలు చెరువులో రోడ్డు నిర్మాణం

మున్సిపాలిటీ చర్యకు కమ్యూనిస్టుపార్టీ అసమ్మతి

ఒంగోలు, ఏప్రిల్ 25

ఒంగోలు పట్టణ ప్రజలకు మంచినీటికి ఆధారమైన రంగరాయుని చెర్వులోగుండారోడ్డు వేయుటకు కొంత పూడ్చివేసి ఆలమందల కిచ్చుటకు తీర్మానించి కొద్ది రోజులుగా రోడ్డు పనులు చేయుచున్నారు. ధర్మ చెరువుగా వున్న రంగారాయుని చెర్వుపైన మునిసిపాల్టీవారికి మనోమొద హక్కు మాత్రమే గలదు. ఇట్టి చర్యలు చేయుటకు హక్కు లేదు, అంతేకాక ఈ పనివల్ల పట్టణ ప్రజల నీటి వసతికి ఎంతైనా ఇబ్బంది కలుగగలదు," అని ఒంగోలు పట్టణ కమ్యూనిస్టు కమిటీ ఏప్రిల్ 21 న సమావేశమై తీర్మానించింది.

ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం బజారులో కిలోగ్రాం ఒకటికి 0-61 న. పై. చొప్పున బియ్యం అమ్ముటలేదు. ప్రభుత్వం తానే చౌకడిపోలు పెట్టించి నిర్ణయించిన రేటు ప్రకారం అమ్మించే ఏర్పాటు చేయవలసినదిగా కోరుతున్నాము" అని మరొక తీర్మానం చేశారు.

పోలీసులను కొట్టిన కేసులో శిక్షలు

హుజూర్‌నగర్, ఏప్రిల్ 20

మునగాల పరగణా జగన్నాథపురంలో కాంగ్రెస్ స్వామి అయిన శ్రీ కొల్లి కోటయ్య కుమారుడు శ్రీ అభిరామయ్య భార్య ఎండ్రిన్ త్రాగి చనిపోయినదని మునగాల పోలీసు స్టేషన్‌కు రిపోర్టు చేయబడినది.

ఈ రిపోర్టు మీద మునగాల హెడ్‌కానిస్టేబుల్ యం. వీరయ్య, కె. అనంతరాములు పి. సి. జగన్నాధపురం వెళ్లి శవ పంచాయితీ జరిపి శవమును పోస్టుమార్టమునకు తీసుకొని వెళ్లాలని చెప్పగానే శ్రీ కోటయ్య కుమారులు మరికొంత మంది పోలీసులను ఎదిరించి శవ పంచాయతీ రిపోర్టు చించి శవమును దహనం చేశారు.

దీనిమీద మునగాల పోలీసువారిచే హుజూర్‌నగర్ మేజిస్ట్రేటు కోర్టులో 18 మందిమీద కేసు పెట్టబడినది.

ఈ కేసు విచారణ జరిగి మొన్న 17 వ తేదీన తీర్పు చెప్పబడినది. ఈ తీర్పులో శ్రీ కొల్లి కోటయ్యకు రు. 500 లు జరిమానా, వీరి కుమారులు లక్ష్మీనరసయ్య, అభిరామయ్య, అనంతరాములయ్య మరి నలుగురికి మూడు నెలలు శిక్ష, 4 వందలు జరిమానా, మరి నలుగురికి 6 నెలల శిక్ష, 4 వందలు జరిమానా విధించింది.

తక్కిన అపరాధులందరినీ నిర్దోషులని కోర్టు విడిచి పెట్టింది.

అధిక ధరలకు వ్యతిరేకంగా పంజాబ్‌లో గృహిణుల ఆందోళన

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో మూడు రోజులపాటు నిరాహార దీక్ష

చండీఘడ్, ఏప్రిల్ 26

రోజు రోజుకు పెరిగిపోతున్న నిత్య జీవితావసరవస్తువుల ధరలను నిరసించుతూ పంజాబ్‌లోని మహిళలు దేశానికంతకు ఆదర్శప్రాయంగా కదిలి ఆందోళన చేస్తున్నారు. పంజాబులోని వివిధ ప్రాంతాలలో గృహిణులు మూడు రోజులు నిరాహారదీక్ష సాగించారు.

పంజాబ్ మహిళాసంఘ ఆదేశానుసారం చండీగఢ్‌లో పదిమంది మహిళా కార్యకర్తలు శ్రీమతి విమల డాంగ్ (మున్సిపల్ కౌన్సిలర్) బిహారాతా పట్టణంలోని కార్మిక కేంద్రాలలో మూడుచోట్ల మూడురోజులపాటు నిరాహార దీక్ష ప్రారంభించారు.

ఇదే విధంగా పంజాబులోని వివిధ ప్రాంతాలలో నిరాహార దీక్ష ప్రారంభించారు.

1. ధరలను అరికట్టడానికి ఖచ్చితమైన, తక్షణ చర్యలు తీసుకోవాలి.
2. వినిమయ సరకులపై పన్నులను రద్దు చేయాలి.
3. కిండర్ గార్డెన్లు, ఆరోగ్య కేంద్రాలు విరివిగా స్థాపించాలి.
4. బ్యాంకులను జాతీయం చేయాలి.

ఈ కోర్కెలు నెరవేరేవరకు ఆందోళన సాగించాలని పంజాబుమహిళాసంఘం యిచ్చిన కార్యక్రమంలో రెండవదశగా ఈ నిరాహారదీక్షను, ఇప్పుడు సాగించుతున్నారు. మొదటి దశలో స్త్రీలు పెద్దఎత్తునప్రదర్శనలు నడిపారు.

ఆంధ్ర ఉద్యోగికి రైల్వే సత్కారం

కలకత్తా, ఏప్రిల్-18

ఈ సంవత్సరం రైల్వే వారోత్సవాల సందర్భంలో ఆగ్నేయ రైల్వేలో పనిచేస్తున్న ఆంధ్ర యువకులు శ్రీ పి. ఉపేంద్ర చంద్ర చౌదరిగారికి ప్రత్యేక నగదు బహుమానం లభించింది. భువనేశ్వర్ కాంగ్రెసు మహాసభ సందర్భంలో రైల్వేల తరఫున ప్రచార, ప్రజా సంబంధ కార్యకలాపాలను ప్రశంసనీయంగా నిర్వహించినందుకుగాను వారికి యీ సత్కారం జరిగింది.

కామినేనిపల్లెలో ఉద్యోగులఅఘాయిత్యం

స్త్రీల ప్రతిఘటన

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 24

20 వ తేదీన స్పెషల్ డిప్యూటీ తహసీల్‌దారు కామినేనిపల్లె (ఆళ్ళగడ్డ తా॥) గ్రామానికి వెళ్ళి జప్తుకై శ్రీ వెంకటరెడ్డి అనే రైతు ఇంటిలో ప్రవేశించారు. ఆసామి తన పశువులను జప్తు చేసుకొమ్మని కోరగా నిరాకరించి అక్కడేవున్న రెండు బండి చక్రాలను స్వాధీనం చేసుకొన్నారు. ఎదురుగా నిలిచియుండిన వెంకటరెడ్డిగారి భార్య చెవుల్లో రాళ్ళ కమ్మలను ఒలిచి ఇమ్మని కోరారు. దానితో ఆ యింటిలో వున్న స్త్రీలు సొత్తులతోపాటు స్త్రీలను స్వాధీనం చేసుకోవడం ప్రభుత్వ పన్నుల విధానమైతే అందుకు సిద్ధమేనని హెచ్చరించారు. దానితో రెవిన్యూ సిబ్బంది సిగ్గుతో తలవంచుకొని వెళ్ళిపోయినారు.

ఏలూరు టెలిగ్రాఫ్ ఇంజనీరింగ్ సిబ్బందిసంఘ వార్షికోత్సవం

ఏలూరు, ఏప్రిల్ 26

ఏలూరు బ్రాంచి టెలిగ్రాఫ్ ఇంజనీరింగు ఉద్యోగుల సంఘ 8 వ వార్షికోత్సవం టెలిఫోన్ ఎక్ఛేంజి ఆవరణంలో శ్రీ సంబూరి జనార్దనరావుగారి అధ్యక్షతను ఇటీవల జరిగింది. సభలో లైన్‌స్టాఫ్ డివిజనల్ కార్యదర్శి శ్రీ మల్లిశెట్టి జనార్దనం, శ్రీ సి. విరలమూర్తి, శ్రీ ఎస్. నాగేశ్వరరావుగార్లు వల్లపల్లి, వీరు వరం సంఘాల తరఫున ప్రత్యేకఆహ్వానంపై అతిథులుగా పాల్గొన్నారు. సభను శ్రీ ఇ. శామ్యూల్‌గారు ప్రారంభించారు.

కార్యదర్శి శ్రీ ఎమ్. వెంకట్రావుగారు 1963-64 వార్షిక నివేదికను సమర్పించారు. కోశాధికారి శ్రీ డి. కె. వెంకటాచారిగారు ఆర్థిక నివేదికను సమర్పించారు. కొంత చర్చ అనంతరం రెండు నివేదికలు ఏకగ్రీవంగా ఆమోదింపబడినాయి. శ్రీ మల్లిశెట్టి జనార్దనంగారు, శ్రీ సి. విరలమూర్తిగారు, శ్రీ ఏ. ఎస్. నాగేశ్వరరావుగారు, సంఘ నిర్మాణాన్ని గురించి, ప్రజలకు సంతృప్తికరమైన సేవ చేయడం గురించి. కార్మిక ఉద్యమాన్ని పటిష్ఠంగా నిర్మించడంలో బ్రాంచి స్థాయిలో కార్యకర్తలు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి ఉపన్యసించారు. అనంతరం నూతన సంవత్సరానికి శ్రీ ఎమ్. వి. నాగభూషణం అధ్యక్షులుగా కార్యవర్గం ఎన్నికయింది.

సరళ సంస్కృత పరీక్షా ఫలితాలు

గుంటూరు, ఏప్రిల్ 23

గత మార్చిలో బొంబాయి భారతీయ విద్యాభవన్ వారు జరిపిన సరళ సంస్కృత పరీక్షలలో క్రింది నెంబర్లుగల అభ్యర్థులు ఉత్తీర్ణులైనట్లు సంస్కృత విశ్వ పరిషత్ గుంటూరు శాఖ కార్యదర్శి శ్రీ నేతి సుబ్బారావు, తెలియ జేస్తున్నారు.

సంస్కృత ప్రారంభ :
విశేషయోగ్యత : 198 199 200 201 203 206 207 210 211 212 213 222.
ప్రథమశ్రేణి : 204 208 216 218.
ద్వితీయశ్రేణి : 219 మాత్రం.
తృతీయశ్రేణి : 209 217 220 221 223

సంస్కృత ప్రవేశ :
ప్రథమశ్రేణి : 94 95
ద్వితీయశ్రేణి : 86 88 91 96 97
తృతీయశ్రేణి ; 83 84 85 89 90 92 93

సంస్కృత పరిచయ :
ద్వితీయశ్రేణి : 19 21
తృతీయశ్రేణి : 16 18 22

సంస్కృత కోవిద :
తృతీయశ్రేణి : 378 380

ఒంగోలు తాలూకా యువజన మహాసభ

ఒంగోలు, ఏప్రిల్ 17

ఒంగోలు తాలూకా యువజనసంఘ కార్యకర్తల సమావేశం ఒంగోలులో శ్రీ టి. అనంత కృష్ణయ్యగారి అధ్యక్షతన 17 వ తేదీన జరిగింది. బ్లాకుల ప్రాతిపదికమీద వున్న నిర్మాణమును అనుసరించి తాలూకా ప్రాతిపదిక మీద సంఘమును నిర్మించుటకై తాలూకామహాసభ మే 10 వ తేదీన ఒంగోలులో జరుపుటకు, శ్రీ జి. వి. నారాయణరావు, వేములపల్లి శ్రీ కృష్ణగార్లను ఆహ్వానించుటకున్నూ తీర్మానించడమైనది. సభ్యత్వం చేర్పించుటకు. మహాసభ నిర్వహణకు ధనిశెట్టి సుబ్బారావు గారు అధ్యక్షులుగాను, టి. అనంతకృష్ణయ్య కోశాధికారిగా; నల్లూరి వెంకటేశ్వర్లు కన్వీనరుగా మరి కొంతమందితో ఆర్గనైజింగు కమిటీని ఎన్నుకొన్నారు. (వి. వి.)

తణుకు ఇన్‌ఫ్రూట్ వర్కర్సు యూనియన్

తణుకు, ఏప్రిల్ 18

గత 15 రోజులుగా తణుకులో జరుగుచున్న ఇన్‌ఫ్రూట్ వర్కర్సు సమ్మె విజయవంతంగా ముగిసినది. యజమానులు ఇన్‌ఫ్రూట్ ధరలు పెంచవలసిందిగా కోరుట మూలంగా యీ సమ్మె జరిగినది పూర్వపు ధర లిచ్చుటకు యజమానులు ఆమోదించుటచే పనివారు సమ్మెముగించారు. 17 వ తేదీన వర్కర్సు జనరల్‌బాడీ జరుపుకొని కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘమును రిజిస్టరు చేయించుటకు తీర్మానించారు.

పన్నుల వసూళ్ళలో పక్షపాత దృష్టి

రాజమండ్రి, ఏప్రిల్ 21

రాజమండ్రి తాలూకా గాదరాడ, కడల పూడి, తిరుమలాయపాలెం వగైరా గ్రామాల పన్నుల బకాయీల వసూళ్లకు నియమించబడిన స్పెషల్ రివెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీ వాగ్దేవు రామారావు అధికార దుర్వినియోగం చేసి కనీసం రైతులకు డిమాండునోటీసులైనా ఇవ్వకుండా జప్తులు చేయడం ప్రారంభించారు.

గాదరాడ గ్రామంలో పది పదిహేను రూపాయలలోపు శిస్తు బాకీలకు సైతం బిందెలు వగైరాలను డిమాండు నోటీసు లేకుండా జప్తులు చేయించి, డిమాండు నోటీసు అమలు జరుపకుండా గాదరాడ గ్రామ కరణం వద్ద ఫసలీలనుండి సుమారు రు 150/- లు బాకీవున్నా నోరు మెదపలేదు.

ఈ విషయంలో గ్రామస్థులు తమ తీవ్ర ఆందోళనను రివెన్యూ మంత్రి, జిల్లా కలెక్టరు, రివెన్యూ బోర్డుకు తెలియపరిచారు.

18వ తేదీని రాజమండ్రిసర్కిల్‌ఇన్‌స్పెక్టరు గాదరాడ వచ్చి విచారించగా పై విషయాలు యదార్థాలని ధృవపడ్డాయి.

తిరుమలాయిపాలెంలో కూడా నోటీసులు లేకుండా రెండు యడ్ల జతలను జప్తు చేసినట్లు తెలుస్తోంది. (వి. వి.)

మార్కెట్టుకు వెళ్ళే సరుకు బళ్ళు జప్తు

శిస్తు వసూళ్ళ పేరుతో కాళహస్తి తాశీల్దారు అక్రమ చర్యలు

ఆదరం, ఏప్రిల్ 22

చిత్తూరుజిల్లా కాళహస్తి తాలూకాలో శిస్తు వసూళ్ళ పేరుతో ప్రభుత్వ జి. ఓ. లనుకూడా అతిక్రమించి రెవెన్యూ ఉద్యోగులు అనుసరిస్తున్న అక్రమ పద్ధతులు మితిమీరినవి. ఇవి "విశాలాంధ్ర" పత్రికాముఖాన ఇదివరకే వెలువడినవి.

ఈ నెల 21 వ తారీఖున కాళహస్తి తహసిల్‌దారు ఆ తాలూకాకు చెందిన ఆదరం గ్రామానికి శిస్తు వసూళ్ళకు వచ్చారు. ఈ సందర్భములో తాలూకా రైతునాయకులు శ్రీ వెదుళ్ళపల్లి శంకరయ్య (జ్యోతిశ్రీ) తహసిల్‌దారును కలుసుకొని అప్పుడే మార్కెట్టుకు వెళుతున్న వేరుశెనగ బండ్లనురోడ్డు మార్గంలో ఆపి గ్రామమునసబు స్వాధీనం చేసుకోవడం నిండా అక్రమమనియు, ఏ చట్టమూ ఇందుకు అంగీకరించదని, బాకీ ఉన్నదో లేదో చూడకుండా మార్గమధ్యంలో రోడ్డుపై రైతుల బండ్లను అటకాయించడం జప్తులు చేయడం నాగే గ్రామ మునసబుల స్వాధీనం చేసి బాకీ చెల్లించి సరకు తీసుకొని వెళ్ళమని చెప్పడం చట్ట విరుద్ధమనీ, ఇటువంటి అక్రమ చర్యలు జరుగకుండా చర్య తీసుకోవలసినదనీ కోరినారు.

కాని తహసిల్‌దారు తనకేమీ పట్టనట్లు ప్రవర్తించి - తనకు వసూళ్ళు మాత్రమే కావాల్సివుందన్నారు. ఇక మీదట తాలూకా మొత్తంమీద అన్ని గ్రామాలలో [illegible] ఈ పద్ధతుల అవలంబించబోతున్నట్లు యీ గ్రామంలో కమ్యూనిస్టుపార్టీ ప్రాబల్యం అధికమౌతుంది కాబట్టి తను ఇకముందు ప్రత్యేకంగా వసూళ్ళ సందర్భములో ఈ గ్రామానికి వచ్చేట్లు అప్పుడు చేరిన రైతులను బెదిరించారుకూడా.

అందు శ్రీ శంకరయ్య మాట్లాడుతూ. కనీసం జప్తులు - వేలంలు జరిపించే సందర్భములో చట్టం రైతులకు కల్పించిన సదుపాయాలను అతిక్రమించవద్దని కోరినప్పటికీ తహసిల్‌దారు ఏమాత్రం వినిపించుకోలేదు.

అప్పటికేవున్న గ్రామమునసబు నుద్దేశించి ఇక మీదట జప్తులు చేసినా - చేయకున్నా ప్రతిరైతు, [illegible] చేయనిదే - రైతుల బళ్లను వెళ్లనీయవద్దని హుకుం జారీచేశారు. శిస్తులు పూర్తిగా చెల్లించని - రోడ్డుపై వెళ్లే బళ్లను కూడా ఆపి గ్రామమునసబుల స్వాధీనం చేసేందుకు తనకు హక్కువుందని రైతులను బెదిరించి పోయారు.

ఈ సందర్భములో యీ తాలూకా శాసన సభ్యులు-రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ అల్లూరి బలరామరెడ్డిగారు నియోజకవర్గ ప్రతినిధిగానైనా - కలుగజేసుకొని వసూళ్ళలో అవలంబిస్తున్న నిరంకుశ చర్యలు ఆపుజేయాలనీ, అంతేగాక, శిస్తువసూళ్ళలో రివెన్యూ ఉద్యోగులు అవలంబిస్తున్న అక్రమ చర్యలు నిలుపుదల చేయవలసిందిగానూ, ప్రభుత్వ ఉత్తర్వులు కల్పించిన సదుపాయాలను ఆసరా చేసుకొని రెవెన్యూ ఉద్యోగులపై వైఖరిని విడనాడ పంపించాలని తాలూకా రైతుసంఘ ప్రతినిధి శ్రీ శంకరయ్య ఒక ప్రకటన చేశారు.

పార్వతీపురం

18 వ తేదీన 8 సంఘాల ఉద్యోగులు పార్వతీపురంలో ఊరేగింపు, బహిరంగ సభ జరిపి ప్రదర్శన దినోత్సవాన్ని విజయవంతంగా జరిపారు.

సత్యాగ్రహులకు జైలు శిక్షలు

గుత్తి, ఏప్రిల్ 18

సబ్ తాడిపత్రి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేటు అదనపు శిస్తు సత్యాగ్రహంలో పాల్గొన్న 8 మందికి శిక్షలు విధించారు.

శ్రీమతి బి. పార్వతమ్మకు ఒకవారం, శ్రీయుతులు వెంగన నాయుడు, అశ్వర్థనారాయణరెడ్డి, బి. కేశవరెడ్డి, నాగిరెడ్డి, బయ్యపరెడ్డి, బి. సి. రామప్ప, కె. నేమినూర్‌గార్లకు తలా రెండు వారాలు శిక్షలు విధించారు.

అధిక పన్నులకు నిరసనగా రైతుల నిరాహార దీక్షలు

రాజమండ్రి, ఏప్రిల్ 22

అదనపు శిస్తుచట్టంరద్దు, బంజర్ల సత్వర పంపకం కోరుతూ రాజమండ్రి తాలూకా వివిధ గ్రామాలలో రైతు ప్రముఖులు సాగిస్తున్న నిరాహార దీక్షలు గ్రామ గ్రామానికి పాకుతున్నాయి.

గోకవరం: 12 వ నిరాహారదీక్ష వరుసగా 90 సంవత్సరాల ముదుసలి శ్రీ తాడి సోమిరెడ్డి అదనపు భూమిశిస్తు భారానికి నిరసనగాను, బంజర్లను వెంటనే పంచాలని కోరుతూ 20 వ తేదీ నుండి 3 రోజులు నిరాహారదీక్ష ప్రారంభించారు.

సీతానగరం: శ్రీ పట్టా కృష్ణారావు 20 వ తేదీనుండి 3 రోజులు నిరాహార దీక్ష ప్రారంభించారు.

గాదరాడ: ఈరోజు 8 మంది ఒకరోజు నిరాహార దీక్ష చేశారు.

కణుపూరు: శ్రీయుతులు కొత్తల వెంకటరత్నం, పచ్చిపాల వెంకన్నగార్లు (బంజరు దార్లు) 3 రోజుల నిరాహారదీక్ష ప్రారంభించారు.

సీతానగరం: 17వ తేదీనుండి 3 రోజులు శ్రీ దమ్మా సుబ్బారావు నిరాహారదీక్ష చేశారు.

గాదరాడ: 20 వ తేదీన శ్రీ కాకర్లపూడి సూర్యనారాయణరాజు ఏక దిన నిరాహారదీక్ష చేశారు.

కోరుకొండ: శ్రీ కొక్కిరగడ్డ సూర్యనారాయణమూర్తి 5 రోజుల నిరాహారదీక్ష సాగిస్తున్నారు. రైతాపురంలో ఏక రోజు నిరాహారదీక్షలు, గోకవరంలో నిరాహారదీక్షలు సాగుతున్నాయి. (వి. వి.)

కోరుమామిడిలో అగ్ని ప్రమాదం

నిడదవోలు, ఏప్రిల్ 23

నిడదవోలుకు ఏడుమైళ్ళ దూరంలో నున్న కోరుమామిడి అనే గ్రామం 22 వ తేదీ పగలు 3 గంటలకు అగ్ని ప్రమాదముకు గురి అయినది. హరిజనులవి సుమారు మూడు వందల పూరి ఇండ్లు తగుల బడిపోయినవి. ఆరోజు రాత్రి గ్రామ పెద్దలు బాధితులకు భోజన సదుపాయములు కలుగజేసిరి. ఈ ప్రమాదంలో 5 సం॥ బాలిక మరణించింది.

మతోద్రేకం దేశానికి మహోపద్రవకరం

అనంతపురం, ఏప్రిల్ 18

భారత సేవక్ సమాజ్ కార్యదర్శి శ్రీ చక్రధారి అగర్‌వాల్ (ఢిల్లీ) 15 రోజులు ఆంధ్రప్రదేశ్ పర్యటనకుగాను వచ్చి ప్రథమంగా అనంతపురం సందర్శించి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

లలితకళా పరిషత్ ఆవరణములో ఒక రంగసభ జరిగింది. శ్రీ కల్లూరు సుబ్బారావు గారు అధ్యక్షత వహించారు.

శ్రీ చక్రధారి మాట్లాడుతూ, మైనారిటీల సమస్య ప్రపంచంలో భారతదేశం తలయెత్తుకొని తిరగడానికి వీలు లేకుండా చేస్తున్నదని; పాకిస్తాన్‌లో సంభవించే విపత్తుకు మన దేశంకూడా ఉద్రిక్తమౌతుందన్నారు.

శ్రీ చక్రధరిగారు విలేకరులతో మాట్లాడుతూ స్వచ్ఛమైన దేశభక్తి మత పిచ్చితో కలుషితమౌతున్నదని అన్నారు.

ముస్లిములను మీరు పాకిస్తానీయులని హిందువులు వెలివేస్తే, నిజంగా వారు పాకిస్తాన్ వైపే చూసేపరిస్థితులు కల్పించిన వారవుతారన్నారు.

జే ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

మజ్‌గ్రావ్ డాక్ కార్మికుల సానుభూతి

వాస్కోడిగామా, ఏప్రిల్ 18

డిసెంబరు 17 వ తేదీనుంచి సమ్మెచేస్తున్న జే ఇంజనీరింగ్ వర్క్సు (కలకత్తా) కార్మికులు 7 వేలమంది పోరాటంతో సానుభూతితెలుపుతూ ఆ తగవును ప్రభుత్వం కలగచేసుకొని పరిష్కరించాలని కోరుతూ మజ్‌గ్రావ్ డాక్ కార్మికులు (గోవా) కేంద్ర కార్మిక మంత్రికీ బెంగాల్ కార్మిక మంత్రికీ తంతి పంపారు.

సమ్మెదారుల కోర్కెలయెడ సానుభూతి తెలుపుతూ మజ్‌గ్రావ్‌డాక్ కార్మికులు రూ 25 లను జే ఇంజనీరింగ్ కార్మిక సంఘానికి పంపారు.

రేడియో

బుధవారం, ఏప్రిల్ 29
శక 1886 వైశాఖ 9

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉదయం: 6-30 శుభోదయం; 6-40 ఆం. వా; 6-45 హై. రిలే; 6-55 సూక్తి ముక్తావళి; 7-00 తె. వా; 7-15 ప్రసార విశేషాలు; 7-20 చతురంగం; 7-30 శకుంతలా అనందరావు: 8-00 ఆం. వా; 8-15 హై. రిలే; 8-30 హై. వలె; 9-00 సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 కార్మికుల కార్యక్రమం; 1-00 హై. రిలే; 1-30 వాద్య సంగీతం; 1-40 హిం. వా; 1-50 తె. వా; 2-00 సమాప్తి.

సాయంత్రం: 6-00 స్థానిక ప్రకటనలు; 6-05 ప్రాం.వా; 6-15 నేటి విశేషం; 6-20 గ్రామస్థుల కార్యక్రమం: 7-00 తె. వా; 7-15 గ్రామస్థులకు: 7-30 బొమ్మరిల్లు పాటలు; 7-45 ఫిల్మ్‌సంగీతం; 8-00 తల్లీ-కొడుకు (నాటిక) రచన: బందా కనకలింగేశ్వరరావు; 8-30 వాద్యబృందం; 8-55 ప్రస్తుతాంశం; 9-00 ఆం. వా; 9-15 ఆంగ్లమున; 9-25 మణిహారాలు; 9-30 ఢి. రిలే; 9-45 లలితసంగీతం; శకుంతలా ఆనందరావు; 10-30 ఆం. వా; 10-35 సమాప్తి - జనగణమన.

హైద్రాబాద్ - ఏ

405.4 మీ (740 కిలోసై)

ఉదయం: 6-30 సుప్రభాతం, కార్యక్రమ వివరణ; 6-40 ఆం. వా; 6-45 భక్తిరంజని: కాలపురుష ప్రశంస; 6-55 కిరాతార్జునీయం; 7-00 తె. వా; 7-15 భక్తిపాటలు; 7-30 వి. సుందరమ్మ; 7-45 ఖయాల్; 8-00 ఆం. వా; 8-15 రవీంద్ర గీతాలు; 8-30 టి. వి. విశ్వనాథన్; 9-00 సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 ఏ. రిలే; 1-00 మహిళా సమాజం; 1-30 వయొలిన్; 1-40 హిం. వా; 1-50 తె. వా; 2-00 హై బి. వలె; 2-10 ఉ. వా; 2-20 హై. బి. వలె; 2-30 సమాప్తి.

6-00 స్థానిక ప్రకటనలు; 6-05 ప్రాం. వా; 6-15 ప్రస్తుతాంశం; 6-20 కన్నడ శ్రోతలకు; 7-00 తె. వా; 7-15 ప్రసిద్ధ నృసింహక్షేత్ర: ధర్మపురి; (హిందీ ప్రసంగం; 7-30 హై. బి. వలె; 8-00 వి. రిలే; 8-30 ఖయాల్; 8-50 ఈరోజు పార్లమెంట్; 8-55 ప్రస్తుతాంశం; 9-00 ఆం. వా; 9-15 ఉ. వా; 9-30 ఢి. రిలే; 9-45 రూపకం (ఉర్దూ): 10-15 ఖయాల్; 10-30 ఆం. వా; 10-35 సమాప్తి - జనగణమన.

హైద్రాబాద్ - బి

కడప

252.1 మీ (1190 కిలోసై)

విశాఖపట్నం

322.6 మీ (930 కిలోసై)
సాయంత్రం 6-00 నుండి రాత్రి 9-30 వరకు

39.42 మీ (3355 కిలోసై)
(హైదరాబాద్ మాత్రమే)

ఉదయం: 6-30 హై. ఏ. వలె; 7-45 సమాప్తి.

49.02 మీ (6120 కిలోసై.)

8-00 హై. ఏ. వలె; 9-00 సమాప్తి.

42.02 మీ (7140 కిలోసై)

మధ్యాహ్నం: 12-30 హై. ఏ. వలె; 2-00 సి. సుందరమ్మ; 2-30 సమాప్తి.

సాయంత్రం: 6-00 హై. ఏ. వలె; 6-20 గ్రామస్థుల రేడియోగోష్ఠి: 7-00 తె. వా; 7-15 గ్రామస్థులకు; 7-30 వాద్యగోష్ఠి; 8 00 హై. ఏ. వలె; 8-30 వి. జయమణి; 8-50 హై. ఏ. వలె; 9-15 ఆంగ్లమున; 9-20 విరామసంగీతం; 9-30 హై. ఏ. వలె. 9-40 టి. వి. విశ్వనాథన్; 10-30 హై. ఏ. వలె. 10-35 సమాప్తి - జనగణమన.

మద్రాస్ - బి

211.3 మీ (1420 కిలోసై)
60.98 మీ (4920 కిలోసై)

ఉదయం: 6-40 ఆం. వా; 6-45 మంగళగానం 7-00 తె. వా; 7-15 వాద్యగోష్ఠి; 7-30 మ. ఏ. వలె; 8-00 ఆం. వా; 8-15 సమాప్తి.

మధ్యాహ్నం: 12-00 కార్మికుల కార్యక్రమం 12-30 సమాప్తి.

1-00 కదంబం; 1-30 ఆం. వా 1-40 గీతమంజరి; 1-50 తె. వా 2-00 సమాప్తి.

సాయంత్రం: 5-30 పాశ్చాత్య సంగీతం; 6-00 ఆం. వా; 6-05 మ. ఏ. వలె; 6-20 వాతావరణసూచన, స్థానిక ప్రకటనలు, వాణిజ్య వార్తలు; (ఆంగ్లం). 6-30 కార్యక్రమ వివరణ (తమిళం): 6-35 నాటిక (తమిళం); 6-50 కదంబం; 7-00 తె. వా; 7-15 చిత్రగానం; 7-30 ఎస్. సరస్వతి; 7-40 ద్రవ్యోల్బణము - ధరల స్థిరీకరణ: డి ఎస్. శాస్త్రి ప్రసంగం; 8-00 తల్లీ - కొడుకు (నాటిక); 8-30 ఎస్. సరస్వతి; 8-50 ఈరోజు పార్లమెంట్: 8-55 ప్రస్తుతాంశం; 9-00 ఆం. వా; 9-15 ఆంగ్లమున; 9-30 ఢి రిలే; 9-45 పాశ్చాత్యసంగీతం; 10-35 సమాప్తి - జనగణమన.

అంగలూరు

కృష్ణాజిల్లా అంగలూరులో వడ్రంగి, కమ్మర పనివారల సహాయ కేంద్రానికి పార్లమెంటు సభ్యులు శ్రీ మాగంటి అంకినీడు గారు ప్రారంభోత్సవం జరిపారు. బహిరంగ సభకు మోటూరు పంచాయితీ సమితి అధ్యక్షులు శ్రీ ఘంట కృష్ణమూర్తిగారు అధ్యక్షత వహించారు. శ్రీ అంకినీడు, శ్రీ దుగ్గిరాల త్రివిక్రమరావు. శ్రీరామకృష్ణయ్యగార్లు ప్రసంగించారు. సభకు అధ్యంతాల్లో శ్రీ కొడాలి ఉమామహేశ్వరరావు జాతీయ గేయాలాపన చేశారు. తొలుత పెద్ద ఊరేగింపు జరిగింది.

కాలానుగుణంగా సర్వీసు నిబంధనలు

మందసా వుద్యోగులసభ డిమాండు

మందసా, ఏప్రిల్ 26

శ్రీకాకుళంజిల్లా మందసా సమితి యన్. జి. ఓ. లు, ఉపాధ్యాయులు, 4 వ తరగతి ఉద్యోగస్తులు మందసాలోవు వీధులలో 19న నిరసన ప్రదర్శన, ఊరేగింపు చేశారు. ఊరేగింపును జిల్లా ఉపాధ్యాయసంఘ కార్యదర్శి శ్రీ యం. బాలకృష్ణయ్య, యన్. జి. ఓ. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీ సత్తిరాజు, శ్రీనాలగంగాధర్, ఉపాధ్యాయ సమితి సంఘ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీ పురుషోత్తం, శ్రీమాధవయ్యగారలు నాయకత్వం వహించారు.

ప్రదర్శన తరువాత జరిగిన సభకు మండల కాంగ్రెసు ప్రెసిడెంటు, స్థానిక పంచాయతీ బోర్డు అధ్యక్షులు శ్రీ వడ్డి విశ్వనాథం అధ్యక్షత వహించారు.

"ఆకలితో అలమటిస్తున్న చిన్న ఉద్యోగస్తులకు కనీసం పదిరూపాయలు కరువుభత్యం పెంచేది లేదంటున్నది ప్రభుత్వం. పోనీ ధరలనైనా అదుపులోపెట్టి చౌకడిపోలద్వారా అవసర వస్తువులు సప్లయిచేస్తే బాగుండేది. ఇది చేయుటలేదు. ఇందువలన ప్రభుత్వమున కెంత నష్టమో గుర్తించుటలేదు. పెద్ద పెద్ద ఉద్యోగస్తుల జీతాలు పెంచేకన్నా, చిన్న ఉద్యోగస్తులకు సౌకర్యం కలిగిస్తే చాల మంచిది. ఈ విషయంలో ప్రజాప్రతినిధులంతా పెద్దయెత్తున అసెంబ్లీలో వత్తిడితెచ్చినా జరుగునేమో? అది వారు చేయరు. కనుక రాష్ట్రం మొత్తంమీద అన్ని సంఘాలు కలిసి కనీసకోర్కెలు సాధించేవరకు మీరు శాంతియుతమైన ఆందోళన చేస్తేనేతప్ప నెరవేరదు. మీ ఆందోళన జయప్రదమగుటకు మీ సంఘమునకు పటిష్టతను చేకూర్చండ"ని అధ్యక్షులు ప్రసంగించారు.

శ్రీ టి. అప్పలస్వామి, ఉపాధ్యాయ ప్రతినిధులు శ్రీ కె. పురుషోత్తం, శ్రీజి. రాములు, బాలకృష్ణమ్మ, శ్రీ కామేశ్వరరావుగార్లు కూడా ప్రసంగించారు.

(1) పది రూపాయలు కరువుభత్యము పెంచాలని, (2) ధరలను అదుపులోపెట్టాలని, (3) హైకోర్టు జడ్జి అధ్యక్షతను ఒక ఉన్నతాధికార వేతనసంఘం నియమించాలని తీర్మానించారు.

ఈ సంఘం పరిశీలించవలసిన విషయాలు: అభ్యుదయకరమైన వేతన వ్యవస్థను రూపొందించి, ఉద్యోగుల జీతభత్యాలను నిర్ణయించాలి. 1959 నుంచి ప్రభుత్వం యిచ్చిన కరువుభత్యాన్ని ధరల పెరుగుదలతో పోల్చి ఉద్యోగులకు న్యాయంగా రావలసిన కరువు భత్యాన్ని నిర్ణయించాలి. ఈ విషయంలో పే కమిషన్ తాత్కాలిక సహాయాన్ని ప్రకటించాలి. నేటి రాజ్యాంగానికి, సాంఘిక వ్యవస్థకు అనుగుణంగా ఉద్యోగుల సర్వీసు నిబంధనలను మార్చటం, పరిపాలనలోని పరిపాలనా పద్ధతులను నేటి వ్యవస్థకు అనుగుణంగా మార్పు చేయాలి. ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయులకు భద్రత చేకూర్చడం మొదలగు అంశాలన్నింటిపై క్రోడీకరించి, కొత్త సర్వీసు రూల్సును తయారు చేయాలి.

పాయకరావుపేట

పాయకరావుపేటలో 18వ తేదీనఉద్యోగుల, ఉపాధ్యాయుల "ప్రదర్శన దినోత్సవం" జరిగింది. నూరుమందితో వూరేగింపు, తర్వాత బహిరంగసభ జరిగింది. శ్రీ చిక్కాల రామారావు (సమితి అధ్యక్షులు), శ్రీపి. యల్. నరసింగరావు గార్లు ప్రసంగించారు. ఉద్యోగుల కోరికలపై సభ తీర్మానాలు చేసింది.

సీలేరు

ఎగువసీలేరుఎన్. జి.వోలసంఘం నాల్గవతరగతి ఉద్యోగుల సంఘం ఉపాధ్యాయుల సంఘం వారు 18 వ తేదీని సీలేరు హైస్కూలులో శ్రీ ఎం. ఎస్. రామారావు అధ్యక్షతను సమావేశ మయ్యారు. ఎస్. జి. వోల సంఘ కార్యదర్శి నాల్గవ తరగతి శ్రీ పై. ఎస్. ప్రభాకరరావు, ఉద్యోగుల సంఘాధ్యక్షుడు శ్రీ జి. సన్యాశి, బలిమెలదాం నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ కార్యదర్శి, శ్రీ ఎం. లక్ష్మీనారాయణగార్లు మాట్లాడారు. ధరలను అదుపులో పెట్టమనీ, అధిక ధరలను బట్టి ఉద్యోగుల జీత భత్యములు పెంచమనీ, సర్వీసు రూల్సు మార్చవలసినదనీ, హైకోర్టు జడ్జి అధ్యక్షతను ఉన్నతాధికార సంఘాన్ని నియమించాలనీ తీర్మానించారు.

కర్నూలు

ధరలను కంట్రోలు చెయ్యాలనీ, తాత్కాలిక కరువుభత్యం 10 రూ. లు నివ్వాలనీ, మొదలయిన కోరికలతో కర్నూలులో ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులు, నాలుగో తరగతి ఉద్యోగులు ప్రదర్శనము, బహిరంగసభ జరిపారు. సభలో 5 వేల మంది పాల్గొన్నారు.

మధిర

18 వ తేదీన మధిరలో 250 మంది వివిధ తరగతుల ఉద్యోగులు తాత్కాలిక కరువుభత్యం 10 రూ లివ్వాలనీ, తదితర కోర్కెలతో ఊరేగింపు, బహిరంగసభ జరిపారు.

పాలకొండ

పాలకొండలో ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులు ప్రదర్శన దినోత్సవాని జయప్రదంగా జరుపుకొన్నారు.

అవనిగడ్డ

వేతన సంఘాన్ని నియమించాలని, ధరలను అదుపులో పెట్టాలని, పదిరూపాయలు తాత్కాలికముగా కరువుభత్యము పెంచాలని కోరుతూ స్థానిక నాన్‌గెజెటెడ్ ఉద్యోగులు ఉపాధ్యాయులు, 4 వ తరగతి ఉద్యోగులు 18 వ తేదీన అవనిగడ్డలో బ్రహ్మాండమైనసభ జరిపారు.

సభా కార్యక్రమంకుముందు స్థానిక తాలూకా ఆఫీసునుంచి ఊరేగింపుచేసి, మీటింగు జరిగే పబ్లిక్‌పార్కువద్దకు ఊరేగింపుతో వచ్చారు.

సభకు శ్రీ కె. సుబ్బారావు అధ్యక్షతవహించారు.

మైలవరం

మైలవరం పబ్లిక్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన మైలవరం బ్లాకు ఏరియాలోని ఎన్. జి. ఓ.లు ఉపాధ్యాయులు నాల్గవ తరగతి ఉద్యోగులు 180 మంది 18వ తేదీన ప్రదర్శన జరిపారు. సాయంత్రం 5½ గంటలకు ఊరేగింపు ప్రారంభమై ప్రధాన వీధుల గుండా సాగింది. రాత్రి 7½ గంటలకు పబ్లిక్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు శ్రీ జి. వీరభద్రరావు అధ్యక్షతన బహిరంగసభ జరిగింది.

సభానంతరం మైలవరం బాలభారతి విద్యార్థి దళంవారిచే "మహాభారత వీరకర్ణ" బుఱ్ఱకథ చెప్పబడింది.

రాయచోటి

18 వ తేదీన రాయచోటిలో నాన్‌గెజెటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నాల్గవ తరగతి ఉద్యోగులు దాదాపు 100 మంది తమ కోర్కెలను వివరించు అట్టలను చేత ధరించి ముఖ్యవీధులగుండా శాంతియుతముగా ప్రదర్శనలు జరిపారు శ్రీ కే. రావయ్య ప్రదర్శనలకు నాయకత్వము వహించారు.

ప్రదర్శనానంతరము ఉద్యోగస్థు లందరు నేతాజీ క్లబ్బులో సమావేశమైనారు. సభకు జిల్లాఉపాధ్యాయసంఘ ఉపాధ్యక్షులైన శ్రీ యస్. సుబ్బారావు అధ్యక్షత వహించారు.

దుబారా తగ్గిస్తే జీతాలు పెంచవచ్చు

వినుకొండ సభలో శ్రీ శివయ్య ప్రసంగం

వినుకొండ, ఏప్రిల్ 19

18 వ తేదీన కాలనీవద్ద నుండి సుమారు 180 మంది ఉద్యోగుల ఊరేగింపు జరిగి ఆఫీసర్సు క్లబ్బువద్ద మీటింగు జరిగినది. సభకు శ్రీ కంచెర్ల ఆదిశేషయ్య (సమితి అధ్యక్షులు) అధ్యక్షత వహించారు. శాసనసభ్యులు శ్రీ పి. వి. శివయ్య మాట్లాడుతూ, ఇదివరలో జరిపిన ఆందోళనలకు యిప్పటిదానికి భేదమున్నదన్నారు. ఇప్పుడు దేశవ్యాపితంగా రైతులు, కూలీలు ఆందోళన జరుపుతున్నారన్నారు. జీతాలు పెంచుటకు డబ్బు లేదనుట సరికాదనియు, పబ్లిక్ ఎకౌంట్సు కమిటీ నివేదికలో వెల్లడయిన దుబారాను అరికడితే జీతాలు పెంచుటకు సరిపడునని స్పష్టముగావివరించారు. ప్రభుత్వం ఎన్ని కమిటీలు వేసినా అసమానతలు కోర్కెలు పెరిగినవేగాని తగ్గలేదన్నారు. బ్యాంకులు, మిల్లులు, ప్రధాన పరిశ్రమలు జాతీయం చెయ్యాలన్నారు. ధరలు, నిలవలు కంట్రోలు చెయ్యాలన్నారు. ఉద్యోగులు పాత బ్రిటిష్ కాలంనాటి మనస్తత్వానికి స్వస్తిచెప్పాలని, ప్రస్తుత కాలానుగుణ్యంగా మనస్సులు మార్చుకోవాలనీ అన్నారు. అప్పుడే యీ సమస్యలు పరిష్కారమార్గంలో పడతాయన్నారు.

మేడే సన్నాహాలు

గుంటూరు, ఏప్రిల్ 25

1964 వ సంవత్సరం మేడే జరుపుటకు గుంటూరు పట్టణంలోనున్న అన్ని కార్మిక వర్గాల సభ్యుల సంయుక్త సమావేశం శాసనసభ్యులు శ్రీ కనపర్తి నాగయ్యగారి అధ్యక్షతన జరిగింది. మేడే జయప్రదం చేయుటకు కార్యక్రమం తీసుకొన్నారు.

అనంతపురంజిల్లా టీచర్ల సమస్యలు

జిల్లా పరిషత్ కార్యదర్శివద్దకు శ్రీ విజయరామరాజు రాయబారం

అనంతపురం, ఏప్రిల్ 26

'ఉపాధ్యాయ' పత్రిక ప్రధాన సంపాదకులు పట్టభ రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గంనుండి పోటీచేస్తున్న అభ్యర్థి శ్రీ వి.విజయరామరాజుగారు అనంతపురం జిల్లా పర్యటనలో అయాహైస్కూల్ టీచర్లను కలుసుకున్నపుడు కొన్నిసమస్యలు ఆయనదృష్టికివచ్చినవి. అందు పైవారు ఏప్రిల్ 18 వ తేదీన జిల్లాపరిషత్ డిప్యూటీకార్యదర్శిని కలుసుకుని ఈ సమస్యలను నివేదించారు ఆయన సావధానంగా విని క్రింది సమాధానా లిచ్చారు.

"స్కూలు అలవెన్సు నిచ్చుటకు ఉత్తర్వులను పాస్‌చేశాము. అందుకు సంబంధించిన అరియర్సు నిచ్చుటకు స్టాండింగ్ కమిటీకో పెట్టినారు ఆమోదించిన వెంటనే పంపిస్తాము.

హిందీ టీచర్లకు 10 రూపాయలు అలవెన్సు నిచ్చే పాఠశాలలున్న విషయం యధార్థమే. అయితే, సీనియారిటీ ననుసరించి ఎక్కువ సర్వీసుగల హిందీ టీచర్లకే ఈ అలవెన్సు నివ్వటం సాధ్యం. కాని అట్టి టీచర్లు అలవెన్సు అర్హతగల హైస్కూళ్ళకు వెళ్ళడానికి సిద్ధంగా లేనందున అలవెన్సు యిచ్చే పరిస్థితి ఏర్పడలేదు.

యం. ఏ. పాసైన టీచర్లకు హయ్యర్ సెకండరీ పాఠశాలల్లో అలవెన్సు నిచ్చువిషయం రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్‌వారి అంగీకారానికి వ్రాసి యున్నాము. రాగానే తప్పక యిస్తాము. అలాగే 15 సంవత్సరాలు సర్వీసుగల గ్రేడు II పండిట్ మున్షీలకు గ్రేడు I స్కేలుకు ప్రమోషన్ యివ్వడం న్యాయమే. ఈ విషయంలో బి. యి. ఓ. మమ్మల్ని రిమార్కులు కోరియున్నారు. వెంటనే పంపిస్తాము. ఆర్. డి. డి. పి. ఐ. ఆమోదం రాగానే వారికి ప్రమోషన్ యిచ్చి ఆ గ్రేడు స్కేలు తప్పక యిస్తాము."

ప్రావిడెంటు ఫండు అడ్మిషన్ దరఖాస్తులు త్రిప్పి పంపుతున్న విషయం జనరల్ సెక్షన్‌లో విచారించగా క్రిందివిధంగా చెప్పారు:

"ఉపాధ్యాయులకు ప్రావిడెంటు ఫండు విషయమై సమితి-పరిషత్ ఆక్టులోలేదు. ఆ విషయమై మేము వివరణకు వ్రాస్తే త్వరలోనే పంపిస్తామని-అంతవరకు పి. ఏ. దరఖాస్తులను తీసుకోవద్దని పైనుండి ఉత్తర్వులు వచ్చాయి.

దీనిపై శ్రీ విజయరామరాజుగారు ఒక ప్రకటనచేస్తూ, "సమితి-పరిషత్ ఆక్టులో లేని విషయాలకు పూర్వపు జిల్లాబోర్డు రూల్సులను పాటించాలని, స్పష్టమైన ప్రభుత్వ ఆదేశాలు వుండగా, తిరిగి జిల్లా పరిషత్‌వారు ఎందుకు వివరణకై వ్రాయవలసివచ్చిందో అర్థంకాకుండా వుంది. ఆంధ్రప్రదేశ్‌లో యే జిల్లా పరిషత్‌లో కూడా ఈలాంటి సంఘటన జరుగలేదు. ఆలస్యం జరిగేకొద్దీ టీచర్లు కట్టవలసిన మొత్తం పెరిగిపోయి. అడ్మిషన్ వచ్చిన తర్వాత, మొత్తమంతా ఒకే పర్యాయంకాని-దఫాలు వారీగాని కట్టుటకు చాల బాధపడవలసివస్తుంది. కాన ప్రభుత్వం వెంటనే తగు ఉత్తర్వులనివ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాను."అని తెలిపారు.

భీమాఉద్యోగులసభ

విశాఖపట్నం, ఏప్రిల్ 25

దేశవ్యాపితంగా బ్యాంకు వుద్యోగులు, జీవిత భీమా వుద్యోగులు సంయుక్తంగా యిటీవల జరిపిన కోర్కెలదినం సందర్భంగా యిక్కడి జీవితభీమా వుద్యోగులు గురుడ జగన్నాథస్వామి ఆలయంలో సభ జరిపారు. పట్టణంలోని ప్రముఖ కార్మికనాయకులు శ్రీయుతులు యం. వి. భద్రం, బుచ్చిరాజు శ్రీశైల మల్లికార్జునరావు గారలు ఆ సభలో ప్రసంగించారు. (వి. వి.)

ఆంధ్రవిశ్వవిద్యాలయ ఉద్యోగుల కరువు భత్యం పెంపుదల

విశాఖపట్నం, ఏప్రిల్ 26

ఆంధ్రవిశ్వవిద్యాలయోద్యోగుల సంఘం పక్షం రోజులక్రితం సమావేశమై తమ కనీస కోర్కెలను కొన్నిటిని రూపొందించి విశ్వవిద్యాలయాధికారులకు నివేదించింది. రాష్ట్రప్రభుత్వ వుద్యోగులకు ఈమధ్య పెంచినట్లుగా తమకు కూడ కరువుభత్యాన్ని పెంచాలన్నది వాటిలో ఒకటి. ఈ నెల 1 వ తేదీలగాయితూ రు 150 లోపు జీతంతీసుకొనేవారికి అదనంగా రూ 5 లు, అటుపై వారికి రూ 6 లు చొప్పున కరువుభత్యం పెంపుదలను మంజూరు చేస్తూ విశ్వవిద్యాలయాధికారులు ఈ మధ్యనే ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ కోర్కె సాధించబడింది. ఈ విజయ వాతావరణంలో 19 న సాయంత్రం ఇంద్రద్యుమ్న మంటపంలో ఆంధ్ర యూనివర్సిటీ ఎంప్లాయీస్ యూనియన్ వార్షిక సర్వసభ్య సమావేశం సంఘాధ్యక్షులు శ్రీ యం. వి. భద్రంగారి అధ్యక్షతను జరిగింది. అధ్యక్షులు తమ ప్రసంగంలో ఈ విజయం మిగతా కోర్కెల సాధనకు ఆత్మవిశ్వాసం ప్రసాదించి సోపానంకావాలనీ, సంఘంలో ఉద్యోగులంతా సంఘటితం కావటం ద్వారా మిగతా కోర్కెల్నికూడా సాధించుకోవలెననీ ఉద్బోధించారు. సంఘ కార్యదర్శి శ్రీ వై. బ్రహ్మలింగస్వామిగారు 1963-64 కార్యకలాపాల నివేదిక నిచ్చారు. కోశాధికారి శ్రీ తమ్మరాజుగారు ఖర్చు వెచ్చాలను తెలిపారు.

1964-65 సంవత్సరానికి శ్రీ యం. వి. భద్రంగారిని అధ్యక్షులుగానూ; శ్రీ పి. రామచంద్రరావుగారిని ఉపాధ్యక్షులుగానూ; శ్రీ వై. బ్రహ్మలింగస్వామిగారిని కార్యదర్శిగాను; శ్రీ ఎస్.వి. సూర్యనారాయణగారిని సహాయకార్యదర్శిగానూ; శ్రీ వి. వి. సుబ్బారావుగారిని కోశాధికారిగానూ; మరొక 15 మంది కార్యవర్గ సభ్యులుగానూ ఎన్నుకొన్నారు.

విశ్వవిద్యాలయ వుపాధ్యాయులు సిబ్బంది సమస్యల పరిష్కారం నిమిత్తం యేర్పరుస్తా మన్న స్టాఫ్ కౌన్సిల్‌ను త్వరితంగా నిర్మాణం చేయుమనికోరుతూ ఒక తీర్మానమూ; విశ్వవిద్యాలయం కార్యనిర్వాహణా అధికారులుగా ఒకరొకరుగా ప్రభుత్వ అధికారులను దించే ప్రవాహాన్ని ఆపి, అనుభవజ్ఞు లయిన యూనివర్సిటీ కార్యనిర్వాహక సిబ్బంది నుండి ప్రమోట్ చేయడం ద్వారా ప్రోత్సాహం కలిగించమనికోరుతూ వేరొక తీర్మానమూ; ఆఫీసుపనివేళల మార్పుపైనా గత సమావేశ కోర్కెలను గుర్తుచేస్తూ మరొక తీర్మానమూ ఆమోదించబడినవి. (వి. వి.)

ఇలపర్రులో పశువుల జప్తు

ఇలపర్రు, ఏప్రిల్ 22

తణుకు తాలూకా యిలపర్రు గ్రామంలో ఏప్రిల్ 22 న తణుకు స్పెషలు తహసీల్దారు కొందరు రైతులకు డిమాండు నోటీసులు ఇచ్చి వెంటనే పన్ను కట్టవలసిందిగా కోరారు. ఒక రోజు వ్యవధి యిమ్మని అడిగినా వినకుండా తణుకు స్పెషలు తహసీల్దారు, రెవిన్యూ ఇన్స్పెక్టరు, మునసబు, కరణం, నౌకర్లను తీసుకొని పొలంలోకివెళ్ళి శ్రీ దారపురెడ్డి వెంకట సత్యనారాయణగారి పాడిపశువులు, 3 గేదెలను ఒక ఆవును జప్తు చేశారు.

విశాఖపట్నంలో ప్రభుత్వోద్యోగుల ప్రదర్శన

విశాఖపట్నం, ఏప్రిల్ 26

రాష్ట్రవ్యాపితంగా రాష్ట్ర ప్రభుత్వ వుద్యోగుల, నాల్గవ తరగతి ఉద్యోగుల, ఉపాధ్యాయుల సంఘాల సంయుక్త ఆధ్వర్యాన 18 వ తేదీన జరిగిన 'కోర్కెల ప్రదర్శన' సందర్భంగా విశాఖ పట్నంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద బయలుదేరి, మెయిన్‌రోడ్ వెంట గురుడ జగన్నాథస్వామి ఆలయం వరకు బ్రహ్మాండమైన వూరేగింపు జరిగింది. దాదాపు పట్నంలోని మున్సిపల్ వుపాధ్యాయులు వుపాధ్యాయినులంతా హాజరైనారు. ఆస్పత్రి పనివారలుకూడా యీ ప్రదర్శనలో పాల్గొన్నారు. వూరేగింపులో గణించదగ్గంతమంది స్త్రీలే కావడం మరొక విశేషం.

ఊరేగింపు అనంతరం ఆలయంలో జరిగిన సభ వుద్యోగులతో కిట కిట లాడిపోయింది. జిల్లా యన్. జి. ఓ. ల అధ్యక్షులు శ్రీ మూలవీసాల జగన్నాథరావుగారు అధ్యక్షతవహించిన యీ సభలో అనకాపల్లి శాసనసభ్యులు శ్రీ కోడుగంటి గోవిందరావుగారు ప్రభుత్వ అవకతవక విధానాలను నిశితంగా విమర్శించారు. వుద్యోగుల కోర్కెల సామంజస్యాన్ని తెలిపారు. (వి. వి)

హైద్రాబాదులో సోవియట్ ఫిల్ము ప్రదర్శనలు

హైద్రాబాద్, ఏప్రిల్ 22

ఆంధ్రప్రదేశ్ భారత - సోవియట్ సాంస్కృతిక సంఘం తరఫున హైద్రాబాదు నగరంలో ఏప్రియల్ 12 నుండి 15 వరకు సోవియట్ చిత్రాలు ప్రదర్శింపబడ్డాయి. అమీర్‌పేట, చిక్కడపల్లి, సికిందరాబాదులోని మెట్టుగూడాలో సన్నాహక కమిటీలు ఏర్పడి, ప్రదర్శనలను ఎంతో దిగ్విజయంగా నిర్వహించాయి. అత్యధిక సంఖ్యలో ప్రజలు విచ్చేసి, సోవియట్ శాస్త్ర, మైత్రీ, తదితర చిత్రాలను చూసి ఆనందించారు. ఈ ప్రదర్శనలు బొంబాయినుండి వచ్చిన ప్రత్యేక ఫిలిం వ్యాన్ పర్యటన సందర్భంగా ఏర్పరచబడినవి. పై మూడు కార్యక్రమాల్లో దాదాపు నాలుగు వేలమంది ఈచిత్రాలను చూశారు.

సంతనూతలపాడు బ్లాకు ఉపాధ్యాయ సభ

సంతనూతలపాడు, ఏప్రిల్ 26

ఒంగోలు తాలూకా, మైనంపాడు గ్రామంలో ఇటీవల సంతనూతలపాడు బ్లాకు ప్రాథమికోపాధ్యాయ తృతీయ మహాసభ జరిగింది. 45 మంది ఉపాధ్యాయ ప్రతినిధులు వివిధ గ్రామాలనుండి హాజరయ్యారు. మహాసభలో ఈ క్రింది కార్యవర్గము ఎన్నుకోబడింది. అధ్యక్షుడు శ్రీ ఎన్. వి. శేషయ్య, కార్యదర్శి శ్రీ పి. సామ్యూలు సంయుక్తకార్యదర్శి శ్రీ ఎస్. కోటయ్య; ఉపాధ్యక్షుడు శ్రీ వి. వెంకటేశ్వర్లు మరో ఐదుమంది సభ్యులు.

కరువుభత్యం రు 10-00 లు పెంచాలనీ వుపాధ్యాయ నియోజక వర్గములను రద్దుచేయరాదనీ, వుపాధ్యాయ నివదవీ విరమణ వయస్సు 60 సంవత్సరములకు పెంచాలనీ, టీచరు విద్యార్థి నిష్పత్తి తగ్గించాలనీ, సమితుల్లోనూ, జిల్లా పరిషత్తుల్లోనూ ప్రాథమికోపాధ్యాయులకు ప్రాతినిధ్యం వుండాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులకు డ్యూటీ అలవెన్సులు యివ్వాలనీ, 5 వ తరగతి రికార్డు షీటుమీద హైస్కూలులో ప్రవేశించుటకు అనుమతి యిచ్చినందుకు ప్రభుత్వమును అభినందించుతూను కొన్ని తీర్మానాల నామోదించారు.

తాడేపల్లి రైల్వే ముఠా వర్కర్సు యూనియన్

మంగళగిరి, ఏప్రిల్ 20

తాడేపల్లి రైల్వే ముఠా వర్కర్సు యూనియన్ సభ ఏప్రిల్ 19 వ తేదీ శ్రీ మేకా అమరారెడ్డిగారి అధ్యక్షతను జరిగింది. ఈ సభలో కమ్యూనిస్టు నాయకులు నియోజకవర్గ శాసనసభ్యులైన శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ, మంగళగిరి బ్లాక్ కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ నాగళ్ళ రామకృష్ణయ్య, కృష్ణాసిమెంటు వర్కర్స్ యూనియన్ కార్యదర్శి శ్రీ పాగోలు నారాయణ, బ్లాక్ ట్రేడ్‌యూనియన్ కార్యదర్శి శ్రీ ఏ. శివరామకృష్ణయ్య, రైల్వే ముఠా వర్కర్సు యూనియన్ శ్రీ యల్. కనకయ్యగార్లు ఈ నాడు కార్మికుల నెదుర్కొంటున్న సమస్యలను గురించి వాటి పరిష్కారానికి దేశవ్యాపితంగా అఖిలభారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ జరుపుతున్న పోరాటాలను గురించి మాట్లాడారు.

తరువాత రైల్వే ముఠా వర్కర్సు యూనియన్ కార్యనిర్వాహక వర్గాన్ని ఎన్నుకున్నారు.

సభలు - సమావేశాలు

తూర్పుగోదావరిజిల్లా రజక సంఘ కార్యవర్గం మే 3 వ తేదీన గొల్లప్రోలులో జరుగుతుంది.

* * *

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం శ్రీ ఫక్రుద్దీన్‌షా పాఠశాల పాత విద్యార్థి వార్షికోత్సవం మే 1 వ తేదీన జరుగుతుంది. డా॥ సి. నారాయణరెడ్డి "కవితాత్మ" అనే విషయంపై మాట్లాడుతారు. శ్రీ పైడి లక్ష్మయ్యగారు అధ్యక్షత వహిస్తారు.

* * *

ఆంధ్ర ప్రదేశ్ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ యూనియన్ 4 వ వార్షిక మహాసభలు భీమవరంలో మే నెల 4 వ తేదీ నుండి 7 వ తేదీ వరకు జరుగుతాయి. పురపాలక సంఘాల మంత్రి శ్రీ ఆలపాటి వెంకటరామయ్యగారు మహాసభను ప్రారంభిస్తారు.



మెయిళ్లు

ధాన్యపు తూకంలో వ్యాపారులు మిల్లర్లుచేస్తున్న అక్రమాలు

ఆర్యా,

ఆంధ్ర ప్రదేశ్‌లోని ధాన్యం మిల్లర్లు, ధాన్యం వ్యాపారులు ధాన్యపు తూకములు తూచుకొనుటలో, రైతులను విపరీతముగా నష్టపుచ్చు చున్నారు. ఈ నెల 17 వ తేదీన విజయవాడలో ధాన్యం ఉత్పత్తిదార్లు, మిల్లర్ల సమావేశము జరుగునని దినపత్రికలలో ప్రకటించారు. అసలు యీ సమావేశము కేవలం మిల్లర్లకే గాని రైతులకు సంబంధించినదిగా అగుపడలేదు. ఈ సమావేశంలో రైతును మిల్లర్లు నష్టపచ్చుచున్న విషయాలే లేకపోవుటవల్ల యిది ఎంతవరకు రైతు కష్టసుఖములు విచారించిన సమావేశమో అర్థమగుట లేదు. 1962 వ సంవత్సరములో అదనపు తూకములు మిల్లర్లు తూచుకొనుచూ రైతులను నష్టపుచ్చుచున్నారని గుడివాడ సమావేశములో మాట్లాడిన శ్రీ వడ్డే శోభనాద్రి చౌదరి కూడ కనీసము యీ అక్రమపు తూకములు గురించి మాట్లాడక పోవుట, రైతులమైన మాకు చాల విచారకరముగా యున్నది. రైతు నాయకులైన శ్రీ వడ్డే శోభనాద్రిగారు రైతులకు, మిల్లర్లకు అవినాభావ సంబంధము ఉండాలని చెప్పియున్నారు. ఒక ప్రక్క రైతును అదనపు తూకములతో మోసగిస్తున్న యీ దగారులను ఏ రైతు అయినా ఎట్టి పరిస్థితులలోనైనా నమ్ముటకు సాధ్యపడునా? మిల్లర్లు రైతు దగ్గర ధాన్యం కొనునపుడు అదనపు తూకము కావాలంటున్నారు. అదే ధాన్యము బియ్యముగా తయారుచేసి అమ్మునపుడు తక్కువ తూకములో అమ్ముచున్నారు.

సావకాశము వచ్చినప్పుడు యావత్తు పన్నులు ఎగవేయుటకు రెండు రకముల దొంగ లెక్కలు తయారుచేసి పన్ను ఎగవేయుటకు సంకోచించరు గదా? యిట్టి వారిపై ప్రభుత్వమునకు మాత్రము ఏల విశ్వాస ముండును? మిల్లులోవుండే వారి గుమాస్తాలుకూడా వారిని బలపరచు స్థితిలోలేరు. ఏల ననగా రోజుకు ఎనిమిది గంటలు మించి అదనముగా పనిచేయు చున్నారని బోనసులు యివ్వకనే యిచ్చినట్లు వ్రాయించి సంతకములు పెట్టించుకొను చున్నారనే కారణముతో గుమాస్తాలుకూడ వీరిని సమర్థించరు. ఇంకా ఎవరు వీరిని సమర్థించేది? నూటికి ఒక్కరిద్దరు రైతువ్యాపారులు మాత్రమే - ఆ ఒక్కరిద్దరయినా మిల్లులలో భాగములు వున్నప్పుడు మాత్రమే - బలపరుచు చున్నారు. కాన మిల్లర్లను సమర్థించే వారు లేకుండుటకు కారణము వారియొక్క స్వలాభాపేక్షతో కూడిన నిరంకుశ విధానమే.

ప్రభుత్వమువారు లోగడ బస్తా అనగా 75 కిలోగ్రాములు తూకం సమానమనిన్నీ, రైతుల వద్ద ధర్మములు వసూలు చేయకూడదని ప్రకటించినప్పటికి మిల్లర్లు ఆ ప్రకటనలను లెక్కచేయకుండా వారి విధానము మామూలుగా సాగించుచునే యున్నారు. అందుచేత మిల్లులను జాతీయము చేయవలయునని కోరుటలో తప్పు ఎంతమాత్రము కనపడదు. కాని జాతీయము చేయవలసినదిగా కోరిన రైతులను కమ్యూనిస్టులని నింద వేయుటలో యదార్థము ఏ మాత్రము లేదు. మిల్లర్లు సాగించుచున్న అదనపు తూకముల వలన ప్రతి రైతుకు విక్రయించే బస్తాకు ఒక రూపాయి చొప్పున నష్టము వచ్చుచున్నది. యకరమునకు 15 బస్తాలు పండించిన రైతుకు పై విధముగా ఎకరమునకు రూ 15 లు మిల్లర్లవల్ల నష్టము వచ్చుచున్నది. అదిగాక ప్రతి బస్తాకు ధర్మము అనే పేరుతో మూడు నయా పైసలు తక్కువ గాకుండా మిల్లర్లు వసూలు చేయుచున్నారు. ఈ పై విధములుగా ప్రతి యకరుకు రు 15-45 న. పై. మిల్లర్లు అక్రమలాభంపొందుచున్నారు.

కొత్త ధాన్యము సీజనులో ధాన్యము బస్తాకు 77 నుండి 78 కిలోగ్రాముల వరకు తూకములు తూచుకొనుచున్నారు. పైకి చెప్పుటలోగాని బిల్లులు వ్రాయుటలోగాని బస్తాకు 75 కిలోగ్రాముల చొప్పునే వ్రాయుచున్నారు. రైతుయొక్క ఆర్థిక తొందరలవల్ల మిల్లర్లయొక్క కఠినమైన షరతులకు నష్టమునకు అమ్మవలసి వచ్చుచున్నది. ధాన్యం అమ్మనిదే సామాన్య రైతుకు వేరే మార్గములు లేవు. ఈ పై విధముగా తెలుపబడిన కారణములతో మిల్లర్లు నిర్మొగమాటముగా రైతులను పీడించుచున్నారు. ఇట్టి స్వార్థపరులను ఏ రైతు సమర్థించగలడు?

అన్నే కేశవరావు,
కే. సుబ్బారెడ్డి.

శానిటరీ వర్కర్ల జీతభత్యాల జి. ఓ.

ఆర్యా,

20-7-1963 వ తేదీన జి. ఓ. నెం॥ 813 ఎం. ఎ. ప్రకారం శానిటరీ వర్కర్లకు త్వరలో రు. 26-1-40 లు స్కేలు జీతం అమలు జరుపబోతున్నట్లు అందువల్ల ప్రస్తుతం ఇస్తున్న కంపెన్‌సేటరీ అలవెన్సు రద్దుచేయబడినదంటూ తెలియజేయబడింది. ఇది 10 నెలలక్రితం జరిగింది. ఇంతవరకు రు 26-1-40 లు స్కేలు జీతం గురించిన జి. ఓ. అతీగతీలేదు. కాగా అంతవరకు ఇస్తున్న కాంపెన్‌సేటరీ అలవెన్సు మాత్రం వెంటనే ఆపుచేశారు.

హైద్రాబాద్ శానిటరీ వర్కర్లకు చెందిన బెనిఫిట్ స్కీము క్రింద ఒక్కొక్కరికి రు 1000 లు చొప్పున పంచుటకు ఏర్పాటు చేయబడిన బహిరంగసభలో ఇటీవల ముఖ్యమంత్రి మాట్లాడుతూ, శానిటరీ వర్కర్లకు రు 5/- లు కరువుభత్యం పెంపబడిందని 1-4-1964 వ తేదీ నుండి ఇది అమలుజరుగునని ప్రకటించారు.

ఈ విషయంలో రెండవ గ్రూపులో మెల్లగా చాలీ చాలని జీతములతోను, ఉద్యోగ భద్రత లేకుండా బాధ పడుతున్న శానిటరీ వర్కర్లను సంతోషదాయకము. అయితే వీటిని అమలు జరుపు నిమిత్తం జి. వోలు. అర్యు వెంటనే క్రిందికి పంపించకోస్తున్నాను.

ఇట్లు,
ఎ. గంగరాజు, అధ్యక్షుడు,
మున్సిపల్‌వర్కర్సుయూనియన్, నర్సాపురం.

స్వర్ణకారులకు సహాయం

అయ్యా,

తూర్పుగోదావరి జిల్లాలో స్వర్ణకారులకు 1963 వ సంవత్సరానికి కేటాయించిన సొమ్ము కట్టుమిషనులు, ఇంతవరకు పూర్తిగా 64 వ సంవత్సరం ప్రవేశించి 4 నెలలు అయినను ఇప్పటి జరుగలేదు. మొదటి సెలక్షన్‌లోనైనను, సరియైన దర్ఖాస్తు దారుల ద్వారా చేయక జిల్లా కేంద్రమందే సెలక్షన్ ఆధారముపైన ఇచ్చే నిర్ణయం చేశారు. దరఖాస్తుదారు జిల్లా కేంద్రంలోని పరిషత్తు అఫీసుకుపోయి యధార్థము రుజువు పరచుట చాలా కష్టము, అందువలన తాలూకా వారిగాగాని, బ్లాకువారిగాగాని, ఆయా ఆఫీసర్లకు ఆయా బ్లాకుకు సంబంధించిన దరఖాస్తుల విచారణాధికారం యిచ్చి, యదార్థంగా స్వర్ణకార వృత్తిలో దెబ్బతిన్నవానికే, సంఘ భేదం లేక ఇప్పించవలసినదిగా కోరుచున్నాను.

గారోజు లింగమూర్తి.

సిమెంటులో దొంగవ్యాపారం

అయ్యా!

నాది పొట్టిపాడు. నేను ఏటా రూ 800 లు శిస్తు కడుతున్న ఆసామిని. పాతఇల్లును మరమ్మతులు చేయించడానికై సిమెంటు కావలసి దరఖాస్తుపెట్టాను. తేలప్రోలు రివెన్యూఇన్‌స్పెక్టరు నా దరఖాస్తులు విచారించి అంగీకరించారు. నెహ్రూ బొమ్మలు నాలుగూ, డిఫెన్సు సర్టిఫికెట్లుకొని వారి ఆదేశం చెల్లించి గన్నవరం తాశీల్దారు వద్దకు పర్మిట్ కోసం వెళ్ళేను.

ఆ తాసీల్దారు విజయవాడ కాపురం. క్యాంపులకు వెడుతుంటారు. కనుక ఆయన కోసం నేను వెళ్ళిన 10 పర్యాయాలలో రెండు మూర్లే దర్శనం లభించింది. కనిపించినప్పుడు స్టాకులేవు మళ్ళీరాండి అంటున్నారు. నేను తిరుగుతూనే వున్నాను. ఈ లోపున చాల మందికి పర్మిట్లు దొరుకుతూనే వున్నాయి. గుమాస్తాలకు లంచం ఇచ్చి సులభంగా సంపాదించగలుగుతున్నారు.

చిట్టచివరకు 1963 ఫిబ్రవరి 24 నాకు 10 బస్తాలకు పర్మిటు ఇచ్చారు. తేలప్రోలులో కోటేశ్వరరావు అనే డీలరు దగ్గరనుంచి తెచ్చుకోమన్నారు.

డీలరు ఆపర్మిటును ఖాతరుచేయలేదు. ఇంక దానిని తాశీల్దారుకు ఇచ్చాను. నేటివరకాయన రివైజ్డ్ పర్మిటు ఇవ్వనేలేదు.

కావలసినవారికి సిమెంటు ఇవ్వకుండా నీతి నియమాలులేని బ్లాక్ మార్కెటు దార్లకు ఇస్తున్నారు. వారు డీలర్లకు తాశీల్దార్ చేరోనయివుండాలి. ఎంతో శిస్తుచెల్లిస్తూ కొద్ది గొప్ప పలుకుబడిగల నానోటి వాడిని నేనే కొద్దిమొత్తం సిమ్మెంటును, ఇన్ని నెలలక్కూడా నే సంపాదించలేకపోయా నంటే సామాన్యసంసారి మాట చెప్పేదేముంది. ఈ విషయాలను పరిశీలించి, న్యాయంగా సిమెంటు కావలసినవారికది సక్రమంగా లభ్యమయ్యేటట్లు చూడగోరుతున్నాను.

పాకలపాటి వెంకటరమణారావు,
పొట్టిపాడు.

'సి' తరగతి పట్టణాల అలవెన్సులు

ఆర్యా,

కేంద్ర ప్రభుత్వము కొన్ని పట్టణముల ఉద్యోగులకు అలవెన్సులను యిచ్చుటకు ఎ. బి. మరియు 'సి' తరగతులుగా జనాభా ప్రాతిపదికపై నిర్ణయించినది. కేవలం జనాభా ప్రాతిపదిక తీసుకొనుట న్యాయములేదని జీవన వ్యయముకూడ తీసుకోవలెనని శ్రీ టి. టి. కృష్ణమాచార్యులు పార్లమెంటులో అంగీకరించినారు. ఎందుకంటే కొన్ని 'సి' తరగతి పట్టణములలో జీవన వ్యయము చాల హెచ్చుగా వున్నదని అందుకుఉదహరణ విశాఖపట్టణము, కొచ్చిన్ పట్టణములుకూడ అనిరి. ఈక్రొత్తవర్గీకరణగూర్చి ప్రయత్నములు జరుగుచున్నది తెలియదు. ఇదిఇలావుండగాకనీసం 'సి'తరగతి పట్టణములలో పనిచేయు ఉద్యోగులకు సిటీ అలవెన్సుకూడాలేదు; అంతేగాదు. ఇంటి అద్దె కూడా రూ. 156-50 జీతమువస్తే యివ్వరు. కాని ఏ. బి' పట్టణాలలో అటువంటి హద్దు లేదు. అప్పట రూ. 1000 కు పైగా వచ్చినప్పటికి అలవెన్సులు యిచ్చెదరు. ఈ అలవెన్సులు అధిక ధరలను తగ్గించటానికి పుట్టసింపబడినవి. 'సి' తరగతి పట్టణములలో కూడ జీవనవ్యయము హెచ్చుగావున్నదని ఆర్థిక మంత్రి అంగీకరించినారు. కాబట్టి యీ పట్టణములలో వుండే ఉద్యోగులకుకూడ సిటీ అలవెన్సు, ఇంటి అద్దెకు రూ. 156 - 50 హద్దు పెట్టకుండా మిగిలిన పట్టణములలో యిచ్చువిధముగా యివ్వవలెనని కోరుచున్నాను.

దక్షిణ రైల్వే మజ్దూర్‌యూనియన్
సి. హెచ్. శ్రీహరిరావు, కార్యదర్శి.

పబ్లిక్ సర్వీసు పరీక్షలు భారత రాజ్యాంగ చరిత్ర

ఆర్యా,

యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ వారిచే నిర్వహింపబడు ఐ. ఎ. యస్. పరీక్షలలో పాఠ్యాంశముగా బ్రిటీషు రాజ్యాంగ చరిత్రను చేర్చిరి. కాని భారత రాజ్యాంగ చరిత్రను పాఠ్యాంశముగా చేర్చకపోవటంలో ఆ తర్కమేమిటో అర్థంకావటంలేదు. ఇట్టి పరిస్థితులకు కారణం యింకా బ్రిటీషు మనస్తత్వం వదిలియుండ లేదనే నా ఉద్దేశం. అందుచేత, యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్‌చే నిర్వహింపబడు వివిధ పరీక్షలలో, భారతరాజ్యాంగ చరిత్ర, బ్రిటీషు రాజ్యాంగ చరిత్ర బదులుగా పాఠ్యాంశముగాచేర్చవలసినదిగా కోరుచున్నాను.

ధర్మాన నారాయణరావు

రామమోహన లైబ్రరీ స్వర్ణోత్సవ సన్నాహాలు

విజయవాడ, ఏప్రిల్ 24

స్థానిక శ్రీరామమోహన పుస్తక భాండాగారముయొక్క కార్య నిర్వాహకవర్గంవారు లైబ్రరీ స్వర్ణోత్సవం జరుపు సందర్భములో మొన్న లైబ్రరీ హాలులో పుర ప్రముఖులతో ఒక సమావేశం జరిపారు. సమావేశానికి శ్రీ కాకరపర్తి భావనారాయణశ్రేష్ఠిగారు అధ్యక్షత వహించారు. ఈ క్రిందివారి స్వర్ణోత్సవకమిటీ కార్యనిర్వాహకవర్గసభ్యులుగా ఎన్నుకొన్నారు.

అధ్యక్షులు: శ్రీ కాకరపర్తి భావనారాయణశ్రేష్ఠి: ఉపాధ్యక్షులు: శ్రీయుతులు కొడమంచి వెంకట సుబ్బయ్యచౌదరి, గుడివాడ పేర్రాజు, కూనల పూర్ణచంద్రరావు, హెచ్. టి వాసుదేవరావు, ముమ్మలపల్లి జగన్నాథంపంతులు, ఎస్. ఎం. ఏ. ఖద్దూస్. పచ్చిపులుసు వెంకట సుబ్బారావు. పోతిన జెనర్జీ; ఆర్గనైజింగ్ కార్యదర్శి: శ్రీ కొల్లూరి శ్రీరామమూర్తి. మరొక 37 మంది సభ్యులు.

పానగల్లు

నల్లగొండ తాలూకా ముదిరాజ సంఘ ప్రథమ మహాసభ 18 వ తేదీన ఇక్కడ జరిగింది. మాటూర్ బాలనర్సిమ్మ, పెదరామచంద్రయ్యగార్లు అధ్యక్ష, కార్యదర్శులుగా కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు.

వ్యవసాయ వస్తు ధరలు

విజయవాడ, ఏప్రిల్ 27

విజయవాడ రీజనల్ అసిస్టెంట్ మార్కెటింగ్ డైరెక్టర్ నేడు అందజేసిన ఉత్పత్తిదారులనుండి కొనుగోలు చేయు టోకుధరలు. (ఒక క్వింటాల్ 100 కిలోగ్రాములు, లేక 220½ పౌనులు)

ధాన్యం			
నంబర్లు:	విజయవాడ	రు. 45 34	
"	కాకినాడ	45 33	
"	చిత్తూరు	50 00	
అక్కుళ్లు:	విజయవాడ	39 67	
"	తాడేపల్లిగూడెం	39 33	
"	కాకినాడ	39 33	
"	ఆముదాలవలస	38 83	
సన్నకృష్ణకాటుకలు:	తాడేపల్లిగూడెం	41 33	
సన్నాలు:	ఆముదాలవలస	40 00	
మొలకొలుకులు:	నెల్లూరు	41 76	
మిల్లు బియ్యం			
నంబర్లు:	విజయవాడ	రు. 73 00	
"	కాకినాడ	73 00	
అక్కుళ్లు:	విజయవాడ	63 00	
"	తాడేపల్లిగూడెం	58 26	
"	కాకినాడ	62 84	
"	ఆముదాలవలస	51 57	
సన్నకృష్ణ కాటుకలు:	తాడేపల్లిగూడెం	66 89	
నంబర్లు:	చిత్తూరు	80 64	
సన్నాలు:	ఆముదాలవలస	55 33	
మొలకొలుకులు:	నెల్లూరు	89 40	
వేరుశనగ			
కాయలు	విజయవాడ	68 67	
"	నంద్యాల	78 75	
"	ఆదోని	82 12	
"	విజయనగరం	70 00	
పప్పు	విజయవాడ	102 00	
"	నంద్యాల	102 50	
"	ఆదోని	105 00	
"	విజయనగరం	108 00	
నూనె	విజయవాడ	200 00	
"	నంద్యాల	195 60	
"	ఆదోని	196 00	
"	విజయనగరం	204 44	
అపరాలు			
కందులు:	విజయవాడ	రు. 70 00	
"	గుంటూరు	70 00	
"	ఆముదాలవలస	55 91	
మినుములు:	విజయవాడ	68 00	
"	గుంటూరు	70 00	
"	ఆముదాలవలస	63 44	
పెసలు:	విజయవాడ	70 00	
"	గుంటూరు	70 00	
"	ఆముదాలవలస	54 84	
శనగలు:	విజయవాడ	62 13	
జొన్నలు			
అనంతపురం:	తెల్లవి	44 00	
నంద్యాల:	పచ్చవి	37 00	
బెల్లం			
అనకాపల్లి:	మొదటిరకం	59 20	
"	మూడవరకం	42 50	
చిత్తూరు	మొదటిరకం	70 66	
"	మూడవరకం	55 00	
జీడిపప్పు			
మోరి:	అమెరికన్‌రకం	రు. 568 00	
"	దేశవాళి	532 00	
"	బద్దలు	527 00	
"	ముక్కలు	455 00	
మిర్చి			
జి2 ఒకటవ రకం	గుంటూరు	185 00	
జి2 రెండవ 2వ రకం	"	172 00	
జి2 చర్లరకం	"	—	
నెయ్యి			
		పల్నాడు	దేశవాళి
గుంటూరులో		570 00	580 00
కొబ్బరికాయలు			
(వెయ్యింటికి ధరలు)		కొత్తవి:	పాతవి
విజయవాడ:		160 00	210 00
రాజమండ్రి:		120 00	170 00
పాలకొల్లు:		165 00	205 00
పసుపు			
దుగ్గిరాలలో:	కొమ్ములు	రు. 135 00	
"	కాస్పూరు	155 50	
"	దుంపలు	110 00	
కడపలో	కొమ్ములు		
"	దుంపలు		
జనపనార			
విజయనగరం:	మొదటిరకం	64 30	
	రెండవరకం	60 28	
	మూడవరకం	53 59	
ఆముదాలవలస	మొదటిరకం	60 00	
	రెండవరకం	57 33	
	మూడవరకం	52 66	

సరిహద్దు సమస్యపై చైనా బల ప్రయోగం తప్పని అంగీకరిస్తారా?

మైనారిటీ గ్రూపునకు పార్టీ ఛైర్మన్ డాంగే సూటిప్రశ్న; ఇప్పటికైనా విజ్ఞత ప్రదర్శించి పార్టీలోకి తిరిగి రావాలని విజ్ఞప్తి

బొంబాయి, ఏప్రిల్ 26

విచ్ఛిన్న కార్యకలాపాలు సాగిస్తున్నందుకు క్రమశిక్షణా చర్యలు తీసుకోబడినవారు, సరిహద్దు సమస్యపై భారత దేశానికి వ్యతిరేకంగా బలప్రయోగానికి చైనా పూనుకోటం తప్పుఅని, అదేవిధంగా యుద్ధం, శాంతి సమస్యతోసహా అంతర్జాతీయ రాజకీయాలలో కూడా చైనా వైఖరి తప్పని, కాశ్మీరు భారతదేశంలో అంతర్భాగమని, అంగీకరిస్తే తిరిగిపార్టీలోకి చేరవచ్చునని కమ్యూనిస్టుపార్టీ ఛైర్మన్ శ్రీ డాంగే నేడిక్కడ ప్రకటించారు.

250 కార్మిక సంఘాలు శ్రీ డాంగే గౌరవార్థం జరిపిన గొప్ప సన్మాన సభలో ఆయన ప్రసంగిస్తూ ఇంకా ఇలా అన్నారు:

"వీరు ఘోరమైన తప్పులు చేసినప్పటికీ పార్టీనుండి వీరిని బహిష్కరించలేదు. వివేకం చూపటం ద్వారా తిరిగి పార్టీలోకి రావాలనే మెజారిటీ ఆశిస్తోంది. అంతేకాదు గాఢంగా వాంఛిస్తోందికూడ."

"పార్టీలో గతంనుండి విభేదాలు ఉంటూ వచ్చాయి. పార్టీతో విభేదించేవారు తమ అభిప్రాయాలనురచ్చకీడ్చనంతవరకూ క్రమశిక్షణకు కట్టుబడి ఉన్నంతవరకూ వారితో నేను పోరాడలేదు. కాని నేడు మెజారిటీకి వ్యతిరేకంగా మైనారిటీ గ్రూపు బహిరంగంగా పోరాడుతూంది. తమ అభిప్రాయాలను బహిరంగంగా ప్రచారం చేసుకునేందుకై నీతీనియమంలేని, అప్రతిష్ఠ విధానాలను వారు చేబట్టారు కనుకనే వారిపైన కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవలసి వచ్చింది" అని శ్రీ డాంగే ప్రకటించారు.

"కమ్యూనిస్టుపార్టీ, ప్రజల ప్రయోజనాలను ఈడేర్చే పార్టీగా ఉండాలన్న ప్రధానాంశాలపై ఇక ఏ మాత్రం రాజీపడరాదు" అని 10 వేల మంది ప్రజానీకం పెద్దపెట్టున హర్షధ్వానాలు చేస్తుండగా శ్రీ డాంగే ఉద్ఘాటించారు.

కమ్యూనిస్టుపార్టీ - గాంధీ

"మహాత్మా గాంధీ విధానాలతో ఎన్ని విభేదాలున్నప్పటికీ భారత స్వాతంత్ర్య సంపాదనకు ఆయన కావించిన కృషిని కమ్యూనిస్టు పార్టీగుర్తించాలి.

"పార్టీ ఐక్యత కొరకై గతంలో మేం పొరపాటు అభిప్రాయాలతో తరచుగా రాజీ పడ్డాం. ఇవిమమ్ములను పొరపాటు నిర్ధారణలకు, పొరపాటుకార్యాచరణకు కొనిపోయాయి.

"మహాత్మాగాంధీ విషయమే తీసుకోండి. దేశద్రోహిగా, బ్రిటిష్‌సామ్రాజ్యవాదఏజంటుగా ఆయన్ను మేం గతంలో నామకరణం చేశాం. ఈ వైఖరిని నేను మొదటినుండి వ్యతిరేకించాను, కాని పార్టీలో మమ్ములను వ్యతిరేకించేవారితో సర్దుబాటు చేసుకొనేందుకై నేను మరి కొందరు మెదలకుండ ఊరుకొన్నాం. ఇది పొరపాటు.

అటువంటి పొరపాటు అభిప్రాయాలను త్రోసిపుచ్చటంలో ఇప్పుడు ఏమాత్రం మేం సంకోచించటంలేదు"అని శ్రీ డాంగే అన్నారు.

అలెప్పీ జిల్లా సమితి సమావేశం

అలెప్పీ, ఏప్రిల్ 26

అలెప్పీజిల్లా కమ్యూనిస్టు సమితి సమావేశానికి అధ్యక్షత ఎవరు వహించాలనేదానిపై వోటింగు నేడు జరిగింది. ఉస్మాన్ అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. ఒక వోటు తేడాతో శ్రీ టి. థామస్ వోడిపోయాడు.

జిల్లాసమితికార్యదర్శి శ్రీ అచ్యుతానందన్‌ను రాష్ట్ర సమితి పార్టీ నుంచి బహిష్కరిస్తూ, క్రమశిక్షణచర్య తీసుకొన్నందున కొత్త కార్యదర్శిని ఎన్నుకొనేటందుకు సమితి సమావేశం అయింది.

సోవియట్, చైనా కమ్యూనిస్టుపార్టీలకు రుమేనియాపార్టీ విజ్ఞప్తి

చీలికను అరికట్టవలసిందిగా

బెల్‌గ్రేడ్, ఏప్రిల్ 28

ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో చీలిక ఏర్పడే విధానాన్ని అరికట్టవలసిందిగా సోవియట్ యూనియన్, చైనా కమ్యూనిస్టుపార్టీలకు రుమేనియా కమ్యూనిస్టుపార్టీ నేడు బహిరంగంగా విజ్ఞప్తి చేసిందని యుగోస్లేవియా వార్తాసంస్థ నేడు తెలియచేసింది.

ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలన్నిటికీ ముఖ్యంగా సోవియట్, చైనా కమ్యూనిస్టుపార్టీలకు చేసిన ఈ విజ్ఞప్తి రుమేనియాపార్టీ అధికారపత్రిక స్కింటియా నేడు ప్రచురించింది.

గతవారంలో జరిగిన రుమేనియా పార్టీ కేంద్ర కమిటీ విస్తృత సమావేశంలో ఈ విజ్ఞప్తితోకూడిన డాక్యుమెంటు ఆమోదించబడింది.

ఈ సమావేశం గత బుధవారంనాడు ముగిసింది. చైనా, ఉత్తరకొరియా, సోవియట్ యూనియన్ నాయకులతో రుమేనియా ప్రధాని గార్గోమారియర్ నాయకత్వాన రుమేనియాపార్టీ ప్రతినిధివర్గం జరిపినసంభాషణలపై నివేదికలు ఈ సమావేశానికి సమర్పించారు.

ఈ ప్రకటనలో అంశాలిలా వుంది."

"ప్రపంచ కమ్యూనిస్టు, కార్మికోద్యమాల, ఐక్యతను సోషలిస్టు దేశాల శిబిర ఐక్యతను స్థాపించేందుకు రుమేనియాపార్టీ దీక్ష పూనింది.

ఇలాంటి ఐక్యత ఏర్పడేందుకు ముఖ్యమైన ప్రథమ చర్య, వెంటనే కమ్యూనిస్టు పార్టీల మధ్య సాగుతున్న వాదోపవాదాలకు స్వస్తి చెప్పటం.

కాబట్టి బహిరంగ వాదోపవాదాలకు వెంటనే స్వస్తిచెప్పవలసిందిగాను, ప్రపంచ కమ్యూనిస్టు వర్కర్ల పార్టీల మహాసభకు సన్నాహాలు చేయవలసిందిగాను అన్ని సోదర పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నాము."

చైనాపై స్పెయిన్ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి విమర్శ

మాస్కో, ఏప్రిల్ 26

స్పెయిన్ కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా ఫాసిస్టు చర్యలను చైనా కమ్యూనిస్టు నాయకత్వం రెచ్చగొట్టుతోందని స్పెయిన్ కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి కారిల్లో నేడు తీవ్రంగా విమర్శించారు.

ప్రావ్దాలో ఆయన ఒక వ్యాసం వ్రాస్తూ ఇంకా ఇలా అన్నారు:

స్పెయిన్‌లోని ఫాసిస్టుల టెలివిజన్, రేడియోలు చైనా కమ్యూనిస్టు నాయకత్వ భావాలను సమర్థిస్తూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి.

"ఫ్రాంకో ప్రభుత్వాన్ని తుదముట్టించేందుకు, స్వాతంత్ర్యాన్ని పునరుద్ధరించేందుకు సాగుతున్న పోరాటంలో మా దేశంలో ప్రజాస్వామ్య శక్తులకు సహాయకారి కాని ఏ రాజకీయ చర్యను సోవియట్ తీసుకోదని స్పెయిన్ ప్రజలకు బాగాతెలుసు"అని ఆయన అన్నారు.

'లావోస్ తిరుగుబాటుదారులు ఏర్పరచే ప్రభుత్వాన్ని గుర్తించం'

పాథెట్ లావో ప్రకటన

హాంకాంగ్, ఏప్రిల్ 26

లావోస్ తిరుగుబాటుదారులు ఏర్పరచే ఏ నూతన ప్రభుత్వాన్ని తాము గుర్తించేది లేదని పాథెట్‌లావోనాయకుడు సౌఫనోవాంగ్ రాజకీయపక్షం నేడు ప్రకటించింది.

ఈ విధంగా ఏర్పరచే నూతన ప్రభుత్వానికి తటస్థ ప్రధాని సౌవన్నాఫౌమా నాయకుడుగా ఉన్నా తాము గుర్తించబోమని ఆయన అన్నారు.

సౌఫనోవాంగ్ ప్రకటనను నవచైనా వార్తాసంస్థ ప్రచురించింది.

లావోస్ జాతీయ ప్రభుత్వంలో మార్పులు తీసుకొచ్చేందుకై సౌవన్నాఫౌమాపై తిరుగుబాటుదారులు ఒత్తిడి తీసుకురావటాన్ని పాథెట్ లావో రాజకీయ పక్షమయిన నియోలావో హక్సత్ పార్టీ తీవ్రంగా ఖండించింది.

తటస్థ వైఖరుల ప్రయోజనాలను కాపాడవలసిందిగాను, తిరుగుబాటువాదుల హేయమైన, నీచమైన కుట్రలను వ్యతిరేకిస్తూ వారి ఎడల అప్రమత్తతో వ్యవహరించ వలసిందిగాను తటస్థ ప్రధాని సౌవన్నాఫౌమాకు ఆ పార్టీ విజ్ఞప్తి చేసింది.

అమెరికా సామ్రాజ్యవాదులు, తిరుగుబాటుదారులు ఇతరులపై వత్తిడి తీసుకువస్తున్నారని ఆ విధంగా తమ అభీష్టంప్రకారం ఇతరులు కూడ నడవాలనే రీతిలో వారు బలవంతం చేస్తున్నారని, ఈ అక్రమ చర్యలనుండి ఉత్పన్నమయ్యే పరిస్థితులన్నిటికీ పూర్తి బాధ్యత వీరు వహించవలసి వుంటుందని ఆ పార్టీ హెచ్చరించింది.

రు. 2¼ కోట్లఖర్చుతో కాందిశీకులకై చిన్నపరిశ్రమలు

భువనేశ్వర్, ఏప్రిల్ 26

తూర్పు పాకిస్తాన్‌నుండి వచ్చే శరణార్థుల పునరావాస కల్పన కోసం ఒరిస్సాలోని కోరాపుట్ జిల్లాలో 2¼ కోట్ల రూపాయల వ్యయంతో చిన్న తరహాపరిశ్రమలను ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ డబ్బును రాష్ట్రప్రభుత్వానికి అప్పుగా యివ్వడం జరుగుతుంది. ఈ పరిశ్రమలను రాష్ట్ర చిన్నతరహా పరిశ్రమల బోర్డు నిర్వహిస్తుంది.

ఈ పథకం క్రింద వడ్రంగం, చిన్నతరహా యింజనీరింగ్, ఫౌండ్రీలు, మరమగ్గాలు మొదలైన పరిశ్రమలను వివిధ శరణార్థి శిబిరాల పరిసరాల్లో ఏర్పాటు చేస్తారు.

ఈ జిల్లాకు యింతవరకు 1000 శరణార్థి కుటుంబాలు వచ్చాయి, రాష్ట్రంలో మొత్తం 5000 కుటుంబాలకు పునరావాసం కల్పించటానికి రాష్ట్రప్రభుత్వం సమ్మతించింది.

బొంబాయిలోని ఆజాద్ మైదానంలో 30 వేల మంది ముస్లిం ప్రజలు గురువారం ఉపవాస ప్రార్థనలు జరిపారు.

పశ్చిమ బెంగాల్ కమ్యూనిస్టు సమితిలోని తిరుగుబాటు దారులు

జాతీయసమితి నిర్ణయాలకు ధిక్కారణ

కలకత్తా, ఏప్రిల్ 25

పశ్చిమబెంగాల్ కమ్యూనిస్టు సమితిలోని 102 మంది సభ్యులలోను 61 మంది సభ్యులు ఇక్కడ సమావేశమై డాంగే అధ్యక్షతనున్న జాతీయ సమితిని త్రోసిరాజని ఇటీవల జాతీయ సమితి చేసిన నిర్ణయాలను ధిక్కరించుతూ పార్టీ సభ్యులందరూ ఆ విధంగా ధిక్కరించాలని పిలుపుయిస్తూ ఒక తీర్మానం చేశారు. సమావేశానికి శ్రీ ముజఫర్ అహమ్మద్ అధ్యక్షత వహించారు.

జాతీయసమితినుండి వాకౌట్‌చేసిన 32మంది చేసిన ప్రకటనను వీరుబలపరిచారు.

ఈ సమావేశానికి మధ్యస్థులలో కొందరు హాజరుకాలేదని సమావేశానికి హాజరైన మధ్యస్థుల నాయకుడు పత్రికల వారికి తెలియజేశారు.

ఇంతవరకు జైళ్ళలో నిర్బంధింపబడిన కమ్యూనిస్టు డిటెన్యూలను విడుదల చేయాలని కోరారు.

రాజ్యాంగచట్టం 18 వ సవరణ బిల్లును నిరసించుతూ మరో తీర్మానం చేశారు.

ప్రత్యేకాహ్వానితులుగా శ్రీ పి.రామమూర్తి హాజరయ్యారు.

బట్లర్ పయనం

లండన్, ఏప్రిల్ 26

బ్రిటిష్ విదేశాంగమంత్రి బట్లర్ అమెరికా అధ్యక్షుడు జాన్‌సన్‌తో సంభాషణలు జరిపేందుకై నేడు వాషింగ్‌టన్‌కు బయలుదేరి వెళ్ళారు.

వైద్యకళాశాలల్లో రాష్ట్రేతరులకు పదిశాతంసీట్లు

అన్ని రాష్ట్రాలు కేటాయించాలని సూచన

తిరువనంతపురం, ఏప్రిల్ 26

వైద్య కళాశాల సీట్లలో పదిశాతం కేంద్రం ఇతర రాష్ట్రాలకు కేటాయించడానికి అవకాశం కల్పించాలనీ, ఇది జాతీయ సమైక్యతకు తోడ్పడగలదనీ దక్షిణ మండలి ఆరోగ్య మంత్రుల సమావేశం సిఫార్సుచేసింది.

ఈ సీట్లకు విద్యార్థులను కేంద్ర ప్రభుత్వమే ఎంపిక చేయవచ్చుననీ, రాష్ట్ర ప్రభుత్వాలు మెరిట్‌స్కాలర్ షిప్పులు ఏర్పాటు చేయాలనీ సమావేశం సూచించింది. ఏ రాష్ట్రానికి చెందిన వారనే దానితో నిమిత్తంలేకుండా యోగ్యతనుబట్టి వైద్య కళాశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని కూడా సమావేశం సిఫార్సు చేసింది.

ప్రధానితో కరణ్‌సింగ్ చర్చ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26

జమ్మూ-కాశ్మీర్ సదర్-ఇ-రియాసత్ డా. కరణ్‌సింగ్ ప్రధాని నెహ్రూను నేటిరాత్రి కలుసుకొని షేక్ అబ్దుల్లా ప్రసంగం వల్ల కాశ్మీర్‌లో ఏర్పడిన పరిస్థితిని గురించి ఆయనకు నివేదించారు.

డా. కరణ్‌సింగ్ ప్రధానితో గంటసేపు సంభాషించారు.

అంతకుముందు ఆయన శ్రీలాల్‌బహదూర్ శాస్త్రితోను, శ్రీ నందాతోను చర్చలు జరిపారు.

అబ్దుల్లా ఈ నెల 29 వ తేదీన వచ్చి శ్రీ నెహ్రూను కలుసుకొనేవరకు డా. కరణ్‌సింగ్ ఢిల్లీలోనే వుంటారు.

లావోస్ పరిస్థితిపై జాన్సన్ వ్యాఖ్య

వాషింగ్‌టన్, ఏప్రిల్ 25

లావోస్‌లో గతవారాంతంలో మిశ్రమ మంత్రివర్గంపై మితవాద ముఠా చేసిన తిరుగుబాటువలన ఏర్పడిన పరిస్థితులపట్ల అమెరికా ప్రభుత్వం యింకా ఆందోళన చెందుతూనే ఉన్నదని అధ్యక్షుడు జాన్సన్ నేడు చెప్పారు.

తనకందిన సమాచారాన్నిబట్టి తటస్థమిశ్రమ ప్రభుత్వానికి పూర్తి అధికారం అప్పగించలేదని తెలుస్తోందని చెప్పారు.

జాతీయ ప్రయోజనాల దృష్ట్యావారు తిరుగుబాటు చేసివుంటారని తాను గుర్తించాననీ, జెనీవా ఒప్పందాన్ని అక్షరాలా అమలు జరపాలని తన ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు.

కాంగ్రెసును గద్దెదింపితే అరాజకం వస్తుందట!

శ్రీ కామరాజ్ ప్రసంగం

గోవిందనగర్, బంకూరా, ఏప్రిల్ 25

కాంగ్రెసును గద్దెదింపడానికి ప్రతిపక్షాలు చేస్తున్న ప్రయత్నాలు విజయం పొందితే, దేశంలో అరాజకం ఏర్పడుతుందని కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కామరాజ్ నేడిక్కడ పశ్చిమ బెంగాలు రాష్ట్రరాజకీయమహాసభలోమాట్లాడుతూ అన్నారు. "సరిహద్దులోనుండి దురాక్రమణ బెదిరింపులతో సహా భారతదేశం నేడు అనేక సమస్యలను ఎదుర్కొంటూంది. భారతదేశాన్ని ఎప్పుడూ చిక్కులలో పెట్టడానికే పాకిస్తాన్ యత్నిస్తూంది. అందుచేత ఈ దేశంలో ప్రజలు అప్రమత్తులై ఉండాలి"అని కామరాజ్ అన్నారు. తూర్పుపాకిస్తాన్‌లో ఇటీవల జరిగిన అల్లర్లు గురించి మాట్లాడుతూ అక్కడ జరిగిన హింసాకాండకు ఇక్కడ ప్రతిగా మతకలహాలు చెలరేగాయనీ కాని యిటువంటి చర్యలు జరగకుండా చూడాలనీ, మైనారిటీలకు రక్షణ కల్పించాలని ఆయన అన్నారు.

సోషలిజం, ప్రజాస్వామ్యాల గురించి తీర్మానాలు ఆమోదించినంత మాత్రాన సరిపోదనీ, ఈ తీర్మానాలను అమలు జరపాలనీ అన్నారు. "ప్రధాన సమస్య దారిద్ర్య నిర్మూలన. ఇందుకు మార్గం పొలాల్లో పంటలను, ఫ్యాక్టరీలలో సరుకును ఎక్కువ ఉత్పత్తి చేయటం, సమంగా పంపకం జరగటం ప్రధానం"అని అన్నారు.

భువనేశ్వర్ తీర్మానాలు తాత్కాలిక ఉద్రేకంతో చేసినవి కావనీ, ఈ తీర్మానాలు అమలు జరపడానికి అప్పుడే కార్యక్రమం ప్రారంభమైందనీ అన్నారు.

భువనేశ్వర్ తీర్మానాలను కాంగ్రెస్ అమలు జరపలేదన్న విమర్శకు శ్రీ కామరాజ్ సమాధానం యిస్తూ "భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం తీసుకురావాలని కాంగ్రెస్ తీర్మానించింది. అందుకోసం దీర్ఘకాలం పోరాడి స్వాతంత్ర్యాన్ని సాధించింది. అదే విధంగా యిప్పుడు సోషలిజం-ప్రజాస్వామ్యం గురించి తీర్మానం చేశాము. దానిని అమలు చేయడానికి కాయకష్టంలా కృషిచేయాలి. ప్రభుత్వం మనది. దాని సహకారంతో దానిని మనం సాధించుకోవాలి." అన్నారు.

కాంగ్రెస్ అనుసరించుతున్న లౌకిక రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యం-సోషలిజం తీర్మానాలను ఇతర రాజకీయ పార్టీలు సవాలు చేస్తున్నాయి. ఈ సవాలును ఎదుర్కొనకపోతే కాంగ్రెస్ పెద్ద సంక్షోభంలో పడుతుందని శ్రీ కామరాజ్ అన్నారు.

తరువాత శ్రీ సంజీవరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం సంపాదించిన తదుపరి 17 సంవత్సరాల అనంతరం మనం సాధించిన భౌతిక లక్ష్యాలు ఏమిటో అంచనా వేయవలసిన సమయం ఆసన్నమైందని అన్నారు. క్రమంగా కొద్దిమంది చేతులలో సంపద కేంద్రీకరణ పెరుగుతున్నదని అందరూ అంటున్నారు. ఆ విధంగా అయితే దీనిని అరికట్టడానికి అనుసరించవలసిన మార్గం ఏమిటి? ఈ విషయాన్ని దానితోపాటు రైతాంగం సమస్యను ఆలోచించాలి" అని శ్రీ సంజీవరెడ్డి అన్నారు.

చౌ-ఎన్-లై ఆఫ్రికా పర్యటన

చైనా పార్లమెంటుకు నివేదిక సమర్పణ

పెకింగు, ఏప్రిల్ 25

ఇటీవల ఆఫ్రికాదేశాలలోనూ, ఆల్బేనియా, మరో మూడు దక్షిణ ఆసియా దేశాలలోనూ తాను జరిపిన పర్యటన మంచి సత్ఫలితాలను యిచ్చిందని చైనా ప్రధాని చౌ-ఎన్-లై చెప్పారని నవచైనా వార్తాసంస్థ ప్రకటించింది.

జాతీయ పార్లమెంటు స్థాయీసంఘానికి తన పర్యటనను గురించి చౌ-ఎన్-లై నివేదిక యిస్తూ "తన పర్యటనవల్ల చైనా, ఆల్బేనియా కమ్యూనిస్టుపార్టీల మధ్య ఐక్యత మరింత దృఢపడటానికి దోహదం చేసిందని" అన్నారు. అలాగే ఇతర ఆసియా, ఆఫ్రికా దేశాలకు చైనాకు మధ్య సహకారాభివృద్ధికి వీలు కలిగిందని చెప్పారు.

పాకిస్తాన్‌లో తన పర్యటనను గురించి ప్రస్తావించి "మా పర్యటన చివరివరకూ... మేము స్నేహపూర్వక వాతావరణం మధ్య వున్నట్లు మా కనిపించింది. చైనా ప్రజలపట్ల పాక్ ప్రజలు ప్రదర్శించిన గౌరవభావం అలాంటిది."

"అయూబ్‌ఖాన్‌తో జరిపిన స్నేహపూర్వక సంభాషణలు, పరస్పర అవగాహనను ఇంకా ఎక్కువ బలపరచాయి."

కాశ్మీర్ సమస్యపై అబ్దుల్లాతో చర్చలు సరియైనది కాదని

జనసంఘ్ నాయకుల వ్యాఖ్య

లక్నో, ఏప్రిల్ 26

కాశ్మీరుకు సంబంధించిన రాజ్యాంగంలోని ప్రస్తుత సూత్రాలను స్పష్టంగా అంగీకరించకుండా కాశ్మీర్ సమస్యపై చర్చించటానికి ప్రధాని నెహ్రూ షేక్‌అబ్దుల్లాను ఆహ్వానం పంపటం పెద్దతప్పనీ, రాజకీయవిజ్ఞత కాదనీ భారతీయ జనసంఘ ప్రధానకార్యదర్శి శ్రీ దీనదయాళ్ ఉపాధ్యాయ నేడిక్కడ చెప్పారు.

ఇక్కడ పత్రికావిలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వానికి తెలియకుండా షేక్ అబ్దుల్లాతో మాట్లాడటం సరియైనది కాదని, విజ్ఞత అనిపించుకోదని కూడా చెప్పారు. రాజ్యాంగంలోని 370 వ సూత్రాన్ని వెంటనే రద్దుచేయాలన్నారు. కాశ్మీర్ భారతదేశంలో విలీనకరణ మొక్కటే పరిష్కారమని సూచిస్తున్నారు.

రాజ్యాంగంలోని 370 వ సూత్రాన్ని రద్దు చేయాలని కోరుతూ రెండు రోజుల నుండి బెంగుళూరులో జరుగుతున్న కర్నాటక రాష్ట్ర జనసంఘ వార్షిక సమావేశంలో తీర్మానించారు. పద్దెనిమిదవ రాజ్యాంగ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరుతూ మరొక తీర్మానాన్ని కూడా ఆమోదించారు.

ప్రియూనివర్సిటీకోర్సు హైస్కూళ్ళకు మార్పు

రాష్ట్ర విద్యామంత్రుల నిర్ణయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26

హైస్కూలు కోర్సు ఖచ్చితంగా ఇన్నేళ్ళుండాలని నియమం అవసరంలేదనీ, అయితే చెప్పే చదువులోని అంశాలుమాత్రం దాదాపు దేశమంతటా ఒకే విధంగా వుండాలనీ, హైస్కూలు విద్యాస్థాయిని పెంచడంలో కేంద్రం ఇప్పటికన్నా ముఖ్యమయిన పాత్ర వహించాలనీ రాష్ట్ర విద్యామంత్రుల సమావేశం తీర్మానించింది. ఇందుకై ప్రియూనివర్సిటీ కోర్సును హైస్కూళ్ళకు మార్చాలని నిర్ణయించింది.

రెండురోజులుగా సాగుతున్న సమావేశం నేడు ముగిసింది. సమావేశానికి కేంద్ర విద్యామంత్రి శ్రీ చాగ్లా అధ్యక్షతవహించారు.

ప్రస్తుతం విశ్వవిద్యాలయాలు నిర్వహిస్తున్న ప్రి-యూనివర్సిటీ కోర్సును నిర్ణీతకార్యక్రమం ప్రకారం హైస్కూళ్ళకు మార్చాలని సమావేశం నిర్ణయించింది.

సెకండరీవిద్య పూర్తిగా హైస్కూలులోనే నిర్వహించడానికి వీలుగాను, స్కూలు వదలిపెట్టేటప్పటికి దేశంలోని విద్యార్థులందరూ ఒకే విద్యాస్థాయినందుకోవడానికి వీలుగాను సమావేశం పై విధంగా నిర్ణయించింది.

విద్యా విధానాన్ని గురించి సమావేశం కూలంకషంగా చర్చించింది. హైస్కూలు విద్య 12 సంవత్సరాలుండాలని అందరూ అంగీకరించారు. అయితే, దేశంలో వివిధ ప్రాంతలలోని పరిస్థితులు ఒకే రకంగా లేనందువల్ల కాల పరిమితిపై ఒక నిర్ణయం చేయకూడదని సమావేశం నిశ్చయించింది.

విద్యా స్వభావం దేశ మంతటా ఒకే విధంగావుండాలనే విషయంపై నొక్కిచెప్పాలని సమావేశం నిర్ణయించింది.

విద్యా స్థాయిని పెంచడంలో, ముఖ్యంగా ప్రాథమిక పాఠశాల దశ నుండి శాస్త్రవిజ్ఞాన బోధన స్థాయిని పెంచే విషయంలోను, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే విషయంలోను కేంద్రం ప్రత్యేక పథకాలను అమలు జరపాలని రాష్ట్ర మంత్రులంతా అంగీకరించారు.

విద్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే ఉమ్మడి అంశంగా చేయడానికి రాష్ట్ర మంత్రులు అంగీకరించక పోయినప్పటికీ, హైస్కూలు విద్యాస్థాయిని పెంచడంలో కేంద్రం ఇప్పటికన్నా ఎక్కువ కృషిచేయాలని సమావేశం అభిప్రాయ పడింది.

విద్యా రంగంలో అఖిలభారత సర్వీసును ఏర్పరచడానికికూడ సమావేశం అంగీకరించింది.

సమావేశానంతరం శ్రీ చాగ్లా పి. టి. ఐ. విలేకరితో మాట్లాడుతూ, "దేశ మంతటా ఒకే రకమైన జాతీయ విద్యావ్యవస్థను నెలకొల్పడానికి సమావేశ నిర్ణయాలు ఎంతో తోడ్పడ గలవని" అన్నారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు:

"డిగ్రీకోర్సుకువెళ్ళే ముందు దేశమంతటా విద్యార్థుల విద్యాస్థాయి ఒకే రకంగా వుండాలని సమావేశం చేసిన నిర్ణయం జాతీయ సమైక్యతకు, ఒక ప్రాంతం విద్యార్థులు, ఉపాధ్యాయులు మరొక ప్రాంతాలకు వెళ్ళటానికి వినియోగపడుతుంది.

హైస్కూళ్ళు చేయవలసినపని విశ్వ విద్యాలయాలు తమ నెత్తిన వేసుకోరాదు. వారు అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సులను గురించి మాత్రమే ఆలోచించాలి. కాబట్టిప్రి-యూనివర్సిటీకోర్సునుహైస్కూళ్ళకు మార్చాలనే నిర్ణయం ద్వారా దేశమంతటా ఒకే విద్యా విధానం అమలుజరపాలనే ఉద్దేశం నెరవేరగలదు."

విద్యపై కనీస వ్యయం

విద్యపై కేంద్రం తన ఆదాయంలో కనీసం పదిశాతమూ, రాష్ట్రాలు తమ ఆదాయంలో కనీసం 20 శాతమూ వ్యయంచేయాలని సమావేశం విజ్ఞప్తి చేసింది.

నాల్గవ ప్రణాళిక అఖరుకు దేశంలోని 6-11 వయస్సుగల పిల్లలందరికీ తప్పనిసరిగా విద్య గరపాలనే లక్ష్యాన్ని సమావేశం అంగీకరించింది.

సాదిక్-బక్షివిభేదాలు తొలగింపుకు పట్నాయక్ యత్నం

శ్రీనగర్, ఏప్రిల్ 25

కాశ్మీరు ప్రధాని శ్రీ జి. యం. సాదిక్‌కు, బక్షీ గులామ్ మహమ్మద్‌కు మధ్యగల విభేదాలను తొలగించడానికి తాను ప్రయత్నంచేస్తానని నేడిక్కడ బిజియానందపట్నాయక్ అన్నారు.

ప్రస్తుత మిక్కడవున్న శ్రీ పట్నాయక్ యింకా ఇలా అన్నారు:

"వారిద్దరూ నాకు సన్నిహిత మిత్రులు. నేనేమైనా ఉపయోగపడితే అందుకు నేను ఎంతో సంతోషించగలను."

పట్నాయక్ నిన్న యిక్కడికి వచ్చారు. రేపు మధ్యాహ్నం విమానంమీద ఢిల్లీకి పయనమై వెళతారు.

ఇక్కడ తనకు కలిగిన అనుభవాలను ఢిల్లీలో ప్రధానమంత్రికి తెలపగలనని ఆయన చెప్పారు.

శ్రీ పట్నాయక్ బక్షీ గులాం మహమ్మద్‌ను, హోంమంత్రి శ్రీ డి. పి. ధర్‌ను నిన్న నేడూ కలుసుకొని మాట్లాడారు.

హవానాలోని అమెరికా రాయబార కార్యాలయం ముందు ప్రదర్శన

హవానా, ఏప్రిల్ 25

గ్వాంటనామో నావికాకేంద్రంనుండిఅమెరికా వారలు జరుపుతున్న రెచ్చగొట్టే చర్యలకు, తమ ఆకాశంమీదుగా అమెరికా గూఢచారి విమానాలు తరచుగా ఎగురుతున్నందుకు నిరసనగా నేడు వేలాది హవానా ప్రజలు హవానాలో అమెరికా రాయబార కార్యాలయం ఎదుట పెద్ద ప్రదర్శన జరిపారు.

మలేషియా ఎన్నికల్లో ప్రభుత్వపార్టీ గెలుపు

కౌలాలంపూర్, ఏప్రిల్ 25

మలేషియా పార్లమెంటుకు జరిగిన సాధారణ ఎన్నికలలో టుంకు అబ్దుల్ రహ్మాన్ నాయకత్వానగల ఎలియన్స్‌పార్టీ గెలుపొందింది.

ఇప్పటికే ఫలితాలు ప్రకటించిన 90 సీటులో ఎలియన్స్ పార్టీకి 77 సీట్లు లభ్యమయినాయి. మలేషియా పార్లమెంటు సభ్యుల సంఖ్య మొత్తం 159 మిగతా 13 సీట్లు ప్రతిపక్ష పార్టీలకు పోయాయి.

కేలాకెడహ్ నియోజకవర్గంనుంచి టుంకు అబ్దుల్ రహ్మాన్ పెద్ద మెజారిటీతో గెలిచారు.

"ఈ విజయం శత్రువుతో పోరాడేందుకు తమకు ఎక్కువబలాన్ని యిస్తుందని" రహ్మాన్ అన్నారు. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసానికి తగినట్లు శాంతి, సౌభాగ్యాల కోసం తన ప్రభుత్వం తీవ్రకృషిచేస్తుందనిఆయనఅన్నారు.

తూర్పు రాష్ట్రాల కాంగ్రెస్‌వారి సభ

శరణార్థుల సమస్యలపై చర్చ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27

తూర్పు పాకిస్తాన్ శరణార్థులకు పునరావాస కల్పన, భారతదేశంలోనికి పాకిస్తానీయుల అక్రమ ప్రవేశం మొదలైన సమస్యల గురించి,నిన్న యిక్కడ జరిగిన అస్సాం, పశ్చిమ బెంగాల్, బీహార్, ఒరిస్సా మణిపూర్, త్రిపురా ప్రాంతాల కాంగ్రెస్ కార్యవర్గాల సంయుక్త సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ కామరాజ్ నాడార్ ఈ సమావేశానికి హాజరైనారు. ఆయన సూచనపైనే పశ్చిమబెంగాల్ కాంగ్రెసు కమిటీ యీ సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

తూర్పు పాకిస్తాన్ నుండి భారత దేశంలోనికి అక్రమంగా జొరబడినవారిని తొలగించడానికి గట్టి చర్యలు తీసుకోవాలని యీ సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

కొన్ని నిర్దిష్టమైన అభివృద్ధి ప్రణాళికలను రూపొందించే విషయం వివిధ రాష్ట్రకాంగ్రెస్ కార్యవర్గాలు, ఆయా రాష్ట్రాల ముఖ్య మంత్రులతో కలసి చర్చించాలని యీ సమావేశం సూచించింది.

అస్సాం ముఖ్యమంత్రి శ్రీ బి. పి. చాలిహా యీ సమావేశంలో ప్రసంగిస్తూ, మత కల్లోలాల బాధితులు పెద్దసంఖ్యలో రావటంతో తూర్పు రాష్ట్రాలలో అత్యంత తీవ్రమైన పరిస్థితులు ఉత్పన్నమైనవని చెప్పారు.

మతోన్మాదశక్తుల్ని, అలాంటి పార్టీల నాయకుల్ని విచ్చలవిడిగా వదిలితే, పరిస్థితి మరింత అధ్వాన్నమవుతుందని ఆయన హెచ్చరించారు.

నాగాజాతి ప్రజల సమస్యలను ప్రస్తావించి బ్రిటిష్‌ప్రభుత్వ హయాంలో వారిపట్ల బొత్తిగా శ్రద్ధ చూపబడ లేదన్నారు. ఈ పరిస్థితిని చక్కబరిచి వారిని మొత్తం జాతిలో యిముడ్చుకోవాలన్నారు.

సభలో వివిధ రాష్ట్రాల ముఖ్య మంత్రులు కూడా ప్రసంగించారు.

పారిశ్రామిక సంస్థల రిజిస్ట్రేషన్‌లో మార్పులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26

ఇకపై అయిదు లక్షల రూపాయలకు మించని స్థిరపెట్టుబడి (భూములు, భవనాలు, యంత్రాలపై పెట్టుబడి) కలిగిన పారిశ్రామిక సంస్థలు 1951 సంవత్సరపు పారిశ్రామికచట్టం క్రింద లైసెన్సు పొందవలసిన అవసరంలేదని నేడిక్కడ విడుదలచేసిన అధికార ప్రకటనలో తెలియ చేశారు.

అయితే, అందుకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీవద్ద తమపేరు రిజిస్టరు చేయించుకోవాల్సి వుంది.

అయిదునుండి ఇరవై అయిదు లక్షల రూపాయలలోపు స్థిర పెట్టుబడి కలిగిన సంస్థలు సాంకేతిక అభివృద్ధికై డైరెక్టర్ జనరల్ అజమాయిషీక్రింద ఉండే సంస్థలు, అక్కడనే రిజిస్టరు చేయించు కోవాలి.

కీన్యానుండి మనదేశానికి విద్యార్థులు

నైరోబీ, ఏప్రిల్ 26

భారతదేశంలో, వివిధ వృత్తులలో శిక్షణ పొందడానికై బయలుదేరుతున్న కీన్యా విద్యార్థుల గౌరవార్థం నేడిక్కడ సభ జరిగింది. అందులో కీన్యా విద్యామంత్రి జోసెఫ్ ఓటింటే ప్రసంగిస్తూ, భారతదేశంలో వృత్తి విద్యకు సంబంధించిన శిక్షణ ఇతరదేశాల్లో ఇచ్చేదానికేమీ తీసిపోదనీ, కొన్ని సందర్భాలలో ఇతర దేశాలలోకన్నా కొన్ని మెరుగ్గావుందనీఅన్నారు.

సభలో భారత హైకమిషనర్, ప్రధాని కెన్యట్టా కుమార్తె మార్గరేట్ కెన్యట్టా మొదలగువారు పాల్గొన్నారు.

కుమారి మార్గరేట్ ప్రసంగిస్తూ నేడు కీన్యాలో ప్రముఖస్థానాల్లోవున్న కీన్యానాయకులనేకులు భారతదేశంలో విద్య నభ్యసించిన వారేనని పేర్కొన్నారు.

కీన్యా విద్యార్థులకు తమదేశంలో చదువుకొనేందుకు స్కాలర్‌షిప్పులు యివ్వడానికి ముందుకువచ్చిన ప్రభుత్వాల్లో భారతదేశం మొదటిదని నేడు ఆమె చెప్పారు.

పార్టీనుండి బర్తరఫ్

(1 వ పేజీ తరువాయి)

గ్రీవంగా ఆమోదించారు. తీర్మానం ఈవిధంగా ఉంది:

"ఆంధ్ర ప్రదేశ్‌లో ఈ విచ్ఛిన్న కార్యకలాపాలు చాలా కాలంగా సాగుతూ ఇప్పుడు పోటీ పార్టీ స్థాపన రూపం ధరించాయి. ఈ పోటీ పార్టీకి శ్రీ సుందరయ్య కార్యదర్శి, మరో 10 మంది కమిటీ సభ్యులుగా ఉన్నారు.

సంవత్సరంన్నర క్రితమే పోటీ పార్టీ కేంద్రం రహస్యంగా ప్రారంభమైంది. పార్టీ నిర్ణయాలను వీరు అమలుజరపడానికి నిరాకరించుతూ వచ్చారు. పార్టీ విధానానికి విరుద్ధంగా 81 పార్టీల ప్రకటనకు విరుద్ధంగా తమ డాక్యుమెంట్లను పంచుతూ వచ్చారు. 1963 లోనే పోటీ పత్రిక "జనశక్తిని" ప్రారంభించారు.

కొన్నిచోట్ల పోటీ పార్టీ కమిటీలను ఏర్పరచారు. అక్రమ జనరల్‌బాడీ సమావేశాలను జరిపి పార్టీ విధానానికి వ్యతిరేకంగా తమ విధానాలను ప్రచారం చేసుకుంటూ వచ్చారు. పోటీ విద్యార్థి, యువజన సంఘాలను ఏర్పరచి విచ్ఛిన్నం చేయడమే గాక, రాజ్యసభ ఎన్నికలలో పార్టీ నిలబెట్టిన శ్రీ ఎల్లారెడ్డికి పోటీ పెట్టబోమని తాము యిచ్చిన హామీకే విరుద్ధంగా తమ అభ్యర్థిచే పోటీ చేయించారు.

తమ పద్ధతులను ఈ క్రమేపీ మార్చుకుంటారని రాష్ట్ర సమితి ఉదార దృష్టితో చూస్తూ వచ్చింది. ఎంతవరకు వీలవుతుందో అంతవరకు ఓపిక పట్టింది. కాని వీరు తమ విచ్ఛిన్న కార్యకలాపాలను ఉధృతం చేశారే గాని మానలేదు."

కాంగ్రెసుతో సాధారణ ఐక్యసంఘటన ఏర్పరచుకోవాలని పార్టీ ప్రచారం చేస్తున్నట్లు, వర్గ సామరస్య విధానాన్ని అనుసరించుతున్నట్లు విచ్ఛిన్నవాదులు చేస్తున్న ఆరోపణలను ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి తుత్తునియలు చేసింది. పార్టీ విధానం సుస్పష్టమనీ, జాతీయైక్య సంఘటన నిర్మించడమే పార్టీ లక్ష్యమనీ, కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను పార్టీ ఎదుర్కొని పోరాడుతుందనీ, ఈ ప్రజావ్యతిరేక విధానాలస్థానే ప్రజాస్వామిక విధానాలను ప్రవేశపెట్టాలని ఆందోళన గావించుతుందనీ. అయితే అదే సమయంలో ప్రపంచశాంతి, వలసవ్యతిరేక విధానం, ఆర్థిక పురోభివృద్ధి మొదలగు విధానాలను బలపర్చుతుందనీ స్పష్టంచేశారు. అందుచేత పార్టీ అనుసరించుచున్నది" ఐక్యత, పోరాటం" పంథా అని తీర్మానంలో తెలియజేశారు.

పార్టీ అనుసరించుచున్న ఈ విధానానికి విరుద్ధంగా అతివాద విచ్ఛిన్న వాదులు, అతివాద పదజాలం ఒకవైపు వల్లించుతూనే మరో వైపున రాజకీయ అంధత్వాన్ని, ప్రభుత్వానికి లొంగుబాటుతనాన్ని ప్రదర్శించుతూ వచ్చారు. 1958 లో ఎన్. జి. వో. ల వేతనాలకమిటీ విషయంలోను 1963 లో రాజమండ్రి పేపరు మిల్లువిషయంలోను, ఇది వ్యక్తమైంది. అంతేకాక కాంగ్రెసుపట్ల గుడ్డి వ్యతిరేకతతో వీరు అతి నికృష్టమైన అభివృద్ధినిరోధకులతో చేతులు కలుపుతున్నారు.

వీరి ఆచరణ, వీరి నిజమైన విధానాలేమిటో బట్టబయలు చేస్తుంది. "మంత్రాలకు చింతకాయలు రాలవ"ని అంటూ వీరుమహా విజ్ఞాపన కార్యక్రమాన్ని అవహేళన చేశారు. అదనపు శిస్తు వ్యతిరేక సత్యాగ్రహంపట్ల, ట్రేడ్‌యూనియన్ కార్యకర్తలపట్ల, ఎమ్. ఎన్. ఎల నిరాహార దీక్ష పట్ల, హర్తాళ్ ప్రతిపాదనల పట్ల వీరు ప్రదర్శించిన వైఖరి "వీరి విప్లవతత్వ" నిజస్వరూపం ఏమిటో బహిర్గతం చేస్తుంది.

ఈ చీలిక ఒక స్థానిక సంఘటనమాత్రమే కాదనీ ఇది అంతర్జాతీయంగా చాలా అగాధంగా తయారు చేయబడిన కుట్రలో భాగంగా నయా (ట్రాట్స్కీవాదులైన చైనా కమ్యూనిస్టుల నాయకత్వాన ప్రారంభమైందనీ తీర్మానంలో తెలియజేశారు.

ఈ నాయకులు తమ పోటీ పార్టీ స్థాపన చర్య ద్వారా భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యులనే పవిత్ర నామానికి గల అర్హతను కోల్పోయారు.

అందుచేత ఈపోటీపార్టీ కమిటీగాఏర్పడిన 11 మందినీ - శ్రీయుతులు పి. సుందరయ్య, మోటూరి హనుమంతరావు, నండూరి ప్రసాదరావు, దేవులపల్లి వెంకటేశ్వరరావు, నెక్కలపూడి రామారావు, కొల్లా వెంకయ్య, చీరావూరి లక్ష్మీనరసయ్య, చండ్రపుల్లారెడ్డి, తరిమెల నాగిరెడ్డి, గుంటూరు బాపనయ్య, వజ్రవేలుచెట్టిగార్లను ఈ తీర్మానంద్వారా రాష్ట్ర సమితి పార్టీనుండి బర్తరఫ్ చేసింది.

విచ్ఛిన్నకారులు జారీచేసిన ప్రకటనపై సంతకాలు చేసినవారు 44 లో యిద్దరు ఇదివరకే తొలగించబడ్డారు. మిగతా 42 మందిని యిప్పుడు సస్పెండ్ చేయడం జరుగుతూవుంది. వారిని పార్టీనుండిఎందుకు బహిష్కరించరాదో ఒకమాసం లోపల్లోగా సంజాయిషీ చెప్పు కోవాలి.

ఆ తరువాత సమితి విచ్ఛిన్నకుల కార్యకలాపాల ఫలితంగా ఉత్పన్నమైన నిర్మాణ సమస్యలనూ, అందుకు ప్రతిగా పార్టీ భద్రత కోసం తీసుకోవలసిన నిర్మాణచర్యలను చర్చించింది.

కమిటీల రద్దు

విచ్ఛిన్నకారుల చర్యలను మెజారిటీగా సమర్థించిన ఖమ్మం, గుంటూరు, కర్నూల్ నిజామాబాద్ జిల్లా సమితులనూ, విజయవాడ పట్టణసమితిని, రాష్ట్ర సమితి రద్దుచేసింది.

జాతీయ సమితి నిర్ణయాలను అమలు జరుపుతూ పార్టీకి అంతగా నిలిచే యీ సమితుల సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. పై సమితుల పరిధిలో వ్యవహరించే యితర యూనిట్లుకూడా యిదే సూత్రం వర్తింప చేయబడుతుంది.

మహబూబ్‌నగరం ఏరియా కమిటీని కర్నూల్ కమిటీతో విలీనం చేయడానికి సమితి నిర్ణయించింది. మొత్తం జిల్లాకు ఒకే ఒక కమిటీ వుంటుంది.

ఉత్తర, దక్షిణ నెల్లూరు జిల్లా సమితులు ఏకం చేయబడతాయి. ఈ రెండు సమితుల సంయుక్త సమావేశం జరిపించే బాధ్యత శ్రీ ఎల్లమందారెడ్డికి అప్పగించబడింది.

కార్యవర్గంలో కొత్త సభ్యులు

శ్రీ పెదపాటి వెంకట్రావు (తూ. గోదావరిజిల్లా), యం. వి. యస్. కపర్ది (ప. గోదావరి), వి. కె. ఆదినారాయణరెడ్డి (అనంతపురం), తీగల సత్యనారాయణ (వరంగల్), వి. శ్రీ కృష్ణ (గుంటూరు), రామచంద్రారెడ్డి (నల్లగొండ), టి. గోవిందయ్య (ఆం. ప్ర వ్యవసాయ కార్మికసంఘం) గార్లను సమితి ప్రదేశ్ కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకొంది.

శ్రీయుతులు ఎల్లమందారెడ్డి, డాక్టర్ రాజ్ బహదూర్‌గౌడ్‌గారలను కార్యదర్శివర్గ సభ్యులుగా సమితి ఎన్నుకొన్నది.

రాష్ట్ర మహాసభ

పదవ రాష్ట్ర పార్టీ మహాసభ జరిగేవరకూ సమితి సమావేశాలకు వివిధ జిల్లాలనుండి 86 గురు ముఖ్య కార్యకర్తలను ఆహ్వానితులుగా పిలుస్తూ వుండాలని సమితి నిర్ణయించింది

రాష్ట్ర పార్టీ 10 వ మహాసభ గుంటూరు పట్టణంలో జరపడానికి నిర్ణయించబడింది.

ప్రతిపక్ష నాయకత్వం

రాష్ట్ర శాసనసభలోని కమ్యూనిస్టు ప్రజాతంత్రపక్షం నాయకత్వ, ఉపనాయకత్వ స్థానాలనుండి శ్రీయుతులు పి. సుందరయ్య, టి. నాగిరెడ్డిగారలను తొలగించాలని సమితి తీర్మానించింది. కొత్త నాయకుణ్ణి, ఉపనాయకుణ్ణి ఎన్నిక చేసే విషయంలో బాధ్యతను కార్యవర్గానికి అప్పగించింది.

సత్యాగ్రహులకు అభివందనలు

అదనపు భూమిశిస్తు, బంజర్ల పంపిణీ సమస్యలపై సత్యాగ్రహంలో పాల్గొన్న వారందర్నీ అభినందిస్తూ సమితి మరో తీర్మానం ఆమోదించింది. ఈ సమస్యలపట్ల ప్రభుత్వ మొండి వైఖరిపై ప్రజల తీవ్రకోపాన్ని ఈ ఉద్యమం గట్టిగా వ్యక్తీకరించింది. ఈ ఉద్యమం రాష్ట్రం నలుమూలలకూ వ్యాపించింది. లక్షలాది ప్రజలు యీ సత్యాగ్రహంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు; లేదా ఊరేగింపులు, సభల్లో పాల్గొనడం ద్వారా, ఆర్థికంగా తోడ్పడ్డం ద్వారా తమ సంఘీభావాన్ని వెల్లడించారు. పట్టణ కార్మికులు, మధ్య తరగతులవారూ, వర్తకులుగూడా ప్రదర్శనల ద్వారా, సమ్మెలు హర్తాళ్ళ ద్వారా ఉద్యమంపట్ల సంఘీభావాన్ని ప్రదర్శించారని సమితి యీ తీర్మానంలో చెప్పింది.

అయితే, ప్రజాస్వామ్యం, సోషలిజం గురించి చెప్పుకొనే ప్రభుత్వం దురదృష్టవశాత్తు తన ప్రజా వ్యతిరేక విధానాలను మొండిగా పట్టుకొని వ్రేలాడుతూంది. ప్రజల న్యాయమైన కనీస కోర్కెలను సైతం నిరాకరిస్తూ వుంది. అఖిలపక్ష కార్యాచరణ సంఘ సభ్యులు ప్రభుత్వంతో తమ సంప్రతింపుల సందర్భంలో సబబైన రాజీకి శతథా ప్రయత్నించారు. రైతాంగంపై పన్నులభారం ఎంత పెద్ద ఎత్తున పడిందో దర్యాప్తు జరిపేందుకు ఒక సంఘాన్ని నియమించడానికి సైతం ప్రభుత్వం సమ్మతించలేదు.

ప్రభుత్వం యీ వైఖరిని విడనాడాలనీ, సత్యాగ్రహోద్యమానికి సంబంధించిన మౌలికమైన రెండు కోర్కెలకు సమ్మతించాలని సమితి కోరుతూవుంది. ప్రభుత్వం తన పట్టుదలను విడువకపోతే ఉద్యమం మరింత ఉధృతరూపం ధరించక తప్పదని హెచ్చరించుతోంది.

ఇతర తీర్మానాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అధిక ధరల అలవెన్సు పెంపుదల డిమాండును సమర్థిస్తూ ఒక తీర్మానాన్ని, ఆహార పరిస్థితిపై మరో తీర్మానాన్ని కూడా సమితి ఆమోదించింది. పట్టణాలలో ప్రభుత్వ ఆహార విధానం టోకు వ్యాపారులకూ, మిల్లర్లకూ లొంగుబాటు చూపే విధంగా వుందని సమితి యీ తీర్మానంలో విమర్శించింది. ఆహార ధాన్యాల టోకు వ్యాపారాన్ని ప్రభుత్వమే చేపట్టాలనీ, అన్ని పట్టణాలలోనూ ప్రతి 5 వందల యిండ్లకూ ఒక చౌకధాన్యం దుకాణం ఏర్పాటు చేయాలనీ, హోటళ్ళకూ, రెస్టారెంట్లకూ సరసమైనధరలకు సరుకులు సరఫరాచేయడంద్వారా భోజనం, ఫలహారాల ధరలు పెరగకుండా అదుపుచేయాలనీ, కార్మికులకూ - ఉద్యోగులకూ యిచ్చే ధరల అలవెన్సులను జీవనవ్యయ సూచికలతో జతపర్చాలని కోరింది.

కేరళ రెవెన్యూబోర్డు సభ్యునిపై శిక్షణాచర్య చెల్లదని హైకోర్టులో రిట్ పిటిషన్

ఎర్నాకుళం, ఏప్రిల్ 26

తనను సస్పెండు చేయటం రాజ్యాంగంలోని 226 వ సూత్రం ప్రకారం చెల్లదని కేరళ రెవెన్యూబోర్డు ప్రథమ సభ్యుడు శ్రీ ఎస్. గోవింద మీనన్ కేరళ హైకోర్టులో వేసిన రిట్ పిటీషనును అడ్మిట్ చేసుకున్నారు.

తుంగభద్ర ఇండస్ట్రీస్ కార్మికుల విజయం

మేనేజిమెంటుచే తొలగింపబడ్డ పనివారికి కార్మికుల సమ్మె ఫలితంగా మళ్ళీ ఉద్యోగం

కర్నూలు, ఏప్రిల్ 26

బిర్లా యాజమాన్యంలో గల 'తుంగభద్రా ఇండస్ట్రీస్' మేనేజిమెంటు ఇటీవల 62 మంది కార్మికులను అక్రమంగా పనులనుండి తొలగించినందున మొత్తం కార్మికులు 700 మంది ఏప్రిల్ 18 న ఒక రోజు నిరసన సమ్మె చేశారు. కార్మికుల ఐక్య కార్యాచరణ ఫలితంగా, మేనేజిమెంటు తొలగించినవారిని పనులలోకి తీసుకొంది.

ఈ విషయాలను వివరిస్తూ, తుంగభద్రా ఇండస్ట్రీస్ లేబర్ యూనియన్ అధ్యక్షులు శ్రీ వి. ఆర్. [illegible] యిలా ప్రకటించారు:

"బిర్లా యాజమాన్యం క్రింద నడుపబడుతున్న తుంగభద్రా ఇండస్ట్రీస్ వారి వనస్పతి ఫ్యాక్టరీకి చెందిన బొగ్గు, చెక్క, వనస్పతి, గోడౌనులలో పనిచేస్తున్న 275 మంది కార్మికులకు నిర్ణీతమైన పని గంటలు, కూలీరేట్లు కూడ లేవు. వీరికి వారం వారం బట్వాడా చేయబడుతున్న కూలి ఫ్యాక్టరీ ఆవరణలో చెల్లించటం లేదు. కూలి కోసం కాంట్రాక్టర్ యింటి చుట్టూ గంటల తరబడి పడిగాపులు కాయాలి. ఎంత కూలీ యిచ్చేది కాంట్రాక్టరు దయాదాక్షిణ్యం పై ఆధారపడి వుంటుంది. కార్మికులు లేమాత్రం అసంతృప్తి తెలియబరచినా వారిని కిరాయి రౌడీలతో కొట్టించడం, పనినుండి తొలగించడం సర్వసాధారణంగా అమలులోవున్న ఆచారం.

ఈ దుర్భరమైన ఈ బానిస జీవితాన్ని గడపలేక, ఈ మధ్యనే ఈ కార్మికులు మూకుమ్మడిగావచ్చి తుంగభద్రా ఇండస్ట్రీస్ లేబర్ యూనియన్‌లో సభ్యులుగాచేరారు. ప్రావిడెంట్ ఫండ్, ఇ. యస్. ఐ; ఫ్యాక్టరీలో అమలులో వున్న కనీస వేతనం మొదలయిన కార్మిక చట్టాలు కానిండి కనీస హక్కులైనా కల్పించమని స్థానిక లేబరు ఆఫీసరుకు యూనియన్ కార్యకర్తలు ఎన్నిసార్లు చెప్పుకొన్నప్పటికీ, వారు యీ అభ్యర్థనలను పెడచెవిని పెట్టారు. అంతేకాకుండా వర్కర్లను తనవద్దకు రప్పించుకొని "మీరు యూనియన్‌లో చేరితే మీ పనులూడిపోతాయని" బెదిరించారు. యజమానులు లేబరు ఆఫీసరు అండను చూచుకొని కార్మికుల పైన పెద్ద ఎత్తున రౌడీం దాడి సాగించారు.

ఈ గూండా చర్యలను ఎదుర్కొంటూనే కార్మికులు మరింత ఐకమత్యంతో తమ సంఘాన్ని బలపరిచారు.

కార్మికులను విచ్ఛిన్నం చేయటానికి యజమానులు అవలంబించిన రౌడీ పద్ధతులు విఫలమయినవి. కార్మికులను బెదరగొట్టాలన్న దురుద్దేశంతో వనస్పతి గోడౌన్‌లో పనిచేస్తున్న 43 మంది కార్మికులను యూనియన్ సమావేశాలకు హాజరవుతున్నారన్న మిషతో పనినుండి తొలగించారు. ఈ విషయం లేబరు ఆఫీసరుకు తెలియచేయగా తను చేయగలిగిందేమీలేదు అని చెప్పి పంపారు. లేబరుఆఫీసరు యొక్క ఈ విచిత్ర వైఖరివల్ల మరింత ధైర్యం పుంజుకొన్న యజమానులు ఏప్రిల్ 16 వ తేదీన ఆర్. ఎం. గోడౌనులో 12 మంది కార్మికులను తొలగించారు. ఈ విషయమై ఏప్రిల్ 17 న యూనియన్ తన నిరసన తెలుపుతూ తీసివేసిన కార్మికులను తక్షణమే పనిలోనికి చేర్చుకొనని పక్షంలో పారిశ్రామిక సంబంధాలు విషమించగలవని యజమానులకూ, కార్మిక శాఖాధికారులకూ తెలిపింది. ఈ హెచ్చరికకు ప్రతిఫలంగా మరో యిద్దరు కార్మికులను పనినుండి తొలగించడమేకాక కార్మికుల యెదుట యజమానులు సంఘాన్ని, సంఘనాయకులను కిరాయి రౌడీలచేత బూతులు తిట్టించారు. దీనితో రెచ్చిపోయిన కార్మికులు తమ ఓర్పుని కోల్పోయారు.

అప్పటికీ సంఘ నాయకులు కలుగజేసుకొని తంతుల ద్వారా కార్మిక శాఖాధికారులకు జిల్లా కలెక్టరుకు పై విషయాన్ని తెలుపుతూ, యజమానులవలంబిస్తున్న రౌడీ పద్ధతుల వల్ల క్షణక్షణానికి విషమిస్తున్న పారిశ్రామిక సంబంధాలను మీరు కలుగజేసుకొని అదుపులో పెట్టవలసిందని కోరారు. కార్మికుల సహనాన్ని, ప్రశాంతతను వారి బలహీనతగాఅపార్థం చేసుకొన్న అధికారులు ఈ అభ్యర్థనలను బుట్టదాఖలా చేశారు.

ఇక గత్యంతరం లేక ఏప్రిల్ 17 న సాయంత్రంజరిగిన యూనియన్ సమావేశంలో ఏప్రిల్ 18 న ఉదయం 8 గంటలు మొదలు 19 వ తేదీ ఉదయం 8 గంటలవరకు ఒకదినం నిరసన సమ్మెను సంఘం నిర్ణయించింది. ఈ నిర్ణయానుసారం 18 వ తేదీన 700 మంది కార్మికులు నూటికినూరు పాళ్ళు సమ్మెకట్టారు. మొత్తం ఫ్యాక్టరీ మూసివేసివేయబడింది. మొత్తం 700 మంది సమ్మెకట్టిన కూలీలేకాక, పట్టణప్రజలుకూడ వందలాదిగా ఫ్యాక్టరీవద్దకొచ్చి ఫ్యాక్టరీవద్ద కార్మికులతోపాటు ప్రదర్శనలో పాల్గొన్నారు; దానితో యజమానులు తీసివేయబడిన కార్మికులను ఏప్రిల్ 19 వ తేదీన పనిలో చేర్చుకొన్నారు. దాన 19 వ తేదీ ఉదయం 8 గంటలకు సమ్మె విజయవంతంగా ముగిసింది.

కాంట్రాక్టుపద్ధతి మధ్యనసాగే ఈ దౌర్జన్య, అమానుషమైన బానిసదోపిడీ విధానాన్ని కార్మికులిక సహించరని ఇప్పటికైనా యజమానులు గ్రహించవలసి వుంది. ఈ కోర్కెలను 15 దినాలలోగా పరిష్కరించని పక్షంలో సంఘం ప్రత్యక్ష చర్యలకు దిగవలసి వస్తుంది. అవసరమైతే నిరవధికమైన సమ్మెకుకూడా సిద్ధంగావున్నామని హెచ్చరిస్తూ యూనియన్ యజమానులకు నోటీసు యిచ్చింది. కార్మిక శాఖాధికారులు వెంటనే కలుగజేసుకొని క్రింద సూచించిన వారి న్యాయమైన కోర్కెలను తీర్చాలని అభ్యర్థిస్తున్నాము. కార్మికుల కనీస కోర్కెలు.

1. ఈ ఫ్యాక్టరీ [illegible] ప్రాంగణంలో అమలులో, అంతర్భాగము అయిన ఆర్. యమ్. బొగ్గు, చెక్క, వనస్పతి గోడౌనులలో అమలవుతున్న కాంట్రాక్టు పద్ధతిని రద్దుచేసి, అందు పనిచేస్తున్న 275 మంది కార్మికులను వెంటనే రద్దుచేసి వారికికూడా ఇతర కార్మికులకివ్వబడుతున్న ఫ్యాక్టరీ కనీసవేతనం, కరువు భత్యం, బోనసు, ఓవర్‌టైమ్, కాంపెన్సేషన్, లే-ఆఫ్-వేతనాలు, పి. ఎఫ్; ఇ. ఎస్. ఐ, సెలవులు ఇత్యాది అన్ని హక్కులను కల్పించాలి.

2,240 దినాలు పని చేసిన బదిలీ వర్కర్లందరిని పర్మనెంటు చేసి వారికి కూడ రెగ్యులర్ వర్కర్ల కివ్వబడుతున్న అన్నిహక్కులూ కలిగించాలి (వీరి సంఖ్య 200.)

ఈ కంపెనీ యజమానులు యేదో ఒక సాకు చెప్పి కార్మికులను కాంట్రాక్టు వర్కర్లని, బదిలీ వర్కర్లని అవాస్తవిక పేర్లు పెట్టి వారికి న్యాయంగా చెల్లించాల్సిన వేతనాలు, హక్కులు మింగవేసి తద్వారా సాలీన దాదాపు 2 లక్షల రూపాయల కార్మికుల కష్టార్జితాన్ని కాజేస్తున్నారు. ఇది పేదల దొంగతనం కన్నా హీనమైననేరం. ఇక ఈదోపిడీని కార్మికులు సహించరు. రౌడీల దుర్మార్గం, తాబేదారుల దౌర్జన్యం, లేబరు ఆఫీసర్ల లాలూచీలు, పోలీసుల బెదిరింపులు, యీ ఉద్యమాన్ని అరికట్టలేవు. ఈ కార్మికులపట్ల మొత్తం పట్టణప్రజల సానుభూతిసహకారాలు మాకున్నాయి. అందుకే మా సమ్మె అంత విజయవంతంగా జరిగింది. ప్రజల అండతో మా సంఘం ఈపోరాటాన్ని తన న్యాయమైన కోరికలన్నీ సాధించుకొనేదాకా సాగించగలదు.

పాత్రికేయులకు తాత్కాలిక సహాయం

కేంద్ర కార్మిక మంత్రికి విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26

అఖిలభారత పాత్రికేయుల సంఘ ప్రతినిధి వర్గం నేడు కేంద్ర కార్మిక శాఖ మంత్రి శ్రీ డి. సంజీవయ్యను కలుసుకొని ఒక విజ్ఞప్తి పత్రాన్ని సమర్పించింది.

ధరలు పెరిగిన దృష్ట్యా పాత్రికేయులకు తాత్కాలిక సహాయం యివ్వాలని, మధ్యంతర తీర్పు యివ్వమని ప్రభుత్వం నియమించిన పాత్రికేయుల "వేతనాల బోర్డు"ను కోరాలని ఆ విజ్ఞప్తి పత్రంలో డిమాండ్ చేశారు.

ఈ ప్రతినిధి వర్గానికి పాత్రికేయుల సంఘ అధ్యక్షులు శ్రీ ఎ. ఎస్. బెనర్జీ నాయకత్వం వహించారు.

ఈ విషయాన్ని వేతనాల బోర్డుకు తెలియ జేస్తానని శ్రీ సంజీవయ్య చెప్పినట్లు శ్రీ బెనర్జీ తరువాత తెలియ జేశారు.

నాగభూమిలో మైకేల్ స్కాట్ పర్యటన

ప్రధాని నెహ్రూ వివరణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27

నాగరాష్ట్ర ప్రభుత్వంతో శాంతి సంప్రదింపులు జరపటానికి తిరుగుబాటుదారులను ఒప్పించేందుకు రివరెండ్ మైకేల్‌స్కాట్ చేసిన ప్రస్తుత పర్యటన విషయంలో, నాగభూమి నాయకులపై ప్రభుత్వానికి విశ్వాసం ఉన్నదని ప్రధాని నెహ్రూ నేడు లోక్‌సభలో చెప్పారు.

అనుబంధ ప్రశ్నలకు సమాధానం చెప్పే సందర్భంలో ప్రధాని జోక్యం కల్పించుకొని యీ విషయం చెప్పారు.

రివరెండ్‌స్కాట్ ప్రజల్ని కలుసుకోవటానికి నాగరాష్ట్ర ప్రభుత్వం తన సమ్మతిని తెలియజేసినప్పుడు అందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందన్నారు.

ప్రస్తుత రాజ్యాంగ పరిస్థితులలో నాగభూమిలో శాంతి నెలకొల్పటం సాధ్యమని రివరెండ్ స్కాట్‌కు యిప్పుడు నమ్మకం ఏర్పడిందని కేంద్రమంత్రి శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి మరొక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

కామన్‌వెల్తు రాజకీయ ప్రణాళిక ఉండాలట!

లండన్, ఏప్రిల్ 26

కామన్‌వెల్తు లక్ష్యంను, సూత్రాలను నూతనంగా నిర్వచించాలని రెండు బ్రిటిష్ దినపత్రికలు నేడు డిమాండ్ చేశాయి.

జూన్‌లో జరిగే కామన్‌వెల్తు మహాసభలో కామన్‌వెల్తు ప్రధానుల రాజకీయ ప్రణాళిక [illegible] తయారుచేయాలని ఆ పత్రికలు వ్రాశాయి.

కమ్యూనిజాన్ని ప్రతిఘటించటం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పటం, వాటి [illegible] ప్రోత్సహించటం మొదలుగాగల అంశాలు ఆ ప్రణాళికలో ఉండాలని ఆ పత్రికలు పేర్కొన్నాయి. వీటిని అంగీకరించని దేశాలు కామన్‌వెల్తునుంచి ఉపసంహరించుకోవడం మంచిదని సలహా యిచ్చాయి.

తెనాలి తాలూకా యువజనోత్సవాలు

జయప్రదం చేయాలని కన్వీనర్ విజ్ఞప్తి

తెనాలి, ఏప్రిల్ 26

తెనాలి తాలూకా యువజనోత్సవాలు మేనెల 8, 9 తేదీలలో తెనాలిలో జరుగుతాయి. వాటిని జయప్రదం చేయాలని తాలూకా యువజన కన్వీనర్ శ్రీ దొప్పలపూడి సాంబశివరావు నేడు విజ్ఞప్తి చేశారు.

ఆయన ప్రకటనలో ఇంకా ఇలావుంది:

మే 8, 9 తేదీలలో తెనాలిలో యువజనోత్సవాలు జరుగుతాయి. యువకులసాంస్కృతిక క్రీడాభిరుచులను పెంపొందించేందుకై యువజనోత్సవాల సందర్భంలో ఏకపాత్రాభినయం, వ్యాసరచన, వక్తృత్వం, చెడుగుడు, పరుగుపందెం, స్లోసైకిల్‌రేస్ మొదలగు పోటీలు నిర్వహింపబడతాయి. తాలూకా యువజనులంతా వీటిలో పాల్గొని యువజనోత్సవాలను జయప్రదంచేయాలనివిజ్ఞప్తి. దరఖాస్తు ఫారాలను వెంటనే క్రింది అడ్రసుకు పంపాలి.

"దొప్పలపూడి సాంబశివరావు, వసంత విహార్, తెనాలి."

భారత పరిశోధనా సంస్థలో హెచ్చు రాజకీయాలు

యుగోస్లావియా శాస్త్ర వేత్త వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25

భారత దేశంలోని పరిశోధనా సంస్థలలో రాజకీయాలు హెచ్చుగా వున్నాయనీ, అయితే రాజకీయ పార్టీల వివాదాల విషయంలో పరిశోధన మాత్రం మరీ తక్కువగా వుందని యుగోస్లావియా అణు విజ్ఞానశాస్త్రవేత్త ప్రొఫెసర్ స్టీవాన్ డెడీజర్ అభిప్రాయం వెలిబుచ్చారు.

ప్రస్తుతం స్వీడన్ యూనివర్శిటీలో సాంఘిక శాస్త్రాల్లో పరిశోధనలు సాగించుచున్న ప్రొఫెసర్ స్టీవాన్ డెడిజర్ నేడిక్కడ పార్లమెంటు సభ్యుల సమావేశంలో ప్రసంగించారు.

భారీ పరిశ్రమల స్థాపనకు రష్యా సాయం

సామ్రాజ్యవాదుల ఒత్తిడిని తట్టుకొనేందుకు తోడ్పడిందని సోవియట్ ఆర్థికవేత్త వివరణ

మాస్కో, ఏప్రిల్ 26

ప్రభుత్వరంగంలో భారీపరిశ్రమలు నిర్మించడానికి భారతదేశం సోవియట్ యూనియన్ తోనూ, ఇతర సోషలిస్టుదేశాలతోనూ సహకరించినందున, "పాశ్చాత్య దేశాల నుండీ, పాశ్చాత్య గుత్త వ్యాపారస్తుల నుండీ వస్తున్న రాజకీయ ఒత్తిడిని" భారతదేశం నిగ్రహించ గలిగిందని ప్రముఖ సోవియట్ ఆర్థికశాస్త్రవేత్త ఇ. తె. సెమినోవ్ ఒక వ్యాసంలో రాసినారు.

"భారత దేశంతో సోవియట్ యూనియన్ తదితర సోషలిస్టు దేశాల ఆర్థిక సహకారం" అన్న వ్యాసంలో ఈ అంచనా వేయబడింది.

"ఆసియా-ఆఫ్రికా ప్రజలు" అనే పత్రిక యొక్క ఇటీవలి సంచికలో ఈ వ్యాసం ప్రచురింపబడింది. అందులో ఇలా ఉంది: భారీ పరిశ్రమలోని ముఖ్యరంగాలలో భారత ప్రభుత్వం నుండి సౌకర్యాలు పొందడానికి భారత దేశ ప్రతినిధులూ, విదేశీ గుత్త సంస్థలూ ప్రయత్నిస్తున్న ఈనాడు భారత దేశ స్వయం సమృద్ధికి భౌతిక సాంకేతిక ప్రాతిపదికను సృష్టిస్తున్న సోవియట్ యూనియన్ తదితర సోషలిస్టు దేశాల ఆర్థిక సహాయం చాలా ముఖ్యమైనది.

భారతదేశ పారిశ్రామికీకరణను పాశ్చాత్య దేశాలు నిరంతరం వ్యతిరేకిస్తూ, సహాయం పేరుతో వ్యవసాయ ఉత్పత్తులనూ వినిమయ వస్తువులనూ భారత దేశం మీద రుద్దుతున్నాయని ఆ వ్యాసం వెల్లడించింది. కానీ భారీ పరిశ్రమల నిర్మాణానికి భారత దేశం సోవియట్ యూనియన్ నుండీ యితర సోషలిస్టు దేశాల నుండీ సహాయం పొందడం ప్రారంభమైనప్పుడు పాశ్చాత్య దేశాలు తమ ధోరణిని కొంతవరకు మార్చుకోక తప్పలేదు.

భిలాయి ఉక్కు కర్మాగారం నిర్మించటానికి సోవియట్ యూనియన్ అంగీకరించిన తర్వాతనే పశ్చిమ జర్మనీ, బ్రిటన్. అటువంటి ఉక్కు కర్మాగారాలు నిర్మించటానికి యెక్కువ ఆసక్తి కనబరచినాయని ఆ వ్యాసం వ్యక్తపరచింది.

భారతదేశం సామ్రాజ్యవాద రాజ్యాలతో తనకుగల సన్నిహితమైనశ్రమ విభజనను మార్చుకోడానికి సోషలిస్టు దేశాలతో వ్యాపారం సాయపడుతున్నది. అది భారతదేశ పారిశ్రామికీకరణను త్వరితపరచి ఆర్థికస్వయంసమృద్ధికి జరిగే పోరాటంలో తోడ్పడుతుంది" అని ఆ వ్యాసం వ్యక్తం చేసింది.

పాశ్చాత్యదేశాలయిచ్చే యీ సహకారం యొక్క ప్రభావం గురించి ఆవ్యాసంలో ఇలా వుంది. "సోషలిస్టు సమాజంతో భారతదేశ సహకారం, సామ్రాజ్యవాద గుత్తసంస్థలతో గల సంబంధాల దృష్ట్యా ప్రభుత్వ రంగాన్ని బలపరిచి, అమెరికా బ్రిటన్ పశ్చిమ జర్మనీలు [illegible] భారత ప్రభుత్వ [illegible] పథకాలలో [illegible] పరిస్థితి ఏర్పడుతుంది.

"భారత ప్రభుత్వానికి అనుకూలమైన షరతులమీద భిలాయి ఉక్కుకర్మాగారనిర్మాణంలో సహకరించడానికి సోవియట్ యూనియన్ అంగీకరించినప్పుడు, బొకారో లోహ కర్మాగారనిర్మాణ ఒప్పందంలో [illegible] గుత్త సంస్థలు విధించిన [illegible] భారత దేశం పూర్తింప గల్గింది. (12 శాతం నుండి 6 శాతానికి వడ్డీ తగ్గించబడింది. కంపెనీ జాయింటు స్టాకు పెట్టుబడిలో పశ్చిమ జర్మనీ కంపెనీల భాగస్వామ్యం నివారింపబడింది. కర్మాగార శక్తి రెట్టింపు చేయబడింది.) దుర్గాపూర్‌లో మూడవ ఉక్కు కర్మాగార నిర్మాణానికి బ్రిటిష్ ప్రభుత్వంతోను, కొన్ని బ్రిటిష్ బ్యాంకులతోనూ, కంపెనీలతోనూ భారతదేశం ఒప్పందం చేసుకోగలిగింది."

ఆ వ్యాసంలో యింకా యిలావుంది: "అమెరికా పశ్చిమజర్మనీ పెట్టుబడిదార్లకు పోటీగా తమస్థితిని దృఢపరచుకోడానికి బ్రిటిషు గుత్త పెట్టుబడిదార్లు భోపాల్ ప్రభుత్వ భారీ విద్యుత్పరికరాల కర్మాగార నిర్మాణానికి పెట్టుబడి పెట్టుతున్నారు. కానీ, యీ సామ్రాజ్యవాద దేశాలు భారత ప్రభుత్వ కర్మాగారాల నిర్మాణంలో పెట్టేపెట్టుబడి అంతా, "సహాయం" అనేపేరుతో వారు యిచ్చే మొత్తంలో స్వల్ప భాగం మాత్రమే."

సోవియట్ యూనియనూ, యితర సోషలిస్టుదేశాలూ భారతదేశ భారీపరిశ్రమల నిర్మాణానికి, భారతదేశ స్వతంత్ర ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేయడానికి సహాయపడినాయని ఆ వ్యాసం వ్యక్తపరిచింది. "పెట్టుబడిదారీ దేశాల నుండి భారతదేశం తెచ్చుకోలేని పరికరాలను సోషలిస్టు రాజ్యాలు యిచ్చినాయి."

సహాయ పరిమాణం గురించి ఆవ్యాసం యిలా తెలియజేసింది: "భారతదేశానికి సోషలిస్టుదేశాలు యిచ్చే ఋణాలు భారీపరిశ్రమల నిర్మాణానికి ఉద్దేశింపబడినాయి. 384 కోట్ల రూపాయలవరకు వున్న సోవియట్ ఋణాలన్నీ భారత పరిశ్రమలలో కీలకరంగాలలో భారీకర్మాగారాలు నిర్మించడానికి 3వ పంచవర్ష ప్రణాళికలో నిర్ణయించబడినట్లు పరిశ్రమలలో ప్రభుత్వ పెట్టుబడులు 12 శాతం వుండేటట్లు చూడడానికి ఉద్దేశింపబడినాయి.

"సోషలిస్టు చెకొస్లొవేకియా నుండి వచ్చే సాంకేతిక ఆర్థిక సహకారం దాదాపు అంతా భారీ పరిశ్రమల నిర్మాణానికే వినియోగింపబడుతున్నది. రుమేనియా యిచ్చిన 5 కోట్ల 20 లక్షల రూపాయల ఋణం గౌహతిలో నూనె శుద్ధికర్మాగార నిర్మాణానికి ఖర్చుపెట్టబడింది. పోలెండు భారీపరిశ్రమలకు 21 కోట్ల 80 లక్షల రూపాయల ఋణం యిచ్చింది. ప్రభుత్వ అల్యూమినియం పరిశ్రమకూ, యితర పరిశ్రమలకూ 78 కోట్ల రూపాయల ఋణం యివ్వడానికి 1961 లో హంగేరీ తన సంసిద్ధతను తెలియజేసింది.

"సోషలిస్టు దేశాలు భారత దేశానికి తక్కువ వడ్డీ-2.5 శాతం వడ్డీ-తో ఋణాలు యిస్తున్నాయి. ఋణాలు 12 ఏండ్లలో (కొన్ని సందర్భాలలో 8 ఏండ్లలో) తీర్చుకోవాలి. ఒప్పందంమేరకు సామగ్రి అందచేయబడిన తర్వాత 12 మాసాలకు బాకీ చెల్లింపులు మొదలౌతాయి."

జపాన్‌కు చైనా బియ్యం ఎగుమతి

టోకియో, ఏప్రిల్ 26

జపానుకు లక్ష టన్నుల బియ్యం [illegible] చైనా [illegible] అని జపాన్ వ్యాపారులు అంటున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల కరువుభత్యం పెంచాలి

వేతనకమిషన్ సిఫార్సు మేరకైనా యిది తప్పనిసరి అని ఎ. ఐ. టి. యు. సి. విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27

వేతనకమిషన్ రూపొందించిన అసంతృప్తికరమైన సూత్రం మేరకైనా ప్రభుత్వోద్యోగుల అధికధరల అలవెన్సు పెంచాలని కోరుతూ, అఖిల భారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ కార్యదర్శివర్గం ఈ వారం ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసింది.

"ఉద్యోగుల ధరల అలవెన్సు కోర్కెను ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని కోరుతున్నాం. వరుసగా పన్నెండు మాసాల్లో ధరలు సగటున 10 పాయింట్లు పెరిగితే, ఉద్యోగుల అలవెన్సు పెంచాలని వేతకమిషన్ సిఫార్సు చేసింది. ఈ సిఫార్సు యెంతో అసంతృప్తికరమైనదని మేము భావిస్తున్నా. 1964 జనవరిలో జీవనవ్యయ సూచిక 140 పాయింట్లకు చేరినదృష్ట్యా ఈ సిఫార్సును ప్రభుత్వం వెంటనే అమలుజరిపి తీరాలి.

"1964 ఫిబ్రవరిలో అఖిలభారత జీవన వ్యయసూచి 164 పాయింట్లున్నది. అంతే మొత్తం 24 కేంద్రాలలోనూ ఆరింటిలో మాత్రమే యీ సూచికలను సర్దుబాటు చేసిన ఫలితంగా గత నవంబర్ నుండి నాలుగు పాయింట్ల తేడా వెల్లడైంది. జీవన వ్యయసూచికల తయారీలో చాలా అక్రమాలుజరుగుతున్నాయనీ, నిపుణులకమిటీ పరిశీలనలో యివి పాక్షికంగామాత్రమేవెల్లడైనాయనీ. ఈవిషయంలో సమగ్రమైన దర్యాప్తు జరిపించడం అవసరమనీ కార్మిక సంఘాలు జరుపుతున్న ఆందోళన సబబేననేవిషయం యిది రుజువు చేస్తున్నది. అన్ని కేంద్రాలలోనూ జీవనవ్యయ సూచికలను సరిచేయాలని, వాటి ఆధారంగా అఖిలభారత వినిమయ వస్తుసూచికను కూడా సరిచేయాలని అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కోరుతున్నది.

"ఫిబ్రవరి మాసంలో సూచిక 142 పాయింట్లు దాటినందున జీవిత బీమా ఉద్యోగుల అలవెన్సునుకూడా పునః పరిశీలనచేయాల్సివుంటుంది. ప్రభుత్వం ఈ విషయంలో ఏమాత్రం తాత్సారం చేయకుండా తగుచర్య తీసుకొంటుందని ఆశిస్తున్నాం.

"కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల అధిక ధరల అలవెన్సు సూత్రాన్ని కూడా మరింత వాస్తవికంగా వుండేలా, ఉద్యోగులకు ప్రయోజనకరంగా మార్చేటందుకు చర్యలు తీసుకోవాలి. అత్యధికసంఖ్య ఉద్యోగులసంఘాల డిమాండు మేరకు, యీ అలవెన్సును ప్రతి ఆరు మాసాలకు ఒకసారి సమీక్షించాలి. ప్రస్తుతం వున్న యేర్పాటు ధరల అలవెన్సుకు జీవనవ్యయ సూచికలతో సర్దుబాటు చేయాలనే సూత్రానికి ఆచరణ రీత్యా పొత్తిగా అర్థంలేకుండా చేసివేసింది." అని యీ ప్రకటన వివరించింది.

బోదవాడ గ్రామస్థుని హత్య

ప్రత్యర్థి ముఠాచే

నందిగామ, ఏప్రిల్ 26

ఈ నెల 22 వ తేదీన బోదవాడ గ్రామస్థులు శ్రీ పిల్లుల వెంకటేశ్వర్లు, శ్రీ దారా[illegible], కరీం భిక్షం, బండి కోటయ్యగారలు నందిగామ కోర్టులో కేసుకు హాజరై తిరిగి యింటికి వస్తుండగా, వారి ప్రత్యర్థి ముఠావారు తక్కువ దార్లో తీసుకుంటామని లారీలో ఎక్కించుకొని ముక్కపాడు డొంక సమీపానికి లారీని తీసుకు వెళ్ళారు. అక్కడ అప్పటికే కాచుకున్న వారి ముఠావారు కర్రలతో, బరిసెలతో ఈనలుగురినిచితకకొట్టారు. దాని ఫలితంగా శ్రీ పిల్లుల వెంకటేశ్వర్లు చనిపోయారు, మిగత ముగ్గురికి ప్రమాదకరమయిన గాయాలు తగిలాయి.

ఆ గ్రామంలో మూడు సంవత్సరాలనాడు గ్రామపార్టీలుఏర్పడి, అశాంతిపరిస్థితిఏర్పడింది. అందువేత రెండు సంవత్సరాల నాడు ఆ గ్రామంలో రిజర్వుపోలీసును ప్రత్యేకంగా కాపలా పెట్టారు. ఇప్పుడు ఈ హత్యపై నందిగామ పోలీసులువిచారణ జరుపుతున్నారు.

లోక్‌సభలో ఆర్థికబిల్లుపై చర్చ

కమ్యూనిస్టుసభ్యుడు శ్రీ లక్ష్మీదాస్ ప్రసంగం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26

జాతీయ ఆదాయం పెరిగినప్పటికీ, పెరిగిన ఆదాయంలో ఎక్కువభాగం గుత్తాధిపతుల, పెట్టుబడిదార్ల చేతుల్లోకి పోయిందిగానీ, సామాన్య మానవునికి దక్కలేదని కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ పి. లక్ష్మీదాస్ యిటీవల లోక్‌సభలో ఆర్థిక బిల్లుపై చర్చ సందర్భంలో మాట్లాడుతూ చెప్పారు.

శ్రీ దాస్ తన ప్రసంగంలో యింకా ఇలా చెప్పారు:

"స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నేడు మనం పదునెనిమిదవ బడ్జెట్టును చర్చిస్తున్నాం. అందువలన అన్నిరంగాలలోనూ మనదేశం ఎంత అభివృద్ధి సాధించింది. సమీక్ష చేసుకోవటం అవసరం. జాతీయ ఆదాయం పెరిగినప్పటికీ అందులో ఎక్కువభాగం గుత్తాధిపతుల, పెట్టుబడిదార్ల చేతుల్లోకి పోయిందిగానీ, సామాన్య మానవునికి దక్కలేదు. అందువలన పేదలు మరింత పేదలవుతున్నారు, ధనికులు మరింత ధనికులౌతున్నారు. సగటు ఆదాయం17.1శాతం పెరిగింది. పదిసంవత్సరాలక్రితం సామాన్య మానవుని సగటు ఆదాయము మూడున్నర అణాలు. నేడు ఆరు అణాలు. పెట్టుబడిదారులు 25 నుండి 40 రకాల వస్తువులపై లాభాలు గుంజుతున్నారు. ఇంతే కాకుండా 1951 నాటికి దేశంలో మూడు లక్షలమంది నిరుద్యోగులు ఉన్నారు. కాని వీరి సంఖ్య నేడు 23 లక్షలకు పెరిగింది. వీరుకాక అరకొరగా తమ పేర్లను నమోదు చేయించుకోని వారు లక్షలకొలదీ ఉన్నారు.

"దేశానికి వెంటనే ఉపయోగపడని దీర్ఘకాలిక ప్రణాళికలవలన ఎక్కువ ఉపయోగం ఉండకపోవచ్చు. ఉదాహరణకు నాగార్జున సాగర్ ప్రాజెక్టును తీసుకోండి.

"ఇది ప్రారంభించి తొమ్మిది సంవత్సరాలు అయ్యింది. ఇంతవరకూ పూర్తికాలేదు. ఈ ప్రాజెక్టువలన యింతవరకు ప్రజలు లాభపడక పోగా, ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం దీనివలన ఎంతో యిబ్బంది పడుతోంది. తొలుత ఈ ప్రాజెక్టు నిర్మాణానికి వేసిన అంచనా 90 కోట్ల రూపాయలు. కాని యిప్పుడు ఆ అంచనా 140 కోట్లరూపాయలకు పెరిగింది. ఈ భారమును భరించే స్థితిలో ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వంలేదు.

ఈ ప్రాజెక్టును జాతీయప్రాజెక్టుగా గుర్తించి దీని నిర్వహణా బాధ్యత కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలని ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి కూడా చేసింది. కాని యీవిషయంలో మాత్రం కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూవచ్చింది. ఈ ప్రాజెక్టును వీలైనంత తొందరలో కేంద్ర ప్రభుత్వం తీసుకొని పూర్తిచేయాలని కోరుతున్నాను.

"అయినప్పటికీ [illegible] పంచాయతీరాజ్యం మూలకంగాగానీ, [illegible] కేంద్రాల మూలకంగాగానీ, ప్రజలకేమీ లాభం కలుగటం లేదు. హరిజనులపట్ల అంటరానితనం, వారి ఆర్థిక, సాంఘిక అభివృద్ధి ఇప్పటికీ యథాస్థితిగానే ఉన్నాయి. అయిదు సంవత్సరాలనుండి హరిజనుల ఇండ్లస్థలాలసమస్య పరిష్కారం కాలేదు. పంచాయతీలలో హరిజనులను పేరుకు మాత్రం సభ్యులుగా చేశారు. ఇతర సభ్యులతోపాటుగా వారిని చూడటం లేదు. పూర్వకాలంనుండీ సాగుతున్న మాదిరిగానే, అవమానించటం యింకా జరుగుతూనే ఉంది. పరిపాలనా వికేంద్రీకరణకు బదులు, పటేళ్ళు, పట్వారీలు, జమీందార్లు, భూస్వాముల చేతుల్లో పరిపాలన కేంద్రీకరించ బడుతోంది. వికేంద్రీకరణ పథకం క్రింద కూడా వారిదే పైచేయిగా ఉంది. ఈహెచ్చు తగ్గులను తొలగించటానికి, ప్రజల్ని దోచుకున్న వారిని పంచాయతీ సభ్యులుగా పదిహేను సంవత్సరాల వరకు నిలబడకూడదని నిషేధించాలని సూచిస్తున్నాను. ఇందుమూలకంగా హరిజనుల సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయి."

తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ శ్రీ లక్ష్మీదాస్ "చైనా, కాశ్మీరు సమస్యలను ప్రస్తావించి, యీ రెండు సమస్యలపైనా ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతోందన్నారు. ఇది మన పెరుగుతున్న ఆర్థికభారానికి ఎంతో దెబ్బ. అందువలన చైనాతో శాంతియుత సంప్రదింపులకు వెంటనే పూనుకోవాలన్నారు. కాశ్మీర్ విషయంలో ఉభయపార్టీలకు అంగీకారమైన మార్గం గురించి ఆలోచించాలన్నారు, గాంధీజీ [illegible] స్వాతంత్ర్యం [illegible] అదేవిధంగా, పండిట్ నెహ్రూ బ్రతికి వుండగానే చైనా, కాశ్మీరు సమస్యలు పరిష్కారం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇది తన ఒక్కని అభిప్రాయమే కాదని, భారత ప్రజలలో మెజారిటీ యిదే కోరుతున్నారని చెప్పారు.

జిల్లా మునిసిపల్ కార్మికుల సదస్సు

గుంటూరు, ఏప్రిల్ 20

19 వ తేదీ ఆదివారంనాడు గుంటూరుజిల్లా మునిసిపల్ కార్మికుల సదస్సు శ్రీ మహమ్మద్ హనీఫ్ అధ్యక్షతన జరిగినది.

జిల్లా నలుమూలలనుండి ప్రతినిధులు హాజరైనారు.

రు 26-1-40 స్కేలును స్థానిక సంస్థల కార్మికులందరికీ వర్తింపచేయాలనీ, జిల్లాలోని కార్మికులందరికీ పనిభారం తగ్గించి, జి. ఓ. ప్రకారం అదనపు స్టాఫ్‌ను నియమించాలనీ, ధరల సూచికనుబట్టి కరువుభత్యం పెంచాలనీ, వార్షికంగా వెంటనే రు 10 ల కరువుభత్యం పెంచాలనీ, ప్రావిడెంటుఫండు, బోనసు స్కీము కేంద్ర ప్రభుత్వ రేట్ల మేరకు వర్తింపచేయాలని, 1964 ఏప్రిల్‌నుండి ప్రభుత్వం పెంచిన రు 5/- ల కరువుభత్యం, కంటిజెన్సీ, వర్క్ చార్జిడ్ కార్మికులందరికీ వర్తింపచేయాలనీ సభలో తీర్మానించారు. రాష్ట్ర మునిసిపల్ కార్మికుల సదస్సును నరసరావుపేటలో జరుపుటకుగాను, చర్యలు తీసుకొనుటకు రాష్ట్ర కమిటీని కోరుతూ తీర్మానం చేశారు.

తీర్మానాల అనంతరం ఈ క్రింది జిల్లా వర్కింగ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శ్రీ మహమ్మద్ హనీఫ్ (బాపట్ల) అధ్యక్షులు, శ్రీ పోపూరి బ్రహ్మానందం (నరసరావుపేట) ఉపాధ్యక్షులు, శ్రీ ఎ. సి. మోసెస్. ముని (గుంటూరు) ప్రధాన కార్యదర్శి, శ్రీ కె. ఎల్. నరసింహం (ఒంగోలు) కార్యదర్శి, శ్రీ భూపతి వీరరాఘవులు (గుంటూరు) కోశాధికారిగాను ఎన్నుకొన్నారు. ఇంకా ఆరుగురిని వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నుకొన్నారు.

ఒంగోలు మునిసిపల్ వర్కర్సు యూనియన్

ఒంగోలు, ఏప్రిల్ 22

ఒంగోలు మునిసిపల్ వర్కర్సు యూనియన్ జనరల్‌బాడీ సమావేశం నిన్న శ్రీ కె. సాంబయ్య అధ్యక్షతన జరిగింది. నూతన సంవత్సరమునకు అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీ కరవది వెంకటేశ్వర్లు, శ్రీ డి. టి. మోజెస్‌గార్లను, 14 మంది కమిటీ సభ్యులుగను ఎన్నుకున్నారు.

తర్వాత కార్మికులకు జీతం రు. 5-00 లు పెంచే విషయమున్నూ, బదిలీ కార్మికులకు, మామూలు కార్మికులతో సమాన వేతనము యిచ్చే విషయమున్నూ, కార్మికులు కేశవ స్వామిపేటలో లైట్లు, [illegible] పెట్టించే విషయమున్నూ, తీర్మానములు చేయబడినవి.

సమావేశానంతరం కార్మికులు, కమిటీ సభ్యులు కలిసి మునిసిపల్ ఆఫీసుకు వెళ్ళి కమీషనరును కల్సుకొని, కార్మికుల తీర్మానములన్నియు సమర్పించారు. అందుమీదట కమీషనరు వారి తీర్మానములను సానుభూతితో పరిశీలింపగలనని కార్మికులకుచెప్పారు.(వి. వి)

నాగార్జున సారస్వత సాంస్కృతిక సమితి

విజయపురి, ఏప్రిల్ 20

నాగార్జున సారస్వత సాంస్కృతిక సభ స్థానిక హైస్కూలు ఆవరణలో ఇటీవల జరిగింది. శ్రీ టి. భావనారాయణ, సూపరింటెండింగ్ ఇంజనీర్ అధ్యక్షత వహించారు. డాక్టరు వి. ఏ. సహానీ (ఆంగ్లోపన్యాసకులు ఉస్మానియా విశ్వవిద్యాలయం) బెర్నార్డ్ షా గొప్పతనాన్ని వివరిస్తూ, యిలా అన్నారు: "ఇరవయ్యవ శతాబ్దపు ఆంగ్ల నాటక కర్తలలో, షా అగ్రగణ్యుడు. నాటకాన్ని సాధనంగా తీసుకొని మానవ జీవితానికి, షా ఒక క్రొత్త అర్థము చెప్పాడు. సంఘంలోనున్న ఆర్థిక అసమానతం నిర్మూలనకై తన విప్లవ శంఖాన్ని పూరించాడు. ఆంగ్ల సాహిత్య చరిత్రలో షా పేరు చిరస్థాయిగా నిలుస్తుంది.

శ్రీ కాకాని నరసింహారావు (ప్రముఖకవి) 'కవి - కవిత్వము' ను గూర్చి ఉపన్యసించారు.

అజంతా ఆర్ట్సు అసోసియేషన్ వారిచే 'పంత వేదాంతం' ఏకాంకిక ప్రదర్శింపబడింది.

వేలాది హిందుముస్లిం ప్రజల శాంతి ప్రదర్శన

రూర్కెలా, ఏప్రిల్ 27

ఈ పారిశ్రామిక నగరాన్ని అతలాకుతలం చేసివేసిన మత కలహాల అనంతరం నిన్న ఇక్కడ పెద్దఎత్తున శాంతి ప్రదర్శన జరిగింది.

నగరంలో తిరిగి శాంతి నెలకొనడమును సూచనగా [illegible] ఒక శాంతి యాత్ర జరిపే వేలాది ప్రజలు వీధుల్లోనికి వచ్చి "హిందూ ముస్లిం భాయిభాయి" అనే నినాదాలతో స్వాగతమిచ్చారు. ప్రదర్శకులకు వారు తీపిపదార్థాలు యిచ్చారు.

అక్రమ జప్తులపై తా॥ కమ్యూనిస్టు నాయకుని ఖండన

గుంతకల్, ఏప్రిల్ 26

"ఉరవకొండ సబ్‌తాలూకా హెంచనహాళ గ్రామంలో రెవిన్యూఅధికారులు న్యాయవివక్షణ లేకుండా, దౌర్జన్యంగా జప్తులు అందులోను సామూహిక జప్తులు చేయడాన్ని ఖండిస్తూ గుత్తి తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ బి. టి. పక్కీరప్పగారు క్రింది ప్రకటన చేశారు:

"వరుసగా నాలుగేళ్ళనుండి వరుణ దేవుడు కరుణచూపక, పంటలుపండక, పశువులకు మేతలేక, మనుష్యులకు తిండి లేక ఉరవకొండ తాలూకాలో గ్రామములు వదలి హోసపేట ప్రాంతమునకు వలస వెళ్ళి బ్రతికినసంగతి ప్రభుత్వానికి తెలిసినదే. పోనీ ఈ సంవత్సరమయినా పంటలు పండుతాయని అనుకొంటే, ప్రత్తి పొత్తిగా నాశనం అయింది, కొర్ర రెండు అణాలపంట పండినది. ఇక జొన్నలుకూడ ఆ మాత్రమే పండినవి. ఈ పరిస్థితిలోనే, ప్రభుత్వం యిప్పుడు వేసిపుంజే భూమిశిస్తులు తప్పవని మరీ అదనంగా రెండింతలు, మూడింతలు వేసినారు. ఈ పన్నులభారాన్ని మోయలేక రైతులు సతమతమవుతున్న ఈ తరుణంలోనే, శిస్తులవసూళ్ళు, మేత అప్పుల వసూళ్ళు, అన్నీ మొదలపెట్టి గడువులు కూడ యివ్వకుండా, ఎక్కువ పోలీసు బలగంతో, గ్రామం పైబడి జప్తులు చేశారు. కనీసం తినడానికైనా ధాన్యం వుండకుండా, వాళ్ళు ఎంత అనుకుంటే, అన్ని ధాన్యపు మూటలు తీసుకొంటూ, ఏవిధమయిన కొలతలు గాని, కొలవకుండా జప్తులు చేయుచున్నారు. ఇదేమి అన్యాయమనిఅడిగిన నారాయణస్వామి అనే రైతును, దేశరక్షణ చట్టం క్రింద ఏప్రిల్ 19 వ తేదీన అరెస్టు చేశారు. అంతేకాకుండా ఇళ్ళలో యజమానులు లేకున్నా ఇళ్ళల్లోకి వెళ్ళి స్త్రీలను బెదరించి అడ్డగిస్తే ఆవలికి నెట్టి, ఇళ్ళలోవున్న ధాన్యాన్ని బయటికి వేసి, తూకం వేయమంటే నిరాకరించి అక్రమ పద్ధతిలో ధాన్యపుమూటలు తీసుకొని పోతున్నారు, 19 వ తేదీ నుండి, ఈ విధంగా మొత్తం శిస్తుకు రెండింతలు ఎక్కువ ధాన్యపు మూటలు తీసుకొనిపోతున్నారు.

వి. పక్కీరప్ప అనే రైతుకిచ్చిన భూమిశిస్తు డిమాండు నోటీసులో రు 74లు వుండగా బస్తా రు 45 లు విలువచేసే, 4 బస్తాల జొన్నలు తీసుకొనిపోయినారు. అదే విధంగా గ్రామ పంచాయతీ అధ్యక్షులు శ్రీ ఎ. సి. తిప్పారెడ్డి, శ్రీ దండు గట్టయ్య మొదలగు వారి యిండ్లలో అక్రమ జప్తులు జరిగినవి. దీనిపై ప్రభుత్వం తగిన చర్య తీసుకొని న్యాయం చేకూర్చగలరని కోరుచున్నాను."

గోవాలోని జుడీషియల్ కమిషనర్ కోర్టు

హైకోర్టు హోదా కల్పించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25

జుడీషియల్‌కమిషనర్ కోర్టును గోవా, డయ్యూ, డామన్ ప్రాంతాలకు కొన్ని విషయాలలో హైకోర్టుగా ప్రకటించడానికి వీలు కలిగించే అధికారబిల్లును నేడులోక్‌సభ ఆమోదించింది.

గోవా, మహారాష్ట్రప్రాంతాల నుండి ఎన్నికైన సభ్యులు యీ బిల్లును తీవ్రంగా విమర్శించారు. మహారాష్ట్రంలో గోవా విలీనీకరణానికి యీ బిల్లు అడ్డంకిగా తయారౌతుందని వారు విమర్శించారు.

ఆప్రాంతంలోని ప్రజల అభీష్టానుసారమే ఈ బిల్లు తీసుకొస్తున్నామని బిల్లును ప్రవేశపెట్టిన విదేశాంగశాఖ సహాయ మంత్రిణి శ్రీమతి లక్ష్మీమీనన్ తెలియజేశారు.

కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ హోమీదాజీ మాట్లాడుతూ, ఈ బిల్లు [illegible] పద్ధతి చాలా చెడ్డదనీ, ఆ ప్రాంతాలలోని ప్రజలు మూడవ తరగతి పౌరులుగా చిన్నబుచ్చబడతారని చెప్పారు. బొంబాయి హైకోర్టు అధికారాలను గోవాకు కూడా విస్తృత పర్చవచ్చుననీ, మద్రాసు హైకోర్టు అధికారాలను పుదుచ్చేరికి కూడా విస్తృత పర్చవచ్చుననీ చెప్పారు.

ఇండిపెండెంటు సభ్యుడు శ్రీ ఎస్. ఎన్. [illegible] మాట్లాడుతూ, బొంబాయిహైకోర్టు అధికారాన్ని విస్తృత పరుస్తూ లోగడ చేసిన నిర్ణయాన్ని ఎందుకు తిరగదోడ వలసివచ్చిందని ప్రశ్నించారు. ఇదొక వెనుకడుగు అన్నారు.

ఈ బిల్లును ఉపసంహరించు కోవాలని కాంగ్రెస్ సభ్యులు, ప్రతిపక్ష సభ్యులుకూడా కోరారు.

రెండు తలల శిశువు

పోడూరు, ఏప్రిల్ 27

పశ్చిమగోదావరిజిల్లా రావిపాడు కాపురస్తులు మల్లుల సావిత్రమ్మకు ఏప్రిల్ 20 న పోడూరు మిషన్ హాస్పిటల్లో రెండు తలల శిశువు జన్మించింది. ఈ వింతను ప్రజలు గ్రామ గ్రామాలనుండివచ్చి చూచారు. శిశువును విశాఖపట్నం మెడికల్ కాలేజీకి పంపించారు. ప్రసవంకాగానే శిశువు ప్రాణం పోయింది. తల్లి కులాసాగానే యున్నది.

కొట్టాయంవద్ద ఒక్క లారీ మరొకకారుతో ఢీకొనటంవల్ల ముగ్గురు చనిపోయారు.

తుమ్మూరు గ్రామపంచాయతీ

టెండరు ప్రకటన

ఈదిగువ ఉదహరించిన పనులకు సీల్డు వేసిన టెండర్లు తుమ్మూరు గ్రామపంచాయతీ ఆఫీసులో30-4-64వ తేదీ సాయంత్రం4 గంటలు తీసుకొని, అదే తేదీ సాయంత్రం 4-30 గంటలకు తెరువబడును. ఎస్టిమేట్లు విలువలో 5% డిపాజిట్లుకట్టి టెండర్లు దాఖలుచేయవలెను. మిగతా వివరములు పంచాయతీ ఆఫీసు పని చేయువేళలలో తెలుసుకోవలయును.

పనుల వివరం	ఎస్టిమేటు	ధరావత్తు
1. గ్రావెలురోడ్లు రిపేరుచేయుట	రు .12893-00	650-00
2. కల్వర్టులు నిర్మించుట	రు 5320-00	267-50

డిపాజిట్టు చెల్లించని టెండర్లు ఆమోదించ బడవు.

పందపాటి రామారావు,
ప్రెసిడెంటు,
తుమ్మూరు గ్రామపంచాయతీ,
గుంటూరు తాలూకా, 27-4-64.

టెండరు ప్రకటన

కృష్ణాజిల్లా దివితాలూకా యార్లగడ్డ పంచాయతీలో క్రింది పనులు చేయుటకు 5-5-64 సాయంత్రం 3 గంటలలోగా సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. అదేరోజు సాయంత్రం 4 గంటలకు టెండరు దార్ల యెదుట తెరువబడును. ఇతర వివరములు ఆఫీసులో తెలుసుకొనవచ్చును.

3 పనుల ఎస్టిమేట్లు మొత్తం విలువ, రు. 5570/-
డిపాజిట్టు—రు. 280/-

(సం) జి. యల్. నరసింహం,
ప్రెసిడెంటు,
యార్లగడ్డ పంచాయతీ, దివితాలూకా.

గణేశ్
డిలైట్ పంకాలు
భారతదేశమంతటా 3800 పైగా డీలర్లచే అమ్మబడుతూ మంచి డిమాండ్ కల్గివున్నవి.
ది గణేశ్ ఫ్లోరు మిల్స్ కంపెనీ లిమిటెడ్
64-65, నజఫ్‌గఢ్‌రోడ్, న్యూఢిల్లీ - 15
డీలర్‌షిప్‌కోసం దిగువవారికి వ్రాయండి: గణేశ్ ఫ్లోర్‌మిల్స్ కం. లి., సామారంగం చౌక్, విజయవాడ - 1 ♦ కృష్ణాజిల్లాకు ఏజెంట్లు: నవరత్న ఎలక్ట్రికల్స్, కాన్వెంటు వీధి, విజయవాడ ♦ తెలంగాణాకు ఏజెంట్లు: మధుర సౌత్ ఇండియా కార్పొరేషన్ ప్రై. లి., 6-C, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్.
JWT-GF3055

"మీ కారు సర్వీసింగ్"
ప్రత్యేకమైన ఆధునాతన పరికరములతో, గొప్ప అనుభవము కలిగి సుశిక్షితులైన పనివారలతో 'ప్రత్యేకమైన తగ్గింపు'పై మీ అన్నిరకముల కార్ల 'సర్వీసింగ్' చేయగలము.
బస్సులకు రు. 10-00లు
లారీలకు రు. 8-00 లు
కారు మరియు జీపులకు } రు. 7-00 లు
ఒకసారి మా 'సర్వీసింగ్' పరీక్షించి, మా పనితనమును, నిపుణతను గుర్తించండి
ఎల్లప్పుడూ మీ కార్లను మా ఆటో సర్వీసింగ్ స్టేషనుకు పంపండి.
వి. శేషగిరిరావు అండ్ సన్స్
టాటా మెర్సిడెస్ బెంజ్ డీలర్సు - ఆటో సర్వీసింగ్ స్టేషన్
బందరు రోడ్ - విజయవాడ 2
ఫోను: 570 మరియు 2481
గ్రామ్సు TAMER BENZ

సంపాదకవర్గం: కాట్రగడ్డ రాజగోపాలరావు (అధ్యక్షులు) ఏటుకూరి బలరామమూర్తి, తుమ్మల వెంకటరామయ్య. విశాలాంధ్ర విజ్ఞానసమితి తరఫున ఎడిటర్, ప్రింటర్, అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆర్టు ప్రింటర్స్, విజయవాడ-4.